
# శ్రీయుతి

శ్రీమతి వి. జె. లక్ష్మి




ఆ యిద్దరికీ నే కావలసిన దాన్ని.

ఇద్దరనూ బాగా ఎరిగిన దాన్ని. తెలిసిన దాన్నో, పరిచయస్తురాలినో, బంధువునో కాదు — స్నేహితురాల్ని.

అతను మా వూరివాడు. చిన్నప్పటి నుంచీ అందరిచేతా 'మంచివా' డనిపించుకున్నవాడు. నా అన్నదమ్ములకంటె సన్నిహితుడని విశ్వసించదగ్గట్టు నే నెరిగినవాడు.

ఆమె నా ఈడుదే. పొరుగూరైనా హైస్కూలులోనూ కాలేజీలోనూ కలిసి



చదువుకున్న వాళ్ళం. "ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకుంటా'' మని సహాధ్యాయిను లంతా చెప్పుకున్న స్నేహం మాది కాలేజీ చదువు చివరి దశలో—మాలో ఒకరు పురుషులై, మేం పరస్పరం పెళ్ళిచేసుకుని, దాంపత్య జీవితం గడిపితే బాగుండు నన్నంత మమైక్యత ఏర్పడింది. నిజానికి భార్యా భర్తల మన్నట్లే సరసాలాడుకునే వాళ్లం కూడాను ఈ సంగతి పసికట్టిన హాస్టల్ మేట్స్ గేలిచేయజూచినా, మేం మా ఎక సక్కేలు మానలేదు

అలాంటి అకృత్రిమ ఆప్యాయతలకూ ఆనందోత్సాహాలకూ నెలవై, అరమరలూ, అంతరాంతరాలూ, గాఢ బాధ్యతలూ లేని కళాశాలా జీవితాధ్యాయం ముగిసింది నాకు ముందుగా పెళ్ళయింది ఆతర్వాత ఆరు నెల్లకే ఆమెకూ పెళ్ళయింది నా పెళ్ళికి ఆమె ఎంతచక్కగా పెత్తనం చేసిందో, ఆమె పెళ్ళికి నేనంతకంటె ఎక్కువ చక్కగా అధ్వర్యం వహించాను ఎందువల్లనంటే—ఆమె నాకు మా వూర్లో ఆబాల్యంగా తెలిసిన ఆ గుణవంతుణ్ణే పెళ్ళి చేసుకుంది

ఆ పెళ్ళి సంబరంలో నేనాతని తమ్ముణ్ణి; మరి—నా కామె మరదలుగదా ' ఆ ఇరువురూ అందచందాలలోనూ, గుణ గణాలలోనూ, ఆర్థిక స్థితిగతుల్లో కూడా సమ ఉజ్జీలు పైగా మేనత్త మేనమామ బిడ్డలు ఆమె బి. ఏ అతను చదివిందీ అంతేగాని — అయిదా రేళ్ళు పెద్దవాడు గనుక లోకజ్ఞానం, అనుభవం కొంచెం ఎక్కువ అదృష్టవశాత్తూ ఆశించదగిన దానికంటె పెద్ద అంతస్తులో వుద్యోగం లభించడం వల్ల అతనిలో కొత్తగా రీవి ప్రవేశించింది నా నేస్తురాలు ఆజన్మం గానే రీవి గలది

ఆ ఇద్దరి దాంపత్యం—అన్నీ అమరిన మా జంటకు కూడా — అసూయ పడదగి నంత ఆదర్శవంతం కాగలదని, ఆశించాం పెళ్ళికి వచ్చిన పెద్దలూ, వధూవరుల మిత్రులూ కూడా అదే మాటన్నారు నా పెళ్ళికి నాకు కలిగిన సంతోషం ఎంత గొప్పదో—ఈ పెళ్ళికి నా కు కలిగిన సంతోషం కూడా అంత గొప్పదే.

ఈ పెళ్ళయిన కొత్తలో మా వారికీ, అతనికీ ఒక బస్తీలోనే ఉద్యోగాలు కావడంవల్ల—మా రెండు జంటలూ ఎంతో సన్నిహితంగా, మధుర మధురంగా గడపడానికి అవకాశం లభించింది కాని నెల తిరక్కముందే మా వారిని మరో దూరపు బస్తీకి మార్చడంవల్ల—రెండేళ్లుగా ఉత్తర ప్రత్యుత్తరాలే మా నేస్తానికి ఆనవాళ్ళయ్యాయి

ఇన్నాళ్ళకు మళ్ళీ ఈ దంపతులున్న బస్తీకి వచ్చాను. మా తమ్ముడు పెళ్ళికి ఏదో ఏర్పాట్లు చెయ్యాలని నా తలి దండ్రులు పిలిపించగా వచ్చిన దాన్ని — ఆ వివరాలు పట్టించుకోకుండా, ముందుగా

నా నేస్తురాల్ని చూచి రావాలని బయలు దేరాను

## 2

పెళ్ళినాటివరకూ ప్రాణాధికంగా భావించుకున్న స్నేహితులం రెండేళ్ళ తర్వాత కలుసుకున్నాం ఎన్నెన్నో మాట్లాడుకున్నాం మధ్యాహ్నం మెయిలు దిగి, తమ్ముని వసతి గృహానికి వెళ్ళి, స్నానం చేసి బట్టలుమార్చుకోగానే — నాకోసంవచ్చిన రాధిక, తమదాంపత్య జీవిత రమణీయతను వివరించి, నన్నా నందపరిచింది

మధ్యాహ్నానంతరపు కాఫీ వేళయిందని గుర్తించినప్పుడే — మాటలమధ్యలో లేచివెళ్ళి, ఎలెక్ట్రిక్ స్టౌమీద డికాషన్ పెట్టి వచ్చాను రాధిక నావెకనేలేచి వచ్చింది కాబోలు, నే వంటగటిలోంచి బైటికి రాగానే "వంటకు నాయర్ ఉన్నాడని మా అమ్మచెప్పిందే సుశీ" అంది నేను "ఉన్నాడులేరాధికా, పొద్దున ఫోంచెయ్యగానే ఏదోపనుందని గొణిగితే, పోయి రమ్మన్నాను అదీగాక — రాకరాక పాత మొగుడొస్తే ఈ భార్యచేతులారా కాఫీ యివ్వవద్దా!" అన్నాను రాధిక నా నడుంమీద చక్కిలిగింతలు పెడుతూ "మారలేదే మా మారదలూ!" అని మురుసుకుంది

మళ్ళీ సోఫాలో కూర్చున్నతరువాత రాధిక మా దాంపత్య జీవితవిశేషా లడిగింది. ఏమనిచెప్పను? ఎంత ప్రయత్నించినా మాటలు మళ్ళించడం కుదరడం లేదు మధ్యలోలేచివెళ్ళి డికాషన్ ఫిల్టర్‌లో పోసి, ఉప్మాకు బాండీ వేశాను నిజానికి రాధికను మించిన నేస్తం నాకెవ్వరూలేరు అయినా — మనసులోని మాటలు ఆమెతో చెప్పడానికి ఏదో సంకోచం అడ్డువస్తున్నది ఉప్మాప్లేటూ, కాఫీగ్లాసూ తీసుకెళ్ళి రాధికముందు పెట్టాను ఏదో ఎకసక్కెం ఆడాలని అనిపిస్తున్నది తోచిచావడంలేదు.

రాధిక ఉప్మాప్లేటుతీసుకుని, చెంచా గుచ్చుతూ "ఈ భార్య మరీ పూర్వ కాలపు వాసనేస్తున్నదే, భార్యతోకలసి తప్ప, వేరుగా ముందుగా తినేభర్త కాడే వీడు!" అని నవ్వేసింది అంతకంటె చమత్కారభాషిణినని పేరుపడ్డ నాగొంతు పెగలడంలేదు ఆమె అలిగి, చివాలున లేచి, నన్ను వళ్ళోకిలాక్కుని ఉప్మా చెంచా నోట్లోపెట్టింది తినకతప్పలేదు. మధ్యలో పొలమారింది రాధిక "మీ శ్రీవారు ఆఫీసులో టిఫిన్ సేవిస్తూ నిన్నే తలుచుకుంటున్నారు గావల్ను" అంది నేనిక ఏదోఒకటి అనకతప్పలేదు "కావచ్చు! ఈ పాతమగడువచ్చి ఇట్లా బలవంతం చేస్తున్నాడని ఆయనకేం తెలుసూ!" అన్నాను

ఇద్దరం నవ్వుకున్నాం ఆమెమళ్ళీ అడిగింది — మా దాంపత్యంగురించి నేను మళ్ళీ వంటింట్లోకి వెళ్ళాను — మంచినీళ్లు తెస్తాననే నెపంమీద రాధికకేమీ చెప్పలేక

పోవడం మనసుకు ఇరకాటకంగానే వుంది కాని ఏమని చెప్పను ?

మంచినీళ్ళ గ్లాసుతోపాటు మంచిమాట లాలోచించుకువెళ్ళి వప్పజెప్పాను నవ్వించాలని ప్రయత్నించికూడా రాధిక చేత నవ్వించలేకపోయాను ఆమె వింతగాచూస్తున్నది కాఫీతాగుతూ మధ్య లోనే టీపాయ్‌మీదపెట్టి మళ్లీ అడిగింది నేను ముందు వాకిట్లోకి వెళ్ళి తిరిగివచ్చి "ఎవరోవచ్చినట్లు అలికిడై —"అన్నాను రాధిక కళ్ళు చికిలించి మరీచూచింది — నా కళ్ళలోకి కళ్ళుతుడుకు కుంటుంటే- అంతకుముందులేని తడి తగిలింది చెమర్చిన కనుకొలకులు కన్నీటి పడియ లయ్యాయి ఆపుకోలేక గావురుమన్నట్టు గుర్తు.

## 3

"సుశీ! నీ జీవితం వడ్డించిన విస్తరి. అయినా నువ్వెందుకిలా బెంబేలు పడి పోతున్నావో నాకర్థం కావడంలేదు అసలు బాధేమిటో నాకు చెప్పవూ? ఆర్చే తీర్చేపాటి శక్తి లేకపోయినా - నేస్తురాలుగా సానుభూతైనా చూపగలను కదా? చెప్పవూ-నా దగ్గర దాపరికమా!?" అని రాధిక బ్రతిమాలుతున్నది ఎన్ని సార్లడిగినా సుశీల కన్నీరు కార్చడం తప్ప-జవాబు చెప్పడంలేదు. ఊరడిల్ల డమూలేదు.

ఆమె దుఃఖాతిరేకాన్నీ, పెదవుల వణుకునూ, మబ్బులు కమ్ముకుంటున్న ముఖాన్నీ చూడలేక రాధిక తలదించు కుంది ఎన్నిసార్లు ఎన్నివిధాల అడిగినా సమాధానం చెప్పని స్నేహితురాలిని. ఇక ఆమె ఏమని నిర్బంధించగలదూ! తన ప్రాణస్నేహితురాలు తన క్షేమాటా చెప్పనందుకూ, కుమిలిపోతున్నందుకూ రాధిక అసంతృప్తి, అనుతాపంపొందుతూ లేచి. "సరే! ఇక వెళ్ళివస్తా సుశీ రేపొకసారి మా యింటికిరా - తీరుబడి చేసుకుని" అంది

సుశీల అప్పటికీ మాట్లాడలేదు లేచి వెళుతున్న రాధికతో మర్యాదగానైనా అవునో, కాదో అని చెప్పకపోవడం విపరీతమే! ఈ సంగతిని మనసు హెచ్చరిస్తూనే వుంది. హృదయం గొంతుక్కు అడ్డుపడుతున్నది రాధిక ఈ ప్రవర్తనకు విస్తుపోయి, చరచరా బైటికి వెళుతున్నది. సుశీల కన్నీటి ధారాపాతం ఆగని కళ్ళుమూసుకుని ఆ సోఫాలోనే వాలింది

రాధిక ఆ డ్రాయింగ్ రూం దాటి, నడవలోగుండా ముందుగుమ్మంలోనికి వెళ్ళే సరికి వాకిట్లో చిన్నకారు ఆగింది మూర్తి హడావుడిగా కారులోంచి దిగాడు రాధిక క్షణం తటపటాయించేసరికి అతను పవన జవనాశ్వమంత చురుగ్గానడుస్తూ గుమ్మం లోకి రానేవచ్చాడు గుమ్మంలో కాలు పెడుతూ తలెత్తి ఆమెను చూచాడు "మీరా! ఎప్పుడొచ్చారమ్మా? రావు గారేరీ? అంతా బాగున్నారా?!" అని




చూశావా ఆ జంట పక్షులు రెక్కలు వేగంగా కొట్టుకుంటూ ఎంత ఆనందంగా ఆకాశంలో విహరిస్తున్నాయో ?

'మనమూ అలా చేద్దామా ?'

'నేను నా చేతులు అంత తొందరగా ఆడించలేను '

---

ప్రశ్నించాడు రాధిక 'నేను మధ్యాహ్నం మెయిల్లో వచ్చానన్నయ్యా వారు రేపో యెల్లుండో వస్తారు అంతా బాగానే వున్నాంగాని_ఇదేమిటండీ ?' అంది

ఆమె మొదటి వాక్యాలన్నీ తృప్తికరంగావుండి చివరిప్రశ్న ఆశ్చర్యార్థకంగా ధ్వనించడంతో మూర్తి విచిత్రంగా చూచాడు రాధిక నవ్వుతెచ్చుకుంటూ. 'అదే అన్నయ్యా - నన్నుకూడా పెద్దదాన్నిచేసి గారూ అన్నట్టు సంబోధిస్తున్నావేమిటీ ? అంత పరాయిదాన్నయిపోయానా ? అని అడిగింది మూర్తి పొరపాటును గుర్తించినట్టు తడబడుతూ

లేదు లేదమ్మా నా అలవాటు - అంతే ! ఆఁ వెళ్ళిపోతున్నావేం లోపల మీ సుశీల లేదా ?" అని అడిగాడు రాధిక ఏదో గుర్తువచ్చినట్టు గుమ్మం దాటి. మెట్లుదిగుతూనే ఆఁ వుంది వుందిలే అన్నయ్యా-' అంది ఆమె వెళ్ళిపోతూనేవుంది

ఈ ధోరణి మూర్తికి అపూర్వంగా తోచింది ఇంకేమేమో మాట్లాడదామను కున్నవాడు_'ఈ ప్రాణస్నేహితులమధ్య ఏదో విచిత్రసంఘటన జరిగివుంటుం' దనే ఆందోళనతో చకచకా లోపలికి వెళ్ళాడు అతను డ్రాయింగ్ రూంలోకి వెళ్ళేసరికి సుశీల బాధగా కణతలు నొక్కుకుంటున్నది మూర్తి అది గమనించనట్లే, "సుశీ! మీ రాధిక అట్లా వెళుతున్న దేమిటీ? ఏం జరిగిందేమిటీ?" అని ఆదుర్దాగా అడిగాడు రాధిక పేరు వినేసరికి సుశీల నిటారుగా కూర్చుని, కళ్ళు విప్పి - భర్తముఖంలోకి చూచి తెల్లబోయింది

అతను ఆమె కళ్ళల్లో అనేకానేక భావాలు చూచాడులోగడ కాని_ఇంతటి విషాదం ఎన్నడూ చూచివుండలేదు ఆమె ప్రాణప్రదంగా పెంచుకున్న కుక్కపిల్ల చనిపోయినప్పుడు, ఆమెపొందిన వ్యధను తను గమనించి, సముదాయించాడు ఆ సమయంలోకూడా సుశీల కళ్ళలో యింత వేదన అగుపించలేదు ఆ విశాల నయనాలలో నవ్వు చిలిపితనం కోపం_ఇటీవల ఉక్రోషంకూడా తా ననేక కోణాల నుంచి గమనించాడు అసలు ఎక్కువ సార్లు ఆమె ముఖంలోకి చూడకుండానే_ ఆమెనడక మాట, సందర్భాలనుబట్టి ఆమెకళ్లు ఆసమయంలో ఎలావుంటాయో తన మనోనేత్రంలో చిత్రించుకోడం అలవాటయింది తనకు తన ప్రాణాధిక స్నేహితురాలు వచ్చి - అదీ రెండేళ్ళ తర్వాత - మాట్లాడి వెడుతూంటే ఈవిడింత విషాదంలో మునిగి పోవడమేమిటా అని అతనికి ఆశ్చర్యం విభ్రమం మనోవైకల్యం కలిగాయి

సుశీల విశాలనయనాలకు భర్త ముఖంలో మారుతున్న భావాలు స్పష్టంగా అర్థమయ్యాయి ఆమె రెండుచేతులా ఒక్కసారి కళ్ళుతుడుచుకుని లేచి డగ్గుత్తికతో 'రాధిక వెళ్ళిపోయిందా అయ్యో మాటన్నా వినకుండా_" అంటున్నది మూర్తి ఆమెగొంతులో ధ్వనించిన ఆదుర్దాను మించిన ఆతురతతో పిలవనా? అని అడిగాడు ఆమె కలలోనే మాట్లాడుతున్నట్లు 'ఊఁ మీ ఊ' అంది మూర్తి పరుగెత్తినట్లు బైటికి వెళ్ళాడు సుశీల అదిచూస్తూ_కుడిచేతిని సాచి, నోటిమీద బలంగా ఒక్కదెబ్బ కొట్టుకుంది కింది పెదవి బుస్సున పొంగింది 'పెగలదు బుద్ధిలేదు మీరు అనడంచేతకాదూ?'' అని బుసకొట్టి మరో దెబ్బవేసుకుంది పొంగిన పెదవి రక్తం చెమర్చింది ఆమె పిడికిళ్ళు బిగించుకుని పొంగిన పెదవిని తడుపుకుంటూ సోఫాల చుట్టూ కాలికొద్దీ తిరుగుతున్నది

వేగంగా బైటికివెళ్ళిన మూర్తికి తన డ్రయివరు వెనుకసీటు తలుపుతీసి ఏదో అంటుంటే రాధిక తలను అడ్డంగా ఆడించి రోడ్డుమీదికి వెళ్ళడం అగుపించింది "ఏమండీ!_ రాధిగ్గారూ"

చెల్లాయ్ అని ఎలుస్తూనే గేటుదాకా పరుగెత్తాడు ఆమె వెనుదిరిగి చూచింది మూర్తి రండి రండి హ లేదులే చెల్లాయ్ రా రా ఒక్కనిమిషం అని ఎలిచాడు ఆమె వస్తున్నది తనువెనక్కు తిరిగాడు రాధికకు ఆందోళనా తీరలేదు నవ్వూ ఆగడంలేదు ఆ ఇద్దరూ మాట్లాడు కోకుండానే లోపలికి నడిచారు

భర్తా స్నేహాతురాలూ వస్తున్న అడుగుల సవ్వడి వినిఎంచగానే సుశీల మళ్ళీ కళ్ళుతుడుచుకుంది ఒక సోఫా వెనుక సాధ్యమైనంత సామాన్యం గా నుంచో ప్రయత్నిస్తున్నది రాధిక ఆదుర్దాగా తనవేపు ఎస్తుంటే–తాను ధైర్యాన్ని సంతోషాన్ని ప్రదర్శించాలని నవ్వు తెచ్చుకుంటున్నది చిరునవ్వు లొలికించు తున్నాననే అనుకుంటున్నది అయినా రాధిక కళ్ళలో ఆందోళన ఎక్కువైనట్లుంది ఆమె చేతులుసాచి ఎదురుదెబ్బ తగిలి పడిన ఎల్లదగ్గరకు తల్లివచ్చే తీరున తనవేపు వస్తున్నది భర్త తనను చూచీచూడనట్లే అతని గదిలోకి వెళుతున్నాడు సుశీల ఈ మనిషికింత నిర్లిప్తతా అని ఆశ్చర్యంతోపాటు ఆవేశం పొంగుకొచ్చింది

తన భుజంమీద ఒక చేయి వేఎ రెండోచేత్తో తన కిందిపెదవిని తాకిబోయిన రాధికను సుశీల ఒక్క విదిలింపుతో దూరంగా తోఎవేసి తాను ప్రక్కకు తొలుగుతూ భాగ్యం బలగం ఈడుజోడైన భర్తా అమరగానే స్త్రీ జీవితం వడ్డించిన విస్తరవుతుందా రాధికా తింటే తరుగని విస్తరుంటుందా నేతివేపుళ్ళూ పాయసంప్నన్నా విందు భోజనంలోకూడా పచ్చిపచ్చడి లేనికొరత ఓ ఎట్లాన తీరేదేనా ? అని నినదించినట్టు అడిగింది ఆ హారాత్పరిణామం ఆ మాటలతీరు ఆ ప్రశ్నల వెనుకగల ఆర్తీ రాధికను భ్రాన్పడజేశాయి తనను విదిలించడంతో స్నేహాతురాలు చేసిన అమర్యాద రాధిక మనసుకు ఎట్టనేలేదు గుడ్లప్పగించి సుశీలవంకే చూస్తూ నుంచుంది

తన గదిలోకి వెళ్ళి కోటు విప్పుతున్న మూర్తికూడా భార్య నోట వెలువడిన ప్రశ్నలు అర్ధంకాక నివ్వెరపోయాడు ఇక ఎడమచేతిని లాక్కుంటే విడిపోయే కోటును – అవిధంగానే వదలి నేలమీద రాసుకుంటున్నదనైనా గమనించకుండా– అతను వెనక్కి వచ్చాడు సుశీల ఆ ప్రక్కనేవున్న మరో గది గుమ్మంవేపు మాస్తూ ఎడికిళ్ళు బిగించుకుని శక్తులన్నీ కూడదీసుకుంటున్నది ధారాపాతమౌతున్న కన్నీటి నెవరూ చూడకుండా మొహం చాటు చేసుకుంది

అటుమళ్ళిన సుశీల గుమ్మంలోకి ఎచ్చిన మూర్తి – ఇద్దరూ తా నెన్నడూ ఎరుగని వ్యక్తులుగా రూపాంతరం పొందారా అనుకుంది రాధిక జరుగకూడని ఘోరం ఎదో తన కళ్ళెదుటనే

జరుగుతున్నదనే ఆందోళనతో స్నేహితురాలి దగ్గరకు వెళ్ళి "సుశీ, ఏమిటీ ధోరణి ? ఏమిటీ అర్థంలేని పొలికేకలు ? అసలు బాధేమిటో చెప్పకుండా —'' అంటూనే రెండు భుజాలూ పట్టుకుని తనవేపు తిప్పుకో జూచింది. సుశీల వణికే పెదవులను పట్టుబలవంతాన ఆపుకుంటూ ఇటు తిరుగుతున్నది. కొద్దిసేపు కనుమరుగైన భర్త మళ్ళీ గుమ్మంలో నుంచుని తన ముఖంలోకే చూస్తున్నాడు. అతని వాలకం, కళ్ళ లోతుల్లోని ఆందోళనా తృటిలో గమనించిన సుశీల గుండె చెరువై పోయింది.

చివాలున మళ్ళీ అటుతిరిగి, చెరచెరా ఎదుటి గదిలోకి వెళ్ళి, భళ్ళున తలుపులు చేరవేసి, తాను వాటికి జేరగిలబడి — గావురుమంది. రాధిక నయానా భయానా చెప్పినా, భర్త బ్రతిమాలినా ఆమె తలుపులు తీయలేదు సరిగదా — బదులైనా పలుకలేదు. కండ్ల నీరు కుండపోతగా కటిస్థలాలను తడిపి వేయడాన్నయినా ఆపుకోలేకపోయింది.


## 4

ఒకరి మొహాలొకరు విచిత్రంగా, ప్రశ్నార్థకంగా అనేక సార్లు చూచుకున్నారు. కళ్ళతోనే తమ అశక్తతను తెలియజేసుకున్నారు.

చివరికి మూర్తే ఈలోకంలో పడి, కింద జీరాడుతున్న కోటును పూర్తిగా తీసివేసి, భుజాన వేసుకుంటూ : "మీకు చాలా ఆలస్యమైనట్టుంది — కారులో వెళ్ళి రండి చెల్లాయ్'' అన్నాడు. రాధిక "నువ్వన్నా చెప్పు అన్నాయ్ — ఏం జరిగిందేమిటీ ?'' అని బ్రతిమాలుతున్నట్టు అడిగింది. మూర్తి ముఖం కొరడా దెబ్బ తిన్నట్లయింది. "రాధికా ! నాకు తెలిసి కూడా నీ సుశీల నింత వ్యధపడనిస్తాననుకుంటున్నావా ? నువ్వు కూడా నన్నపార్థం చేసుకుంటున్నావా ?'' అని అడిగాడు. అతని గొంతులోని ఆర్తి అతని నిజాయితీని రుజూ చేస్తుంటే, రాధిక ఏమని అనుమానించగలదు ?

"లేదన్నయ్యా ! నీ సంగతి నాకు తెలియదూ ! విరోధిక్కూడా మాట మాత్రం బాధ కలిగించలేవు. కాని-కాని, సుశీ ఎంతడిగినా ఏమీ చెప్పదేం ?'' అంది — కార్లో ఎక్కుతూ. మూర్తి తలుపు వేసి "ఈమధ్య ఎందుకో తరచుగా ఇలా కుమిలిపోతున్నది. నాకర్థంకావడంలేదు. నాకేమిటో భయంగా వుంది చెల్లాయ్...సరే...వెళ్ళిరా'' అని సాగనంపాడు.

సాగనంపి ఇంట్లోకి వెళుతున్న మూర్తినిచూస్తే నాకూ భయంవేసింది. ఇంతకుముందు నే బయలుదేరినపుడు కారుదిగి వస్తూండగా అతనునడిచిన తీరుకూ, ఇప్పుడు లోపలికివెళ్ళిన తీరుకూ హస్తిమశకాంతరం తేడావుంది. టైఫాయిడ్ పడిలేచినవాని నడకలావుందిప్పుడు.



'నిన్న మన కారుని గాంధీనగరంలో రోడ్డుమీద వదిలేసొచ్చానండి.'

'ఏం ? ఇంటిదాకా డ్రైవ్ చేసి తీసుకురాలేకపోయావా ?'

'కాదండి. ఆ చీకట్లో ఏ పార్టు ఎక్కడ ఎగిరిపడిందో వెతకడానికి కష్ట మయిందండి '

---

నామట్టుకునాకే లంఖణాలున్న రోగి నన్నంత అసటగావుంది: కారు మా తమ్ముని యింటివేపు జర్రున జారి పోతున్నట్టుంది. సీటువెనక్కి చేరగిల బడితేగాని ఏదో ఆధరువు ఏర్పడి నట్టనిపించలేదు.

ఎంత వితర్కించుకున్నా సుశీల వ్యధకు కారణమేమిటో తెలియకపోగా, అలాంటికారణం వుండగల అవకాశమైనా ఈషణ్మాత్రమూ గోచరించడం లేదు. నాకు తెలిసినంతవరకు ఇప్పటికీ ఆమె జీవితం వడ్డించినవిస్తరే. మేనరికమైనా అత్తా ఆడబిడ్డల పోరుగాని, బావా మరదుల రాద్ధాంతాలుగాని కలలోకూడా వుండనవసరంలేని సంసారం ఆమెది. ఎందునాలోటు కనిపించని సుశీల— గొంతెమ్మకోరికలకు పోని సుశీల, పప్పులోకి ఉప్పేలేనంతగా బాధపడడందేనికి? మేనమామకొడుకు ఇప్పుడు భర్తగనుక, పురుషసహజమనే ధోరణిలో దాష్టీకం చెలాయిస్తున్నాడా ? అబ్బే — మూర్తి అలాంటివాడు కాగలడని ఊహించలేక పోతున్నాను.

సుశీల ఆక్రోశావేశాలతో అన్నమాట

లన్నీ గుర్తు చేసుకుంటే ఒక్కమాట మాత్రం కొరుకుడుపడకుండా మిగిలిపో తున్నది ''విందుభోజనంలోనైనా పచ్చి పచ్చడిలేని కొరత''తట: ముక్కస్యముక్క గాక-భావార్థం చూచినా సుశీలకు వచ్చిన కొరతేమిటో నాకు అంతుబట్టడంలేదు. పిల్లా పాపా కలగలేదని అంత బాధపడ పడవలసిన వ్యవధీలేదు. నాకే యింకా అది కొరతనిపించడంలేదు. పెళ్ళయిన అయిదారేళ్ళవరకూ పిల్లల తాపత్రయం లేకుంటేనే మంచిదనుకునే స్నేహితులం మేం. సుశీలే ఈ భావాన్ని పాదుకొల్పిన గురువు.

పోనీ – భార్యాభర్తలమధ్య ఏమైనా పొరపొచ్చాలు వచ్చాయేమో ననుకుందా మంటే; ఒక్క వుత్తరంలోనూ ఇలాంటి సూచనలేదు. అతని మీసాల పెరుగు తరుగులగురించికూడా ముచ్చటగా వ్రాసే సుశీల - ఇలాంటి అపభ్రంశం జరిగితే నాకు తెలియజేయకుండా వుండదే ? ఒక వేళ ఇటీవలనే ఏర్పడిన బేధాభిప్రాయ మేదైనానా ?

మూర్తి "నువ్వుకూడా నన్నపార్థం చేసుకుంటున్నావా ?" అన్నమాట ఈ అనుమానాన్ని బలపరుస్తున్నా, అతనా మాటలన్నతీరు అతన్ని శంకించనీయడం లేదు. ఒకవేళ – అతనికి ఇదమిత్థంగా తెలియని వేధాభిప్రాయమేదైనా సుశీలలో కలిగిందేమో ! అంత మాత్రానికే ఇంత వ్యధపడుతూ, పెద్ద రాద్ధాంతంచేసేటంత చిలిపిపిల్లకాదే సుశీల !? సంసారాల్లో అనేకానేక పొరపొచ్చాలు రావడం సహజమేగాని – నాముందు దాచుకోవలసి నంతటివి ఈ సంసారంలో ఏమీ వుండ వనుకుంటాను. ఆఖరుకు – ఒకసారి మావారికీ నాకూ మధ్యజరిగిన కలహాన్ని గురించికూడా సుశీలకు పూర్తిగా వ్రాశాను గదా ! నా అంతర్యానికి తగినట్టు ఆమె కూడా 'చిలిపి చిరుకజ్జాలు పెద్దజేసుకొని, సంసారాన్ని కల్లోలసాగరంచేసుకోకండి' అని సలహా యిచ్చిందిగదా ! మావంటి ప్రాణస్నేహితులక్కూడా చెప్పరాని, చెప్పలేని దాంపత్య రహస్యాలుండేమాట నిజమే. కాని అలాంటివి మధురతరాలే గాని, వ్యధా వ్యసనభరితాలుకావు గదా ! ఇదేదో కడకంటా తేల్చుకుంటేగాని నా మనసు తేరుకునేట్టులేదు.

5

రాధికగారు మమ్మల నిద్దర్నీ ఆజ్ఞా పించగలంత చనువూ, స్నేహం, అభి మానం గలది. కారును తనుగా తీసుకు పోగల ఆమెను, ఇప్పుడు నేను కొంచెం బలవంతంచేసి కారులో ఎక్కించవలసి వచ్చింది.

రెండేళ్ళలో మానవు లెంతైనా మార వచ్చునని నాకు తెలుసు. కాని రాధిక గారుకూడా - నే మర్యాదగా పిలిచినా 'చెల్లాయీ' అనమని బలవంతంచేసి, అలిగి, నెగ్గించుకునే ఆమె కూడా ఈ

సామాన్య విషయంలో ఇంత మారుతుం దనుకోలేదు. అప్పుడప్పుడూ సుశీల కామె వ్రాసిన వుత్తరాలు చూడవలసి వచ్చేది. వాటిల్లో ఆమె నా గురించి వ్రాసిన అంశాలనుబట్టి కూడా ఆమె ఏ మాత్రం మారలేదనే విశ్వసించేవాణ్ణి.

ఒకవేళ — నేనే గోరంతలు కొండం తలు చేసుకుని ఆలోచిస్తున్నానేమో ! సుశీల వాలకం చూచి, అస్తవ్యస్త హృదయంతో వెళుతున్న ఆమెకీ స్వల్ప విషయం అనాలోచిత చర్యే కావచ్చు గదా ! నాకీ మధ్య-ప్రతి దానికీ ఇంతగా ఆలోచించడం మంచిది కాదేమో నని పిస్తున్నది.

కాని ఆలోచించకుండా వుండడం సాధ్యమా ? సుశీల రోజు రోజుకూ - నిష్కారణంగా ఇంత విడ్డూరంగా మారి పోతుంటే నా మనసెలా మిన్నకుంటుంది? నిండు యవ్వనం, పండు భోగభాగ్యాలు, మెండు ఖులాసాలు గల బస్తీ కాపురం. రెండో మాట అనే అలవాటులేని నేను- ఇన్ని ఇంతగా వుండగా ఇంకా సుశీలకు వచ్చిన కొరత ఏమిటి ? ఎంత గుచ్చి గుచ్చి అడిగినా కారణం చెప్పందే నేనేం య్యను ? నా మనసేంకాను ?

పోనీ — మగవాణ్ణిగా నాకు చెప్పలేని ఆవేద నేదైనా ఆమె హృదయంలో గూడుకట్టుకుని వున్నదేమో ననుకుంటే; ఈ పూట తన ప్రాణ స్నేహితురాలైన రాధికగారితోనైనా చెప్పుకోవచ్చుగా ! ఆమెతో ఈవిడ మనసువిప్పి మాట్లాడి నట్టేలేదు. అందుకనే నే వచ్చే సరికి ఆవిడలా వెళ్ళిపోతున్న దనుకోవచ్చు. నాకు కాకరకాయకూర నహించక పోయినా, తను వండినందున తిన్నాననే విషయం కూడా నేస్తురాలికి వ్రాసిన సుశీల; తనకే రహస్య ప్రదేశంలోనో కొత్త మార్పు కలిగితే ఆ సంగతి కూడా వివరంగా వ్రాసే సుశీల — ఈ నాడు రాధికగారితో ఒక్కమాట చెప్పుకుని, హృదయ భారాన్ని తగ్గించుకోలేక పోయిందా !

నిజానికి దంపతులంగా మే మిద్దరం మాట్లాడుకునే మాటలకంటె - ఆమె రాధిక గారికి వ్రాసే వుత్తరాల బరువే ఎక్కువుంటుంది. వారానికి కనీసం రెండుత్తరాలైనా అటూ ఇటూ నడుస్తూంటాయి. అవి నే నింట వుండగా వచ్చినా, మా ఆఫీసు అడ్రసుకు వచ్చినా వాటిని చదవాలని నాకుగా నే నెన్నడూ ప్రయత్నించలేదు. ఎప్పుడైనా - నాకు సంబంధించిన ప్రత్యేక విశేషాలేవైనా వుంటే ఆ వుత్తరం నాకిచ్చి వెళ్ళడం సుశీల కిష్టం. "ఒహో ! నన్ను చదవ మనిగావల్ను రాణిగారి వుద్దేశం !" అనుకుని చదివే వాడిని. రాధికగారు నాపట్ల స్వంత అన్నదమ్ముల మీద కంటె ఎక్కువ ఆప్యాయాభిమానాలు ప్రదర్శించే అంశాలు వ్రాసేది. నాకెంతో సంతోష మయ్యేది. ఆ ఇద్దరి ప్రాణ

స్నేహంవల్లనే గదా - నాకీ రాధికగారి వంటి చెల్లెలు లభించిందని మురుస్తాను.

అంత మంచి స్నేహితురాల్ని సంపాదించుకున్నందువల్ల సుశీల నాకు మరింత దగ్గరైన సుగుణశీల అనిపిస్తుంది. కాని- ఇప్పుడింత ఎడమౌతున్నట్లున్న దేమి? నాకు కాకపోయినా తన నేస్తురాలికైనా మనసులోని మాట చెప్పని ఆవిడ నెవ రోదార్చగలరూ ? !

అక్కడికీ ఆమెను సముదాయించాలని ప్రయత్నించాను. రాధికగార్ని పంపి లోపలికి రాగానే - ఆ గది దగ్గరకే వెళ్ళి "చూడు సుశీలా ! మన రాధిక క్కూడా కష్టం కలిగినట్టుంది. కారణం చెప్ప కుండా ఇలా చేస్తే నాకు మాత్రం ఎలా అర్థమవుతుంది చెప్పు. ఏదీ - ముందు తలుపుతియ్" అని పిలిచాను ఆమె శోకం ఉధృతమయిందేగాని, తలుపులైనా తెరుచుకోలేదు. ఏంచెయ్యను ?

ఆఖరుకు - ఆమె దుఃఖానికి కారణం తెలియక నా మీద నాకే విసుగొచ్చింది. "సుశీలా ! నే తెలిసో తెలియకో ఏ పొరపాటన్నా చేసివుంటే చెప్పు - దయచేసి చెప్పు. నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. తప్పొప్పుకుని నీ క్షమాపణ వేడుకుంటానుగాని, రెండో మాట అనను గదా ! ఏమీ చెప్పకుండా ఎందుకు నన్నిలా ఏడిపిస్తావు రాణీ ? నువ్విలా గుండెలు చెరువు చేసుకుంటే ఇంకా నే బ్రదికెందుకూ ?" అని నెత్తీనోరూ బాదుకున్నాను. ఇక ఆమె గావురు శోకాన్ని వినలేక గుండెలు నులుముకుంటూ ఈవలికి వస్తున్నాను.

నేనిటు రెండడుగులు వేసేసరికి ఆ గది తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. ఆవిడ మూర్తీభవించిన శోక దేవతలా- తల దుబ్బురేగి, కాటుక కళ్ళ కొనల నుంచి చెక్కిళ్ళకూ దవడలకూ జారి, పట్టుకోక నలిగి, కొంగు తడిసి, కళ్ళు ఇరుకుసబడి, ముక్కుపుటా లదరుతూ, నిలువెల్ల వణుకుతూ గుమ్మంలో నుంచుని నా వంక చూస్తున్నది. ఆమెను చూడగానే నా గుండెలు జలదరించినట్లయి ఒక్కడుగు వెనక్కు వేసినట్టున్నాను. మరి నా ముఖంలో ఆమె కేమి కనిపించిందో నా వలెనే వెనక్కు అడుగు వేసింది. నోరు తెరచి ఏదో అనబోయింది.

ఏంచెబుతుందోనని ఆత్రంగా ముందుకు నడిచాను. ఆమె నా వంక భయం భయంగా చూస్తూ తెరచిన నోట మాట రాకుండా మూసుకుంది. అడ్డం పెట్టుకున్న చేతి వ్రేళ్ళ సందుగుండా మళ్లీ కట్టలు తెరచుకున్న దుఃఖార్తి వినిపించింది. వెంటనే నే వెనుదిరిగి నా గదిలోకి వెళుతూ "పలుకే బంగారమైపోయిన నీ చేత ఆ బ్రహ్మదేవుడుకూడా కారణం చెప్పించ లేడనుకుంటాను సుశీలా ! నే నెంత, నా బ్రదుకెంతా ? ?" అనేశాను. నా గదిలోకివచ్చి కోటును



ఇల్లు అద్దెకిచ్చే ఆయన . 'ఈ ఇల్లుని కాస్త గౌరవం, పెద్దమనిషి తరహాగా ఉండే మనుషులకు పీలుగా ఉండేలా మార్పులు చేయించాను.'
'అలాగా, ఐతే మీరు, ఈ ఇంట్లోంచి వచ్చేసి, ఇంకోళ్ళకి అద్దె కివ్వాలనుకుంటున్నారన్నమాట '

---

హేంగర్‌కు తగిలించి, బూట్లు విప్పుకుంటూండగా ఏదో ఢప్పు మని పడినట్లు వినిపించింది. ఏమైతే నేమిలే అని విసుగెత్తింది.

వంట నాయర్‌ను పిలిస్తే పలకలేదు. జవానింకా వచ్చినట్లులేడు. గౌరమ్మ ఊరు వెళ్ళి వారమైనా తిరిగిరాలేదు. అటు వెళితే మళ్ళీ సుశీల శోకమూర్తిని చూడవలసి వస్తుందని, ఇటునుంచే వంట గదిలోకి వెళ్ళాను. ఉప్మాబాండీ మీద మూతలేదు. స్టౌమీది పాలు పొంగి పోగా మిగిలినవి మరగకాగి ఎర్రబడుతున్నాయి. స్విచ్ తీసివేసి, ప్రక్కనే సిద్ధంగావున్న డికాక్షన్‌లో పాలు కలిపి వేశాను. సాసర్లూ చెంచాలూ సిద్ధంగా వున్నా ఉప్మా ముట్టుకోబుద్ధికాలేదు. కప్పులో ఓ చెంచా పంచదార వేసుకుని కాఫీ వంచుకున్నాను. మిగిలిన కాఫీలో రెండు చెంచాల పంచదారవేసి ఫ్లాస్కులో పోస్తున్నాను. సుశీలకు పంచదార ఎక్కువ కావాలి.

నా కప్పు పొగలు చిమ్ముతున్నది. అటు చూస్తూ ఇటు ఫ్లాస్కులో కాఫీ పోస్తున్నానేమో, కొంచెం ఒలికి ఎడమ

పాదం మీద పడి, చురుక్కుమంది. గాభరాగా ఆ కాలును తపతప కొడుతూ ఈవలికి జరుగుతూండగానే సుశీల "ఇదుగో" అని కేక వేసింది. అటు చూచాను. ఆమె అటువైపు గుమ్మంలో పడిపోయినట్లుంది - లేచి నా వేపు వస్తున్నది. ఆమె కళ్ళల్లో మెరుపులు ! ఏమిటీ విచిత్రం అనుకుంటూండగానే సుశీల సుడిగాలిలా నా వద్దకు చేరుకుంది.

నాతో ఏదో చెబుతుందని ఆసక్తితో చూస్తూనే వున్నాను. సుశీల కుడిచేయి సాచి నా ఎడమ చేతిలోని ఫ్లాస్కును ఒక్క ఉదుటున లాక్కో బోయింది. "కాఫీకూడా నీతో కలిపించునేంత నీచు రాల్ని చేస్తున్నావా? ఎంత కసీ?"అంటూనే ఫ్లాస్కు నందుకుంది. నే నవతలికి జరిగానో ఏమో, పట్టు కుదరక ఫ్లాస్కు కింద పడిపోయింది. నేను "అయ్యో, ఫ్లాస్కు" అన్నాను. ఆమె "పోతే పీడా పోయిందిలే! నా కోసం ఓ ఫ్లాస్కు కూడా ఎందుకు—నీ కవసరం లేనిది ?" అని మళ్ళీ క్షణమైనా ఆగకుండా అటు మళ్ళి నా గదిలోకి పరుగెత్తుకు పోయింది

నేను "ఏమిటిది సుశీలా : ఏదైనా వుంటే సూటిగా చెప్పాలి గాని — ఎందు కింత సర్మగర్భంగా వేధిస్తున్నావు ?" అని అడుగుతూ వెనకే వెళ్ళాను. ఆమె అప్పటికే నే హేంగర్‌కు తగిలించిన కోటును సరిజేసింది. చివాలున వంగి నే విడిచి వేసిన బూట్లను అందుకుంటూ "అదేగా నాకుచేతనైంది. నా అసమర్థతను మరింత వెక్కిరింతల పాలు చేస్తావా? :" అంది. నా' కామె మాటల్లో ఒక్కటి కూడా అర్థం కావడం లేదు. ఆమె నా బూట్లు ముట్టుకోవడమే విచిత్రంగా వున్న దనుకుంటుంటే—వాటిని రొమ్ముల దగ్గర పెట్టుకుని పైటచెంగుతో తుడుస్తున్నది.

"సుశీలా! ప్యూన్ వచ్చి తుడవడూ-" అంటుండగానే ఆవిడ కళ్ళు పెద్దవి చేసి నన్ను బెదిరిస్తున్నట్లు చూస్తూ "నా ఇష్టం! నీ కెందుకీ సంగతీ ? వెళ్ళి స్నానం చేసి రావచ్చు" అని మూతి మూడు వంకర్లు తిప్పింది. ఇదీ గమ్మత్తుగానే వుందను కుంటూ బాత్‌రూంలోకి వెళ్ళాను.

## 6

"ఈయన ఇంకా చిన్న పిల్లడేనా!" అని ఆశ్చర్యం వేస్తుంది. మళ్ళీ-ఏ చర్యను పరిశీలించినా "ఇంత పరిణత మనస్కుడా!" అని అబ్బుర పడతాను.

బాత్ రూంలోనుంచి ఆయన బైటికి వచ్చే సరికి — గ్లాస్కో పంచె, లేత నీలి రంగు చొక్కా తీసి డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర పెట్టాను. డ్రాయర్‌లోంచి బంగారు గుండీలు తీసి చొక్కాకు పెడుతున్నాను. ఆయన వస్తూనే నే నేదో వింత మనిషి నన్నట్లు చూస్తున్నారు. ఎందుకోనని అటు తిరిగి డ్రెస్సింగ్ టేబుల్ మీది నిలువు టద్దంలో చూచుకున్నాను.

అపును :- ఒక్క-క్షణం చూస్తే చాలు- ఇంత ఏ్రాసి వాలకంలో వున్న స్త్రీ ఎవరా అని నాకే అనుమానం వేసింది. మళ్ళీ ఆయన్ను చూచే సరికి-వారి ఎర్రని పెదవులు వెలార్చుతున్న చిరునవ్వును పైనల్లని మీసాలుకూడా ఏ మాత్రం దాచ లేక పోతున్నా యనిపించింది. నా కేమిటో ఎన్నడూ లేనంత సిగ్గు వేసింది. చొక్కా- వా రి మీ ద ప డే సి అవతలి గదిలోకి పరుగెత్తుకు పోయాను.

స్నానం చేసి, లేగులాబి షిఫాన్ చీరెకట్టుకుని, అదే రంగు కాష్మీర్ సిల్కు చోళీ-ఆకు పచ్చ డిజైన్లు కలది వేసు కుని, తల దువ్వుకుని, బొట్టూ కాటుకా పెట్టుకుని వారి గదిలోకి వెళ్ళే సరికి, ఆయన చెప్పులు తొడుక్కుంటున్నారు. "అబ్బే! ఆ డ్రెస్సు కా బాటా చెప్పు లేమిటీ? కలకత్తాలో కొన్న మూషేలిక పూ జిం చ డా ని కే నా ?!" అంటూనే ఆ మూషే లందుకున్నాను వాటిని వారి పాదాల దగ్గర పెడుతుంటే - ఆయన రెండు చేతులా అందుకుని, తామే తొడు క్కున్నారు.

వారికి అధిక సంతోషం కలిగినపుడు వెలిగేటటువంటి చిరునవ్వుతో నా కళ్ళ లోకి చూచారు. నా మ న సు కూ డా - మధ్యాహ్నంనుంచీ జరిగిందంతా మరచి పోయినట్లే - మల్లెలు పూ సి న ట్లు యి పోయింది ఆ ఒక్క-చూపుకే. కాని అంత లోనే ఆయన ముఖం చిన్నబోయింది. నేను గాభరా పడుతూండగానే ఆయన, "ఇవాళ స్నేహితులతో సినిమాకు వస్తా నని మాటివ్వడం పొరపాటైపోయింది సుశీలా!" అని నిట్టూర్చారు.

నేను "అందులో పొరపాటేముందీ- అంచక్కా వెళ్ళిరాకా!" అ న్నా ను. ఆయన "నీ కాశాభంగం కలిగించి వెళ తానా, ఛా'' అన్నారు. నేను "ఇందులో నా కాశాభంగం కలిగేదేముందీ? నాకే మాటో యిచ్చి త ప్ప డం లే దు గా? వెళ్ళుదూ!'' అన్నాను. ఆయన "నువ్వు అడక్కపోయినా నాకామాత్రం తెలియ దటోయ్!" అని హుషారుగా లేచి, మళ్ళీ, "సినిమాకా, షికారుకా?'' అంటూనే దోవతీశారు. నేను వారి వూహకాశ్చర్య పడి ఫక్కున నవ్వేశాను.

"నే డ్రెస్ చేసుకుంటే ఇహ వాహ్యా ళికే నన్నమాట! ఎం త ప సి పా ప వంటేనూ ... వెళ్ళిరద్దూ స్నేహితుల కి చ్చి న మా ట తప్పకా!" అన్నాను. ఆయన చట్టున ఆగి, చురుకుతగిలినట్లు నావేపు చూచి "స్నేహితులకు ఫోన్ చేసి క్షమించమని చెప్పుకుంటాన్లే సుశీలా! నువ్వింత ముచ్చటపడితే - నే వేరే వెళ తానా, ఛాఛా'' అంటూ, టెలిఫోన్ వేపు వెళుతున్నారు. నేన్నిజంగా అప్రతిభు రాలనై పోయాను. ఈ మనిషికింకా ఏ విధంగా అర్ధమయ్యేట్టు చెప్పను?

తటాలునవెళ్లి వారు డయల్ చేస్తున్న చేతి నీవలకి లాగివేస్తూ "చాలుచాల్లే...

నేనేం షిక్కార్లక్కాదు ముస్తాబయింది. వెళ్ళిరమ్మంటుంటే అర్థంచేసుకోవేం - షో అబ్బా - సీతో మరీ వేగలేకుండా వున్నానూ" అన్నాను. నా మాటలు అర్థమయ్యో, లేక వాటిసన్న తీరు గ్రహించో ఆయన నన్నొకసారి ఎగాదిగా చూచి, "సరే!" అంటూ పైటికి వెళుతున్నారు.

అప్పటికి నాకు పూర్తి తృప్తి లభించినట్లయింది. గుమ్మంలోకంటా వెళ్ళిన ఆయన అడుగులు తడబడడం గమనించాను. నేన్నాలుగడుగులు ముందుకువేసి "జేబుగుడ్డ తీసుకోరేదా? నేనూ మర్చేపోయాను గావల్ను, పిచ్చిదాన్ని" అన్నాను. ఆయన "నే తీసుకున్నాలే సుశీలా! నువ్వంత గాభరాపడ్డందేనికీ?... నిజంగా, నిజంగా నన్ను వెళ్ళమంటావా?" అని గుచ్చిగుచ్చి అడిగారు. త్రికరణశుద్ధిగా నా భావం అదే అయినపుడు ఇంకేమని చెప్పి నమ్మించను-ఈ అమాయక పురుషునీ? "అబ్బబ్బ! ఇది వొట్టూ దేవుడూ అంటే గాని నా మాటలేవీ నమ్మలేవా ఏమిటీ?" అన్నాను. ఆయన "లేదులేదు సుశీ!" అంటూనే చరచరా వెళ్ళి కారెక్కారు.

మరొక పురుషు డెవరైనా - భార్యకు లేని బాధనుకూడా ఊహించుకుని ఇంత తటపటాయిస్తాడా? స్నేహితుల కిచ్చిన మాటకోసం-భార్య అలిగినా-తమ నిర్ణయాన్ని మార్చుకోరు కదూ! పైగా ఈయన జవానులకిచ్చిన మాటనైనా తప్పించుకోజూచే వ్యక్తి కాదుగదా - స్నేహితుల కిచ్చిన మాటనే నా కోసం త్రోసిరాజనాలని ఎందుకు నిశ్చయించుకోవాలి?

ఏమోనబ్బా - ఇంత పసిమనసూ, అంత పసిడిమనసూ ఒక్కరిలోనే వుంటాయని నేనెన్నడూ ఊహించలేదు. నా భర్త నాకే ప్రతిక్షణం కొత్తవ్యక్తిగా కనపడ్డమా!!

## 7

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత చాలా సేపటివరకూ సుశీల ప్రవర్తన నన్ను కలవరపెడుతూనే వుంది. తర్వాత మా తమ్ముని పెళ్ళి వ్యవహారాలు ముచ్చటించడంలో కొంతస్వస్థత చేకూరుతూంది అంతలోనే సుశీలగారి డ్రయివర్ వచ్చి "అమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా తీసుకురమన్నా"రని పిలిచాడు.

నే తిరిగివచ్చి గంటా గంటన్నరకంటె ఎక్కువ కాలేదు. ఇంతలో ఏం అర్జంటు పని ముంచుకొచ్చిందా అని నాకు గాభరా కలిగింది. "ఏం శంకరయ్యా! ఏం జరిగిందేమిటీ? ఏం పనో?" అని అడిగాను. అతడు "ఏం జరుగుతుందండీ మా దొర యింట్లో?! అమ్మగారే ఎందుకో మిమ్మల్ని పిలుచుకు రమ్మన్నారూ" అని నా ప్రశ్న కాశ్చర్యపోతున్నట్లు చెప్పాడు. నేను బయలుదేరాను.




'ఈ వర్షంలో బ్రిడ్జికింద కూర్చుని చేపలు పడ్తున్నావేమిటోయ్?'
'వర్షంలో తడవకూడదని చేపలన్నీ బ్రిడ్జి క్రిందికి వస్తాయిగా అనుకొని ఇక్కడ గేలం వేశాను'

---

కారులో ఎక్కుతూ· "ఇందాక చెప్పని సంగతులు ఇప్పుడు చెప్పడానికేమో'' ననుకున్నాను. ఇప్పటికైనా సుశీల తన పొరపాటును గుర్తించి వుంటుందని సంతసించాను.

కారు వాకిట్లో ఆగేసరికే సుశీల నా కొరకే ఎదురు చూస్తున్నట్టు ప్రక్కగా నుంచుని తలుపు తీసింది. ''వచ్చావా రాధికా! రా, రా'' అంటూ రెండు చేతులా కావిలించుకుని, నన్ను లోపలికి ఎత్తుకు పోయినంత పనిచేసింది. సుశీలను మళ్ళీ సహజ ధోరణిలో చూచేసరికి— మానసాకాశంలో మధ్యాహ్నంనుంచీ పట్టిన కారు మేఘాలన్నీ దూదిపింజలై కరగిపోయినట్లయింది ''ఏమిటే పిచ్చిపిల్లా!'' అని చక్కిలిగింతలు పెట్టాను.

సుశీల నన్నొదిలి, డ్రాయింగ్ రూంలో మధ్యాహ్నం మేం కూర్చున్న సోఫాలోనే—చిన్నపిల్లలా ఎగిరికూచ్చుంది. నా చేయి పట్టుకుని తన ప్రక్కకు లాక్కుంటూ 'ఇందాక నిన్ను సాగనంపనన్నా లేదు పంచీ మర్యాదా లేకుండా ప్రవర్తించాను కదూ రాధికా? మొగుడు క్షమించేవరకూ పెళ్ళాం మనసు తేరుకుంటుందా? అందుకే అర్జంటుగా పిలిపించాను'' అంది.

నేను ఆమెను ఒరుసుకూర్చుని, గడ్డం గట్టిగా పట్టుకుని కళ్ళల్లోకి చూస్తూ

''ఈ పాత్ర మొగుడి దేముందిగాని–అసలు భర్త క్షమించారా నిన్ను?'' అని సూటిగా అడిగాను. సుశీల ఎందుకో ఫక్కున నవ్వింది. పగలబడి నవ్వింది. పొట్ట చెక్కలయేట్టు నవ్వుతూనే వుంది. నాకిది మరీ విచిత్రంగా వుంది. సూటిగా జవాబు చెప్పక ఈ విపరీతపు నవ్వేమిటి?

''ఏమిటే సుశీ, నువ్వు మరీ అర్థం కాకుండా పోతున్నావూ' పోనీ– ఇంత నవ్వొచ్చిన కారణం ఏమిటో అదన్నా చెప్పూ'' అని రెండు భుజాలూ గట్టిగా పట్టుకుని సంతోషంతో ఊగిపోతున్న దాన్ని ఆపాను. సుశీల ''మీ అన్నయ్యను గురించి పూర్తిగా తెలుసుంటే, నువ్వీ ప్రశ్నలడగవే రాధికా! ఆయనకి నేనేం చేసినా కోపం వుండదు; ఇక క్షమాపణ చెప్పుకోవలసిన అవకాశం ఎక్కడిదీ?! అదేం లేదుగానీ – నువ్వు క్షమిస్తావా లేదా?'' అని అడిగింది.

''నేను మాత్రం క్షమించకుండా వుండ లేనుగాని– నువ్వు చేసిన రాద్ధాంతానికి మూర్తిగారు ఏమీ పట్టించుకోలేదంటే నమ్మలేను. అప్పుడాయన ముఖంలో ఎంత వ్యధ మసలిందో నేను కళ్లారా చూచాను'' అన్నాను.

సుశీలకు నా మాటలు గాఢంగానే విని పించి వుండాలి. ''అప్పటి నా ప్రవర్తన తలుచుకుంటే నాకూ సిగ్గుగానే వుంది రాధికా! కాని...వాస్తవంగానే ఆయనకు నా మీద ఈగ కాలంత కోపం కూడా లేదంటే నమ్ము... ఊ!'' అని నిట్టూ ర్చింది.

ఇప్పటికి నేనూ, మూర్తిగారూ వంద సార్లడిగిన ప్రశ్ననే మళ్ళీ అడగ బోయాను. కాని– ఆ వ్యవధి లేకుండా సుశీలే ''ఒక్కసంగతి విను రాధికా! మీ అన్నయ్య ఎలాంటివారో అర్థమవుతుం దేమో!'' అని మొదలుపెట్టింది; వింటు న్నాను.

''స్నేహితుల యింట దిగి నాకవ సరమేమోనని కారు వెనక్కి పంపిం చారు. అక్కడనుంచి మరెవరి కారుమీదో, రిక్షామీదో సినిమా కెళ్ళవలసిన ఖర్మేం కాలింది చెప్పు? అడదాన్ని నాకేమంత బైట పనులుంటాయి కారుమీద వెళ్ళ డానికీ? ఉన్నా ఆడవాళ్ళు ఎలాగో సర్దు కోవాలిగాని–మగవారు సరిపుచ్చుకుంటూ, స్నేహితుల ఎదుట తమను తాము చిన్న బుచ్చుకోవడం దేనికీ?'' సుశీల ప్రతి మాటనూ బరువుగా, ఆత్మీయంగా చెబు తుంటే నమ్మకుండా వుండలేను.

''ఆయన అంత మెత్తని మనసు కలవాడు కాబట్టేనా– నువ్విట్లా వేధించుకు తింటు న్నావ్?'' అని గట్టిగానే గద్దించినా, చివ రకు నవ్వకుండా వుండలేకపోయాను.

సుశీల నావంక వింతగా చూస్తూ ''నేను వేధించుకు తింటున్నానంటున్నావా రాధికా? నువ్వుకూడా నన్నర్థంచేసుకో లేవా?'' అర్థిస్తున్నట్లు, ఆక్రోశిస్తున్నట్లు అడిగింది. నేను, నా మనసులో తలెత్తు

తున్న ఝ్ ని ఒక మొట్టికాయ వేసి "కాకపోతే మధ్యాహ్నం నీవు ప్రవర్తించిన తీరు ఆయనను సంతోషపెట్టే తీరా, గౌరవించే విధానమా సుశీ? నేనే నీ భర్తనై వుంటే ఆ సమయాన నీవు చేసిన రాద్ధాంతానికి, మొరటుమొగుళ్ళా తిట్టి కొట్టకపోయినా, నాలుక్కేకలు వేసి—నీచేత అసలు కారణం చెప్పించేదాన్ని. కనీసం అలిగైనా అవతలికి వెళ్ళిపోయేదాన్ని. హాయిగా హోటల్లో భోంచేసి, రెండోఆట సినిమా కూడా చూసి వచ్చేదాన్ని" అని చెప్పాను. ఇప్పటికైనా లోకంలోని భార్యాభర్తల తీరు అర్థమై వుంటుందని—ఏం చెబుతుందోనని ఆసక్తితో ఎదురు చూస్తున్నాను.

కాని—సుశీల మళ్ళీ నే నూహించని విధంగానే ప్రవర్తించింది. "మరి ఆయన నీలాంటివారు కాదుగా. ఈ కాలపు పురుషుడూ కాదాయే !!" అని నిట్టూర్చింది అంతలోనే నవ్వు తెచ్చుకుని "నాయర్! ఏదయ్యా కాఫీ" అని వంటగదివేపు చూస్తూ కేకవేసింది. నేనామె ఇంతకు ముందన్న మాటలు నెమరువేసుకుంటుండగానే నాయర్ ట్రేలో రెండు కాఫీలు తెచ్చాడు. "అబ్బ! నే నింతకుముందే మాయింట్లో తాగానే సుశీ" అని నిరాకరించబోతే, ఆమె "అయినాసరే నే నిచ్చింది తాగవలసిందే"నని బలవంతంగా కప్పు నా నోటిదగ్గర పెట్టింది.

నే నది అందుకుని సిప్ చేస్తుంటే, సుశీల రెండోకప్పు తీసుకుని కాఫీ తాగబోతూ "మధ్యాహ్నం నే నిచ్చిన కాఫీ ఒక్క గుటకన్నా తాగినట్టు లేవు. ఇందాక ఈ రూం సర్దబోతే కాఫీ అంతా అలానే వుండిపోయినట్టు కనిపించింది. వెంటనే నీ కోసం కబురంపాను" అంది. నేను "పోన్లే- ఆలస్యంగానైనా ఈ మొగుడి ఆకలి గుర్తుచేసుకున్నావ్, థేంక్స్" అని ఎగతాళి చేశాను. సుశీల నవ్వబోతూ, అంతలోనే ముఖం మ్లానం చేసుకుని "నా తెలివితేట లంతేనేమో! ఆలస్యంగా తప్ప మేలుకోనేమో" అంది.

అంతలో ఇంత విషాదం గొంతులో పొదుకోగలగడం నాకు మరింత విచిత్రమనిపించింది. సుశీల ఏదో నిగూఢ విషాదాంశానికి లోనై, దోవ తెలియని అరణ్యంలో చిక్కుపడ్డ పథికురాలై పోయిందేమోనని నాకు భయం వేసింది. "నువ్వింత దిగులుపడడానికి అసలు కారణం ఏమిటో చెప్పవా సుశీలా ? నీలో నీవు కుమిలిపోతున్నావని మూర్తిగారు కూడా గుండె చెరువు చేసుకుంటున్నారు. నాతో చెప్పు—మార్గాంతరం తోస్తే చెబుతా. అంత చేతకాకపోతే నీ రహస్యవేదనను కడుపులో పెట్టుకు దాచుకుంటానేగాని, రెండోమనిషికి—నా భర్తకైనా సరే—తెలియనివ్వను కదా ! నన్ను నమ్మలేవా సుశీ" అని బ్రతిమాలాను.

సుశీల నా వంక ఆశగా చూస్తూ "నిన్ను కూడా నమ్మలేనిదాన్నా రాధికా! నాకు నీకంటె సన్నిహితు లెవరున్నారు చెప్పు'' అంది. ఇక చెబుతుందను కున్నాను...నాలుగైదుసార్లు ఏదో చెప్ప బోతున్నట్లు పెదవులు కదిలించి కూడా-ఏమీ చెప్పలేదు. అప్పుడే చేతిలోని కప్పు గుర్తు వచ్చినట్లు కాఫీ గటగటా తాగేసింది. కప్పు తీసుకుపొమ్మని నాయర్‌ను కేక వేసింది. ఏదో పని వున్నట్లు తన గదిలోకి వెళ్ళింది.

నే నింకా ఆశతోనే ఎదురు చూస్తున్నాను. కాని, ఆమె తిరిగివచ్చి నా కిచ్చింది వర్ది వక్కపొడి! పైగా అంతకు ముందేమీ జరగనట్లే "మీ తమ్ముడి పెళ్ళయ్యేవరకూ వుంటావుగా రాధికా!?" అని అడుగుతూ నా వొళ్ళో తల పెట్టి, సోఫాలోనే పడుకుంది. నే జవాబివ్వక ముందే "ఆ పెళ్ళికూతురు మంచిదేనట; మీ అన్నయ్యెరుగునట. ఆపిడ తండ్రి వీరిదగ్గర గుమాస్తాట. వంశం, కుటుంబం, అన్నీ మంచివేనన్నారు. ముహూర్తాలు పెట్టించారా?'' అని ధోరణి మార్చింది. నే నన్నిటికీ అవునంటూనే, దాని చెక్కిళ్ళు సవరిస్తూ కళ్ళను పరిశీలిస్తున్నాను. దిగులూ బొగులూ సూచనలైనా లేని సంతోషాసక్తులు మెరవడం చూచి నాకు మళ్ళీ వింతనిపించింది.


ఏమైనా దాని గుండెల లోతుల్ని చూడవలసిందేననీ-నన్ను మాటలు మరపించి మురిపించాలనే ఎత్తులో ౦ వమ్ము చెయ్యాలనీ పట్టుదల కలిగింది. 'ఆ పెళ్ళి సంగతులూ, శుభ విశేషాలూ తర్వాత మాట్లాడుకుందాంగాని-ఇంతకీ నీ దిగులు క్కారణం చెప్పి నా దిగులును పోగొడతావా లేదా?"అని ఖచ్చితంగా అడిగేశాను. సుశీల రివ్వున లేచి, ఫక్కున నవ్వి "ఏమీ లేదులేవోయ్! నాకేం దిగులూ-ఛ! ఆఁ- అటు తోట్లో తిరిగొద్దాం పద కాస్సేపు" అంటూ నన్ను బలవంతంగా, ఇంటిముంగిటి తోటలోకి లాక్కు-వెళ్ళింది.

క్రోటన్స్, పూలమొక్కలు కన్నుల పండువుగా వున్నాయి. వాటిమధ్య వెల్వెట్ గ్రాస్ కాశ్మీరు తివాసీకంటె మెత్తగా వుంది. అలాంటిచోట తిరుగుతూంటే మళ్ళీ వడ్డించిన విస్తరే గుర్తు వచ్చింది. మళ్ళీ సుశీల కట్టుకోజూస్తున్న గాజుగూడును బ్రద్దలు చెయ్యాలనే పట్టుదల తలెత్తింది. అయితే ఈసారి సుశీలను మరోవిధంగా కవ్వించాలని చూచాను.

"సుశీలా! ఇందాక మా అన్నయ్యను అర్థం చేసుకుంటానో లేదో అని ఏమేమో చెప్పావు-కాని; నిన్నే నే నింతవరకూ అర్థం చేసుకోలేదేమో ననిపిస్తున్నది సుమా" అన్నాను.

ఆమె "ఎందుకలా అనుమానిస్తున్నావ్? నేనేం మారలేదే!'' అంది.

"నువ్వు చెప్పిన మాటలనుబట్టే నాకీ అనుమానం కలిగింది. నీ ప్రవర్తన బల




పరిచింది. నేను మా అన్నయ్య నర్థం చేసుకోగలుగుతున్నాను కాని నీతో ఎంతో సన్నిహితంగా వుండి కూడా నేనింతవరకూ అర్థంచేసుకోలేకపోయిన మరోపార్శ్వం ఏదో వుంది. బహుశా ఈ విషయాన్ని మూర్తిగారు నా కంటె ముందే- రెండేళ్ళక్రితమే- నా పెళ్ళయి, మీ పెళ్ళికి మాటలు జరుగుతున్నప్పుడే గుర్తించగలిగా రనుకుంటాను.''

''విచిత్రంగా వున్నాయే నీమాటలూ!? నాలో నీ కర్థంకాని అంశమంటూ ఒకటి వుందని నే ననుకోవడమే లేదు. ఆయన కంటె నువ్వే నన్ను పూర్తిగా తెలుసుకున్నదానివని నా విశ్వాసం. అలాంటిది- నువ్విపుడు విడ్డూరంగా- ఆయనే నన్ను ముందుగా అర్థం చేసుకున్నారంటున్నావేమిటీ? అసంభవం!''

''అసంభవం కాదు సుశీ; ఇదే జరిగిందని నా కిపుడు నమ్మకం కలుగుతున్నది. నిన్ను పెళ్ళాడ్డానికి- ఆదిలో ఆయనెందుకు అభ్యంతరాలు చెప్పారో ఇప్పు డర్థమౌతున్నది.''

''అమెరికాను కనిపెట్టిన కొలంబస్‌లా పోజు పెడుతున్నావు గాని-నీకు కొత్తగా అర్థమౌతున్న దేమిటే రాధికా? అప్పు డాయన చెప్పిన అభ్యంతరాలన్నీ వర్థి చిలిపి సంకోచాలేనని నువ్వుకూడా అన్నదానివేగా? కొత్తర్థాలేమిటో చెబుదూ వింటానూ!''

''బాగా ఆలోచించుకో సుశీ: ఇదేం నవ్వులాటా, చమత్కారం కాదు; జీవితం! మూర్తిగారు అప్పుడు చెప్పిన అభ్యంతరాలన్నీ గుర్తుతెచ్చుకో.''

"పుట్టి మునుగుతున్నట్టు మాట్టాడు తున్నావు గాని, వాటిలో ఏముందే! నాకూ తనకూ బైటి సంబంధాలు చేస్తే- మా రెండు కుటుంబాలకూ బంధుత్వాలు పెరిగి, బలగం ఎక్కువవుతుందన్నారు. ఇదీ నా వ్యక్తిత్వంమీద విమర్శేనంటావా ?''

''కాదు గాని ; తతిమ్మావి కూడా చెప్పు-బాగా గుర్తుచేసుకుని.''

''నాకన్నీ బాగానే గుర్తున్నాయిలే. నాకు మా నాన్నిచ్చే కట్నానికి,తనకంటే ఎక్కువ స్థితిగల వరుడు లభిస్తాడనీ, ఆ సదవకాశం జారవిడుచుకోవద్దనీ అన్నారు.''

''అదీ నీ మేలుకోరి అన్నమాటే గదా! అది వాస్తవం కూడానూ. అప్పటికి మూర్తిగారు సెంటూకుంటాలేని సాధారణోద్యోగే గదా. నువ్వేమో లక్షకు పైగా కట్నం తెచ్చే వధువు వైతివి! సిరి రా మోకాలొడ్డవద్దని తలిదండ్రులు పోరాడినా, మూర్తిగారు నిన్ను చేసు కోడానికి ఎగిరి గంతెయ్యకుండా-మీ తలి దండ్రులనవలసినమాట తనే అన్నారు.''

"అందుకే ఆయన్ను తప్పు పట్ట లేకుండా వున్నాం. పైగా తను పేదగా పెరిగి, బీదల అలవాట్లకు లోనైనవాడు గనుక, నేనా అలవాట్లను హర్షించలేక బాధపడతానని భయపెట్టారు. సిరిసంపద లకు తరుగు లేనప్పుడు- చదువుకునే వయసులో వచ్చిన అలవాట్లు పెళ్ళయిన తర్వాత, పెద్ద వుద్యోగం దొరికినపుడు కూడా అంటిపెట్టుకుండవులే ; వున్నా మా సుశీల మార్చుతుందే గాని, బాధపడ దులే అని సర్ది చెప్పింది నువ్వేగా రాధికా !''

"నేనా మాటలు మనస్ఫూర్తిగానే చెప్పాను. కాని- నువ్వా విధంగా ప్రవ ర్తిస్తున్నావా అని నిలదీసి అడగవలసి వస్తున్నది. దాచక నిజం చెప్పు సుశీ.''

"నీ మనసుకు తగినట్లే సంచరిస్తు న్నానని త్రికరణశుద్ధిగా చెబుతున్నాను రాధీ. ఆ విషయంలో అనుమానించకు. ఆయనలో నేను మార్చలేని అలవాట్లూ లేవూ !''

"మీ అమ్మా నాన్నా ఎంతచెప్పినా, వాళ్ల నాన్న కోప్పడినా, నేనూ నువ్వూ సాధ్యమైనంత హామీగా మాట్లాడినా- మూర్తిగారింకా అభ్యంతరాలే చెప్పారు కదూ ?''

"అవునవును! నాలోగాని, నా సంబం ధంలోగాని చెప్పవలసిన లోటేదీ లేదం టూనే ఎన్నిరోజులు నసిగారు ! తలుచు కుంటే ఇప్పటికీ నవ్వువస్తుంది. తానీపెళ్లి చేసుకుంటేనటా - నాతో వచ్చే కట్నం కోసమే మేనరికం చేసుకున్నాడని నలు గురూ అనుకుంటారటా !! ఇదీ అభ్యంత రమేనటే రాధికా !?"

''తానో, తన తలిదండ్రులో వచ్చి మీ యింట హఠం వేసుక్కూర్చుని, మేనరికం చేయవలసిందేనని దేబిరిస్తే నలుగురూ అలా అనుకునేది నిజమేగాని-

మీ పెళ్ళి మాటలు ఇందుకు భిన్నంగా జరిగె. ఇంత ఆస్తి ప్రతిష్ఠా గల మీ నాన్నే, వాళ్ళ నాన్న చుట్టూ తిరిగా రయ్యే!''

"మా నాన్న అట్లా ఎందుకు తిరిగారో నా కిప్పుడు తెలిసిందిలే రాధికా. వీరికి పై నెలలోనే ఈ పెద్ద ఉద్యోగం వస్తుం దని మా నాన్న ఎట్లాగో తెలుసుకున్నా రట. అంతేగాక ఇంత డబ్బుకూడా ఒకే సారి వస్తుందని మావారికంటె ముందే మా నాన్నకు తెలిసిందట. మా అమ్మా నాన్నా గుసగుసలాడుతుంటే ఏమో అనుకునేదాన్ని గాని — ఇదీ సంగతని నాకు తెలియనే తెలియదుగదా''.

"అట్లాగా సుశీ? అయినా ఆసంగతి మనకిప్పుడు అప్రస్తుతం...కాదు కాదు; మీ నాన్న స్వార్థంతోనే మేనరిక మనే మోమోటం తెచ్చిపెట్టాడని మూర్తిగా రనుమానించి, నీతో పెళ్ళికి వప్పుకోలే దనుకోవాలా?''

"అప్పటికి వారికే తెలియని విశే షాలు — మా నాన్నకు తెలుసని ఆయన మాత్రం కలగన్నారా? అసంభవం... ఆయన మరీ రోజులు గడుపుతూంటే మనకేం అనుమానం వేసిందో నీకు గుర్తుందిగా రాధికా? తలుచుకుంటే సిగ్గు వేస్తుంది!''

"ఇప్పు డంతేగాని అప్పుడు ఆ అను మానం యువతీ యువకుల కక్కలగడం సహజమే ననిపించింది. మూర్తిగారు పెద్దలతో చెప్పడానికి సిగ్గుపడుతున్నా రేమో నని — నాచేతే అడిగించావు కదూ? ఎవర్నయినా ప్రేమించి పెళ్ళాడ నెంచడం వల్లనా - అభ్యంతరాలు చెబుతున్నా రనీ?! పాపం, ఆయన తెల్లబోయి - తన జీవితంలో అలాంటి ప్రసక్తే రాలే దని వొట్టుకూడా వేసుకున్నారు."

"నా కలాంటి ప్రసక్తు లుండవచ్చునని అనుమానిస్తున్నారేమోనని భయపడి - నా తరఫున నువ్వే సత్యప్రమాణాలు చేశానన్నావు కదూ? అందు కాయన ఏమన్నారో - మళ్ళీ ఒకసారి వినాల నుంది, చెప్పూ!''

"మా మేనత్త బిడ్డను నేనట్లా శంకించ గల నాండి? ఆవిడ సంగతి మీకు తెలియదేమో - నిప్పుతునక! అలాంటి తల్లి పెంపకం, మీ వంటి స్నేహితురాలి సహచర్యం లభించిన ఏ పిల్లయినా నిప్పుతునక కాకుండా మరో రకం అయ్యే వీలుంటుందా? రామరామ, సుశీలఅపలే అభిమానస్తురాలు. ఇలాంటి మాట లామె దగ్గరకూడా అనేరు - ఆత్మహత్య చేసుకుంటుంది-అన్నారే ఆనా డాయనా! ఇక ఆయన అభ్యంతరాలకు నా కే కార ణమూ కన్పించలేదు''

సుశీల పకపకానవ్వి "మరి - ఏదో గొప్ప కారణం వుండే ఆయనలా నసి గారని - నువ్వో కొలంబస్‌నసీ కోశా వుగా రాధికా?'' అని నిలదీసింది. నేను నా మాటల్నే అగ్నిపరీక్షకు గురిచేసు

కుంటూ • "ఇదీ కారణం అని చెప్ప లేకుండా వున్నాను సుశీ! కాని – నిన్న్ వేళ చూచిం తర్వాత, నా కర్థంకాని నిగూఢ కారణమేదో వుండే ఉంటుందని గట్టిగా అనుమానం వేస్తున్నది. నిజం సుశీలా – ఇది వర్రిఇన్ట్యూషన్ కాదు; కారణా కారణాలు తెలియకపోయినా దేవుడున్నాడని విశ్వసించేటంత నిజం యిది'' అని, ఆమెకు నచ్చజెప్ప గలిగానో లేదో తెలుసుకోడానికి కళ్ళల్లోకి చూశాను. సుశీల కళ్ళు సంతోషంగా మెరుస్తున్నాయి. ఆందోళన లేదు.

"నీ మాటే నిజమై – ఆ కారణమేదో కూడా తెలిస్తే, అప్పుడైనా నా జీవితం వడ్డించిన విస్తరవుతుందేమోనన్ని ఆశగా వుంది రాధికా! ఆ పుణ్యం నీకే దక్కుతుందిలే'' అని మాత్రం అంది. నేను వెంటనే "నువ్వు నీ వ్యధా కారణం చెబితేగదా – ఆనాటి కారణాలు నేడాయన్ని అడగ్గలిగేదీ?'' అని నిష్ఠురంగానే అన్నాను. కాని సుశీల నా మాట విన్నట్లే ''లైట్లు ఎప్పుడు వేశారో కూడా గమనించనేలేదు. చాలా పొద్దుపోయినట్లుంది. లోపలికి వెళదాంపద రాధికా'' అంటూనే, ఇంటివేపు దారితీసింది.

నేను ''భోజనాల వేళయినట్టుంది. మా అమ్మ నాకోసం కనిపెట్టుకుంటుంది, వెళ్ళొస్తా సుశీలా!'' అంటే, ఆమె "ఇప్పుడింకా ఇంటికేం వెళతావులేవే. నే మీఅమ్మకు కబురంపుతాగాని, నువ్వీపూట నాతో భోంచెయ్యిగాని రా'' అని నాచేయి పట్టుకుని లాక్కుపోయింది. పైగా; "మనం ఒక్కంచంలోతిని, ఓమంచం మీద పడుకుని ఎంతకాలమయిందో!'' అంది – బెంగపడినట్టు నే కాదనలేకపోయాను.

## 8

నేను సినిమానుంచి తిరిగి వచ్చేప్పుడు – ఓ మిత్రునికారులో ఎక్కక తప్పలేదు. అతను మిగతావాళ్ళందర్నీ వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లోదింపి, దోవలో కనిపించిన వాళ్ళందరితో బాతాఖానీవేస్తూ, నన్ను మా యింటికిచేర్చేసరికి చాలా పొద్దుపోయింది.


అతనొక క్లబ్బుజీవికూడానేమో నన్నూ రమ్మని బలవంతంచేశాడు. "ఒక్కరోజు క్లబ్బుకెళితే మీ శ్రీమతేమీ వెలివెయ్యరు లేవోయ్. అయినా మగవాళ్ళ కామాత్రం జల్సా, స్వేచ్ఛాలేకపోతే ఎలా గూ!" అన్నాడు. నేనింకా భోం చెయ్యలేదన్నాను. అతను "ఒహ్హో, శ్రీవారు భోంచేసేదాకా శ్రీమతిగారు భోంచెయ్యరాదని పాతివ్రత్యం నేర్పావుగావల్ను!" అని పెద్దగానవ్వాడు నేనలాంటిదెన్నడూ సుశీలకు చెప్పివుండలేదు. ''అదేం కాదోయ్! ఎవరివేళకు వాళ్ళు భోంచెయ్యడమే ఆరోగ్యంగాని, ఛాందసాలుకూడదనే వాళ్లలోనే, నేనూ జమ"అని అతనికి చెప్పాను.

''ఈ.పూటకి నా అతిధిగా రంజుగా భోంచేద్దూగాని పదవోయ్'' అని అతడు కారును మళ్ళించబోయాడు నాకింటివద్ద భోజనమే బాగుంటుందంటే — అతను "శ్రీమతి వంటైనా, నాయర్ వంటైనా కమ్మగానేవుండొచ్చు అప్పుడప్పుడూ బైట తినకపోతే - ఇంట్లో రుచైనా మొహం మొత్తదటోయ్ మహాశయా — పద, పద!!'' అని బలవంతంచేశాడు నేనిక అతనితో వాదించదలచలేదు. సాకులు చెప్పడం శుష్కప్రయాస. క్షమించమని చెప్పి మా యింటిదగ్గర దింపమన్నాను

నేకారుదిగ్గానే ''చీరియో - గుడ్ నైట్' స్వీట్, స్వీట్, స్వీట్ డ్రీమ్స్!!'' అంటూ అతను కారును జర్రున లాగించుకుపోయాడు అతడెంతటి తిరుగుబోతైనా నా ఆనందాన్ని కోరేమిత్రుడు నవ్వుకుంటూ లోపలికి వెళ్ళాను

ఎదురుగాపున్న గోడ గడియారం పది కొండపుతున్నదని చెప్పింది సుశీల ఈ పాటికి ఓకునుకు తీసివుంటుంది కాని- ఇదేమిటి! లైట్లన్నీ వేసేవున్నాయే'! ఆదుగో-సుశీల ఎవరితోనో మాట్లాడుతూ నవ్వుతున్నట్టుంది.

డ్రాయింగ్ రూంలోకి వెళ్ళేసరికి సుశీల రాధికకు కితకితలుపెడుతూ, పొంగిపోతున్నది సినిమాలో కూర్చున్నా మరుపురాని మధ్యాహ్నపు సంఘటనలు, ఈ దృశ్యం చూడగానే అదృశ్యమయ్యాయి. నేను "రాధిగ్గారికిక ఊపిరాడనీయవా ఏమిటి సుశీ'' అయ్యో- ఆవిడ నవ్వలేక గుక్కపడుతూంటే'' అని



చనువుగా మందలించాను. సుశీల కితకితలు పెట్టడం ఆపి "మీ చెల్లాయేం అరిగి పోదు-ఊరుకుందూ! నవ్వు కూడా హద్దూ పద్దూ, మర్యాదా మడీ ఏమిటీ - చాదస్తంగానీ'' అంది. ఇంకానయం! 'చాదస్తమే అన్నావుగాని - దురాచారం అనలేదురాణీ'-అనాలనిపించింది కవ్వించడం దేనికి లెమ్మని వూరుకుని, నేనూ నవ్వేశాను.

నేను నా గదివేపు వెళ్ళబోతుంటే రాధిక సోఫాలోంచి దిగి-''మాజీ భర్తనే గదా అని ఈ పెంకిపెళ్ళాం నన్ను మరీ ఆటలు పట్టిస్తున్నది, మీరువచ్చి కాస్త బుద్ధిచెప్పం డన్నయ్యా!'' అని సుశీలను వెక్కిరించింది - నన్ను పిలుస్తూ. నేన్నవ్వుతూ అటు మళ్ళబోయాను అంతలో సుశీల పెదవివిరిచి "ఆఁ- చాలా చెప్పార్లే మీరిద్దరూ!'' అని చప్పరించేసింది. వెంటనే రాధిక "చూడం డన్నయ్యా, మిమ్మల్నికూడా చప్పరించేస్తున్నదీ! ఇదెప్పుడూ ఇంతేనా ఏమిటీ!" అంది. నేనేమని చెప్పాలి? నవ్వేశాను.

సుశీల "తర్వాత నవ్వుకోవచ్చు-వెళ్ళి బట్టలు మార్చుకురద్దూ" అని కనుసైగ కూడా చేసింది నాకు. రాధిక అందుకే ఎదురుచూస్తున్నట్టు "అదుగో-మీ మీద కూడా తనే పెత్తనం చేస్తున్నదన్న మాట!'' అంది. నేను అనదగ్గమాట అనకుండా వుండలేక "మీ మరదలికి ఆ మాత్రం తెలివికూడానా చెల్లాయ్‌గారూ- అతి చనువు! అంతే!!" అని నా గది లోకి వెళ్ళిపోయాను.

నేను బట్టలు మార్చుకుంటూంటే వాళ్ళిద్దరి మాటలూ వినిపిస్తూనేవున్నాయి. రాధిక ''ఎన్నిసార్లు ఎలా చెప్పినా మూర్తిగారు నన్నట్లా 'గారూ' అనే సంభోధిస్తారేమిటే సుశీ!" అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. సుశీల నిట్టూర్చి "నే మొత్తుకునేదీ అదేగదే' మర్యాదా మడీ మితిమీరిన మనిషనేగా" అంది ఆ నేస్తురాండ్రు నన్ను మరేరకమో అనుకో నందుకు తృప్తిగానే వుంది. మళ్ళీ డ్రాయింగ్‌రూంలోకి వెళ్ళాను.

సుశీలకూడా సోఫాలోంచి లేచి రాధిక ప్రక్కనే నుంచునివుంది-అచ్చంగా ఆవిడ గదిలోవున్న-వాళ్ళిద్దరి ఫోటోలానేవుందా దృశ్యం. నేను ముచ్చటగా చూస్తుంటే సుశీల "పదకొండింటిదాకా వదలని సినిమా ఏమిటో?" అంది రాధిక "మధ్యాహ్నం టిఫిన్‌కూడా తీసుకోలేదటగా అన్నయ్యా-ఇది మరి బెంగ పెట్టుకుంది. స్నేహితుల్తో మళ్ళీ కాఫీ తీసుకుని వుంటారులేవే అంటే వినదే!" అంది నేను సిగ్గుపడి ''లేదు, లేదు, సినిమావదలి చాలాసేపయింది మిత్రు డొకడూ-" అని చెప్పబోయాను.

కాని సుశీల మధ్యలోనే "బలవంతం చేసి భోజనానికి లాక్కుపోయాడా ఏమిటీ? సరిసరి!!" అని నిట్టూర్చింది. నేను "ఏం? మీరింకా భోంచెయ్యకుండా

నాకోసం కూచున్నారా?" అని అడిగాను. రాధిక "అలాంటివి మీకు నచ్చవని, మేం ముందే మెక్కేశాం లే అన్నయ్యా! ముందుగా చెప్పలేదని నాయర్ గొణుగుతున్నా ఊరి కూరుకుంటేనా?! హఠాత్తుగా నాకూ ప్లేటు పెట్టించింది" అని నవ్వింది. ఆమె నవ్వినా నాకు మనసు చివుక్కుమంది. "నాయర్ నాయర్" అని కేకవేశాను. నా గొంతు మరీ బిగ్గరగా వినిపించినట్టుంది–స్నేహితురాండ్రిద్దరూ నవ్వులుడిగి నిశ్శబ్దంగా నుంచున్నారు.

నాయర్ తనసహజ ధోరణిలో–తుండుగుడ్డ భుజమీదినుంచి జారకుండా పట్టుకునే పరుగెత్తుకొచ్చి "సార్, సార్?" అని నమస్కరించాడు. "హఠాత్తుగా అతిథి వచ్చినందుకు ముందుగా చెప్పలేదని గొణిగేవాడివి, ఇంకేం వంటపని చేస్తావ్–పో బైటికి" అని దోవచూపించాను. వాడు వణుకుతూ, "క్షమించాలి సార్–తప్పయిపోయింది సార్" అన్నాడు. నేను "నీ నంగి నంగి వేషాలు కట్టిపెట్టు పో బైటికి. రేపు పొద్దున్న వచ్చి జీతం తీసుకుపో. ముందునడూ బైటికి" అని మళ్ళీగద్దించాను. వాడు బిక్కు బిక్కు మంటూ వెళ్ళిపోతున్నాడు.

నా కోపం కొంత సడలింది. కాని–రూందాటి నడవలో కాలుపెడుతున్న నాయర్ వెనక్కు తిరిగి "వీక్ డేస్ నుంచీ పోదాం అనుకుంటూనేవుండా. అమ్మగారి ధోరణికి అయ్యగారి కోపం వస్తుందని నిండా భయంగానే ఉంది. అంతా చేస్తివిగదమ్మా మాతల్లీ" అని సుశీలకు వ్యంగ్యంగా నమస్కరిస్తున్నాడు. వాడి అతివాగుడును వారం రోజుల్నించీ గమనిస్తూకూడా ఊరుకున్నందుకు–ఇప్పుడిలా చేస్తున్నాడని మళ్ళీ నా కోపం రగిలి, చరచరావెళ్ళి "పోరా రాస్కెల్! చిన్ననోటికి పెద్దమాట లెందుకురా పో" అని బైటికి గెంటివేశాను.

నే మళ్ళీ డ్రాయింగ్ రూంలోకి వచ్చేసరికి సుశీల చప్పట్లు చరుస్తూ గంతులేస్తున్నది. నన్ను చూడగానే "హిప్ హిప్ హుర్రే అనబుద్ధవుతోం దనుకో, పోతేపోయాడు–నాకికవల్లాంచిపని చేసుకునే అవకాశమన్నా దొరుకుతుంది. లేకపోతే మరీ సోమరి పోతునై పోతున్నాను" అంది గొంతు నిండుగా. నే నామె సంతోష ధోరణికి అబ్బురపడుతూనే వెళ్ళి ఒక సోఫాలో కూర్చున్నాను.

రాధిక కూడా ఎదుటి సోఫాలో కూర్చుంటూ "నా మూలకంగా పాపం. నాయరుద్యోగం పోయిందే" అంది. నేను "వానికీ మధ్య విచక్షణా జ్ఞానం లేకుండా పోయింది లెండి. వాళ్ళంత చనువు తీసుకోడం వాళ్ళకే మంచిదికాదని బుద్ధిచెప్పవలసి వచ్చింది. మీరు నిమిత్తమాత్రులే గాని బాధ్యులు కాదు లెండి చెల్లాయ్" అన్నాను. సుశీల స్నేహితురాలి నానుకుని కూర్చుంటూ "మరో

పీడా పోయిందన్నానుగా! కాస్సేపేవన్నా ఖులాసా కబుర్లు చెప్పుకుందాం" అంది నా వంక ముచ్చటగా చూస్తూ. రాధిక "విందెక్కడండీ అన్నయ్యా? వంటకా లేమిటి?'' అని సంభాషణ ప్రారంభించింది.

నే నేమని చెప్పాలీ? నా మాటలు పూర్తిగా వినకుండానే వాళ్ళిద్దరూ — నే నెక్కడో విందు గుడిచి వచ్చానను కుంటున్నారాయె. లేదని చెబితే మళ్ళీ వంటెవరు చేస్తారూ? నాయర్నా వెళ్ళగొడితిని. గౌరమ్మ లేకపోయె. ఇక ఈ వేళప్పుడు సుశీల నేం బాధ పెట్టనూ? పైగా అవతల రెండేళ్ళ తర్వాత వచ్చిన స్నేహితురాలితో కాలక్షేపం చెయ్యాలనే ఉబలాటమాయె! ''విందుల కేంగానీ మీకు మామూలు భోజనమేనా, మంచి వంటకా లేమైనా వడ్డించిందా సుశీల?'' అని ఎదురడిగాను. సుశీల ''అదనంగా అప్పడాలన్నా వేయింపిస్తానంటే రాధిక పట్టువేసుకుంది. తన కోసం ప్రత్యేక వంటకాలు చేస్తే అసలే తినదటా!'' అంది మనసు నొచ్చుకున్నట్లు. రాధిక ''అవునన్నయ్యా గారూ! నాకు సుశీలతో కూర్చుని తిన్నదే పరమాన్నం గాని — వేరే వంటకా లేం గొప్ప?'' అంది. నేను "భలేవారండీ! మనసే ముఖ్యం అనుకోండీ — అయినా మాకూ తృప్తిగా వుండాలిగదా?!'' అన్నాను.

అంతలోనే వంటింటి వేపునుంచి ''అయ్యో నారాతా! అద్దరేయవుతుండా, బాబుగోరికి వొడ్డించకుండా — ఊసుల్లో బడ్డారేం బుల్లెమ్మా, లెండిలెండి" అని హడావుడి చేస్తూ గౌరమ్మ ప్రత్యక్షమయింది. సుశీల పకపకా నవ్వేసింది. గౌరమ్మ అక్కున చెయి జేర్చుకుని "అంతిదూరం ఎందుకు బుల్లెమ్మా? ఏల మీరిందని? నాయరోడు పోతే, బాబుగోర్రాంగానే నన్ను బిలవరాదాంటా? నీకు శేతరాకపోయినా ఈ ముశిల్దింకా సావలేదుగాంటా?!" అని దీర్ఘాలు తీసింది. రాధికూడా నవ్వింది.

సుశీల "నీదేమిటే అత్త పోరుకంటే ఎక్కువయిందీ? నా కా మాత్రం కూడా తెలియదనా నీ దీర్ఘాలూ హడావుడీనీ?'' అని విసుక్కుంది. గౌరమ్మ తెల్లబోతుంటే, నేను ''వూరునుంచి ఎప్పుడొచ్చావు అవ్వా? మా వాళ్ళూ మీవాళ్ళూ అంతా బావున్నారా?'' అని అడిగాను. ఆమె ''సందేలొచ్చా బాబూ. అందరూ ఆ దేవుడి దయవొల్ల బాగానే వుండారు గానీ — మీరు లెండి బాబూ, పొయిమీద నేతిగిన్నెట్టొచ్చా'' అని తొందర చేసింది. నేను ''పద, పద'' అంటూ లేచాను.

సుశీల ఒక్కసారిగా ''హా!'' అని మూర్ఛపోయినంత కేకపెట్టింది. నేను గాభరాగా అటుతిరిగాను.

రాధిక ''ఏమిటే సుశీ?!'' అని గాభరా పడుతూ సుశీలను సవరించు

ప్రాణాలే తీస్తున్నట్టు -చీదరిస్తున్నావేం సుశీ?'' అని గద్దించింది. సుశీల ''నీకేం తెలుసు నువ్వూరుకో రాధీ... అవ్వా, నువ్వా నెయ్యేం ఎత్తక్కర్లేదుగాని బైటికి నడూ ముందు. ప్రతిదానికీ నీదే పెత్తనమా ? అయ్యకి అన్నం వడ్డించాలో లేదో నాకు తెలియదూ... పోఫో...'' అని మళ్ళీ ఈసడించింది. గౌరమ్మ బిక్కుబిక్కుమంటూ ''నాకేం తెలుసు బుల్లెమ్మా. తానంజేసి వొచ్చేదలికి నువ్వొండినయన్నీ అట్టాగేవుంటే, బాబు భోంచెయ్యలేదనుకుని పిలిస్తిని'' అంది. సుశీల ''ఇక దీర్ఘాలుతియ్యక అవతలికి తగులడవే--అబ్బబ్బ! నాకో తద్దినం అయిపోయాప్'' అని మరింత విసుక్కుంది. గౌరమ్మ ''అంతేలేమ్మా... ముసిలిముండని...చాదస్తంలే'' అంటూ వెళ్ళిపోయింది. ఆమె మనసు నొచ్చుకున్నందుకూ, అలా సుశీల ప్రవర్తించినందుకూ నా గుండెలు చివుక్కుమన్నాయి. అన్నం సయించుతుందా ? కలుపుతున్న చేతిని పళ్ళెంలోనే విదిలించుకుంటూ, రెండో చేత్తో కుర్చీ వెనక్కు జరిపాను. సుశీల ఆల్మయిరా లోంచి నేతిజాడీ తెచ్చి వడ్డించబోయింది. నేను అప్పటికే లేచానేమో, వెంటనే ''సయించడం లేదు సుశీ'' అనేసి, వాష్‌టబ్ దగ్గరకు వెళ్ళాను. పైపు తిప్పాను. చేయి కడుక్కుంటున్నాను.

సుశీల వెర్రెక్కినంత గావుగా ''నా ముచ్చటంతా ఇంతేనన్నమాట ? వడ్డించే అవకాశంకూడా దొరకదుకదూ ? సరే... అంత కసిగా వుంటే అన్నం మానెయ్యడమా ? ఇక నా జన్మలో వంట వండితే ఒట్టేలే -- చెయ్యి కడుక్కున్నావుగా. సరే--సరే'' అని కేకలు వేసింది. రాధిక ''మీరూ అలిగి అభోజ్యం వుంటారా అన్నయ్యా ? సుశీల తొందరపడిందే అనుకోండీ -- '' అని నన్ను మందలించబోయింది. సుశీల అడ్డువచ్చి, రాధికను బడబడా అవతలి గదిలోకి లాక్కుపోతూ ''మనం అడిగేపాటి వాళ్ళమటే రాధీ...బదుకే ఇంతలే...రా, రా... దూరంగా పోదాం'' అంటున్నది.

ఎంత ప్రాణస్నేహితురాలైనా, రాధిక ఎదుటనే ఇంత అకారణ రాద్ధంతం చెయ్యడం నాకేం బాగుండలేదు. సుశీ మనసు చివుక్కుమందిగదా అని మళ్ళీ భోంచేద్దా మనిపించింది. ఇంతలోనే సుశీల అంటున్నమాటలు అర్థంకాకుండానే శూలాల్లా గుచ్చుటుంకుంటే నేనెలా భోంచెయ్యగలనూ ? నేనూ వాళ్ళవెంటే డ్రాయింగ్ రూం వేపు వెళుతున్నాను. నే నా గది గుమ్మం చేరేసరికి సుశీల స్నేహితురాల్ని సోఫాలో కుదేసి, తనూ కూలబడి : ''ఇదీ వరస ! అటు రొమ్ముల కుంపటీ, ఇటు తలమీద తద్దినం, మధ్య నే వేగలేక ఛస్తున్నాననుకో రాధికా'' అని ఎక్కడలేని వేదనా వెళ్ళబుచ్చింది.

ఆ మాటలు వినేసరికి నా గుండెలు

గుబగుబలాడాయి. ఆవేదనను మించిన ఆవేశం బుసబుస పొంగింది. ఎన్నివిధాల ఎంతకాలంనుంచి కోప్పడకుండా తమాయించుకుంటున్నా. నాకు మంచి మాట రాలేదుగదా. ఈ మధ్యాహ్నం నుంచీ మరీ అకారణ రాద్ధాంతం చెలరేగడం దేనికి? ఇదేదో ఇప్పుడే తేల్చుకోవడం ముందుకు మంచిదనిపించింది. ఒక్కలిప్తకాలంలోనే ఈ భావాలన్నీ చెలరేగాయేమో; నేనావేశంగా డ్రాయింగ్ రూం మధ్య వున్న టీపాయ్ వరకూ వెళ్ళి, సుశీలను "చల్లని ముత్తవతల్లి లాంటి గౌరమ్మ తద్దినమూ, నేనో రొమ్ముల కుంపటీనా సుశీలా? ఇంతటి మాట లనడానికి మేమేం పాపం చేశాం? నువ్వెక్కడ అరిగిపోతావో. విసుక్కుంటావోనని అన్నీ సరిపెట్టుకుపోతున్నా నీకింకా తృప్తి కలగలేదన్నమాట? సరే - రాణీగారి కింకెటువంటి బానిసలు కావాలో చెప్పండి, అట్లాగే మసులుకుంటాం" అని కడిగేశాను.


నా ముఖం ఎలామారిందో మరి - రాధికా, సుశీలా భయపడిపోయినట్లున్నారు. పంతులుగారి బెత్తం ఝళిపింపులు విన్న కుర్రవాళ్ళలా దిగ్గున సోఫాదిగి తలలు వంచుకున్నారు. ఈ దృశ్యాలు నా కళ్ళకు కనిపిస్తున్నా మనోనేత్రాని కందలేదనుకుంటాను. నేనేమీ చూడదల్చే మాట లనేస్తున్నాను "వీడికి జవాబివ్వడమే నామోషీగా రాణీగారికీ! రాధగారితోనన్నా చెప్పుకోండి ఈ రాక్షసుడు మిమ్మెంత బాధపెడుతున్నాడో - నే నెందుకూ మధ్యా" అంటూనే చరచరా బైటికి వెళుతున్నాను.

నేన్నడవ దాటుతుండగా సుశీల వెర్రి సంతోషంతో నవ్వుతూ "నే చెప్పలేదటే రాధికా, వట్టి పిల్లిబావ!" అనడం వినిపించింది. హ్హా - నన్ను వెక్కిరించేందుకు పెట్టిన పేరును పూర్తిగా మరువనే లేదన్నమాట! అవునుమరి - శ్రీమంతుల ఏకైక సంతానం, ఆజ్ఞలు మాత్రమే తెలిసిన శ్రీమతిక దూ!! ఎన్నడూలేంది - అర్ధరాత్రివేళ రోడ్లన్నీ తిరుగసాగాను.

## 9

ఊరెల్లి ఆరేడు నెల్లయిందిగందా అని, మా బుడ్డాడిమీదా, ఆడి పెళ్ళాం పిల్లలమీదా గాలిమల్లి సూడబోయాను. ఎల్లిన మర్నాటినుంచే ఈడ చిన్నయ్యా, బుల్లెమ్మా ఎంతిబ్బంది పడతారోనని ఒకటేబుగులు. శిన్నతనంగా - బుల్లెమ్మకేమీ తెలవదాయె. చిన్నయ్య ఏత్తక్కువైనా నోరుదెరిశి చెప్పడయ్యె. వంటనాయరుంటే ఆడికేంబోయె-ఇంతవండి పడేత్తాడుగాని, సంసారంలో మంచి చెడ్డ లాడికేంబట్టే.

ఏదో మునిసిల్దాన్ని ఉండబట్టి, ఆ బుల్లెమ్మకీ చిన్నయ్యాకీ ఏయేలప్పు డేంగావాలో తెలుసుగాబట్టి - సదురుకు



'అయితే మీ భర్తని 5 సార్లు నిర్దాక్షిణ్యంగా తుపాకితో పేల్చి చంపారన్నమాట!'
'నేను అన్నిసార్లు కావాలని పేల్చలేదండి. ఆయనే ఊరికే అటూయిటూ పరుగెత్తడం మొదలుపెట్టాడండి!'

పోవచ్చు. అసలందుకేగా పెద్దమ్మా పెద్దయ్యా నన్నిడకి బంపిందీ. పెద్దమ్మ మా ఊరు కాపరాని కొచ్చినకాణ్ణించీ, ఆవిడి చేసుకోలేదని నన్నింటోనే వుంచుకుండిరి. అప్పట్నుంచీ నాకదే సొంతిల్లు కంటే ఎక్కువై పోయె. పెద్దయ్యె సల్లని మారాజు–నాకూ నా బిడ్డలకీ ఏమీ తక్కువ గాకుండా సూత్తారు. మల్లీ ఆ మాటంటే–"ఎంత డబ్బిచ్చినా, జీతం యిచ్చినా నీలాంటి పనిమనిషీ, నీ మొగుడులాంటి పాలేరూ దొరుకుతాడంటే గౌరమ్మా?! కష్టంజేసేవాళ్ళు దొరుకుతారేమోగాని–మనసిచ్చి పనిజేస్తా, మా యింటో పెద్దండగా మారిపొయ్యే వాళ్ళెవరుంటారే!" అని, అదేందో మేం గొప్పమేలు జేత్తుండట్టు మాట్లాడతారు.

అదేందో మాకు తెలవదుగాని – మా మొగాడికీ, నాకూ ఆ యింట్లో, ఆ పొలంలో సొంతంలాగా మసిల్తేగాని అన్నం అరగదు. పైగా ఈ సుశీలమ్మని పుట్టినకాణ్ణుంచీ పెంచింది నేనేగా. ఆవిడికి ఏయేల కేం గావాలో, ఎప్పుడేం జెప్పాలో నాకు దెలిసినంతగా–ఆవిణ్ణిగన్న రత్తమ్మ గోరి కేం దెలుసూ? ఈ పిల్లని కడుపతోండకాణ్ణుంచీ ఏదోఒక జబ్బేనై పోయె. ఆసుపటాలనీ, సూదిమందులనీ, ఆప

దోలేశనులనీ ఎప్పుడూ ఏఒకటీ_ఆవిణ్ణా విడే సూసుకోలేకుండా వుంటదయ్యో ఇక పిల్లని జూశేదెవురూ. సుబ్బయ్యో గోరు ఎంత పేణంగల తండ్రయినా మొగమారాజు, ఆడపిల్ల నేం బెంచుతాడూ! అందుకే సుశీలమ్మకి నేనే ముత్తవతల్లి నైపొయ్యానంటారు వూళ్లోవాళ్లు

ఎంత ముసిల్దాన్నయినా, చాదస్తం దాన్నయినా నేనంటే సుశీలమ్మ పైకి యిసుక్కుంటాదిగాని - నేనంటే ఎంత పేణం! మూరితిగోరితో శెప్పుకోని మాటలుగూడా నాతో చెప్పద్ది నే జెప్పినట్టు ఇంటంది కాకపోతే కోపంముక్కు మీద శిరశిరలాడతా వుంటందిగాని - నా సుశీలమ్మ బంగారం సుద్దగదూ?' లేకలేక పుట్టి గారంగా పెరిగిన ఒక్కగానొక్క బిడ్డగామట్టి - అట్టా అలగటం అలవాటయిందిగాని_సుశీలమ్మ తెలివితేటలూ, మంచి మర్యాదలూ నూటికొకళ్ళకైనా అబ్బుతయ్యా

అంతుండ యింటోబుట్టి, ఇంతుండ మారాజు పెళ్ళాం అయినా - ఒక పల్లదనం, గరభం, పొగులుబాటూ వుండయ్యా? ఛాఛ_ఎంత సదివినా అంత అణుకువా, అయినోళ్ళంటే పేణాలిచ్చే గుణం మా సుశీలమ్మది ఒకొకళ్ళని సూత్తే_బొటనేలికి సున్నం అయితే ఎగిరెగిరి బోల్తాపడతావుంటారు భూమ్మీద ఆగనే ఆగరు - ఏంపల్లదనమో! మా బుల్లెమ్మ కట్టాటిగుణం ఏకోశానా లేదు. కాకపోతే_మా శిన్నయ్య మూరితిగోరంత తూశితూశి మాట్టాట్టం శేతకాలేదు చిన్నప్పుణ్ణుంచీ ఆయనంత కరకట్టుగా పెరిగినోడుగాబట్టి అంత మెత్తనోడయ్యాడుగావన్ను అంత నెమ్మది తనకి రాకపోయినా సుశీలమ్మకి ఆయనంటే యెంత పేణం'

అట్టాఅంటే - ఎవురి మొగుణ్ణి ఏ పెళ్ళాం మాత్తరం పేణంగా సూసుకోదంటవే అంటారు గాని, నిజం నేబద్దీ తెలిస్తే మా సుశీలమ్మంత గుణంగలోళ్ళుండరు అంతాస్తి పాస్తులూ, గొప్ప సదువూ వుండాళ్ళెవుళ్ళూ_ఎంత మేనరికమైనా, కాసూకుంటాలేని మూరితిగారిలాంటోణ్ణి పెళ్ళి జేసుకోటాని కొప్పుకుంటారా?' సుశీలమ్మతో సదువుకున్నోళ్ళని నే జూళ్ళా' కిన్నారింటి కాణ్ణుంచి సున్నపాకు లొడుంతేలేనాళ్ళు కూడా - పెద్ద పేద్ధ వుద్యోగస్తుల్నే జేసుకుంటామని ఉరులుబెట్టే వాళ్ళు ఏమాత్తరం కట్నాం దెచ్చే పిల్లయినా- ఆస్తిపాస్తు లుండాణ్ణే కట్టుకుంటాననేది అట్టాటిది - సుశీలమ్మ కిక్కురు మనకుండా ఈ మేనరికానికి ఒప్పుకుంది పైగా ఆ కాసూ కుంటాలేని మూరితిగోరే గుణుత్తాంటే - తనే కావాలని పట్టుబట్టి పెళ్ళాడింది. ఇట్టా పేణం యిచ్చే పిల్ల లీ కాలంలో ఎవురుంటారూ'

కొందరు పెళ్ళి జేసుకునేదాకా పేణం

పేమా అంటా – ఆ మూడు ముళ్ళూ పడినకాణ్ణించీ. మొగుళ్ళని ఏపుకు తింటారు. ఎనక వొచ్చేదీ, వుండదీ ఎంతా, ఏడదీ అని ఆలోచిచ్చకుంటా – సగలనీ శీరలనీ ఉర్లుబెట్టి సంపుతారు నా తల్లి కాలుపెట్టినేల మంచిదై, మూరితి గోరు నెల తిరక్కముందే గొప్ప వుద్దోగంలోకెళ్ళి, నాలుగు శేతులా సంపాదిత్తాండా – ఒక్కనాడన్నా నా సుశీలమ్మ అది గావాలని ఇది గావాలని సోద్దెం జేసిందా! అబ్బే – ఆయ నడిగినా తనకేం వొద్దంటదాయె ఏదన్నా కావాలంటే తన పుట్టింటి కాణ్ణించే తెచ్చుకుంటందయ్యో

శిలకా గోరింకల్లాటి సంసారం అంటే ఈ యింటోనే వుందిగాని – మరెక్కడా కనపళ్ళా నాకు కాకపోతే – ఈ మద్దిన నా తల్లే ఎందుకో కుళ్ళి కుళ్ళి ఏడుత్తాంది ఏం తక్కువమ్మా ఏం కావాలమ్మా అంటే– ఒట్టెటుకున్నట్టు చెప్పనే చెప్పదయ్యో. ఇదొక్కటే మూరితిగోరికి కట్టం ఏశే మాటగాని–నా తల్లికి మరేం వొంకుందీ! మొగుడికి ఆయనకే ఏంటి – నా మట్టుకు నాకే కట్టం ఏశే మాటిది. పైగా అట్లా కుళ్ళి కుళ్ళి ఏడిచేదప్పుడు – కూస్తికీ కాస్తికీ శిరిశిరలాడతంకూడా ఎక్కువయింది. నన్ను మరీ గడ్డిపరకకిమల్లే ఇదిలిచ్చేత్తాంది పనిమడిసిని నాదేం వుందని సరిపెట్టుకుంటాగాని – ఆ మారాజునుగూడా కిసురుకుంటే ఏం బాగుంటందీ! నా మాటినిపిచ్చుకోదయ్యో. ఇన్నా మరీ యెర్రి కోపం దెచ్చుకుని, మరింత ఏడుస్తాందయ్యో!!

ఈ పూట కీ పూట ఎంత పని జేసింది! తినే తినే అన్నంకాణ్ణుంచి ఆ మారాజు లేశిపోయాడుగందా

ఆయనంత మండిపడి, అలిగి బెయిటి కెల్లిపోతే ఈ పిల్ల కిదేం బుద్దీ–కుశాలుగా పగలబడి నవ్వుకుంటాందీ! ఎర్రివాలకం కాదుగందా!! పైగా – శిన్నప్పుడు మా సుబ్బయ్యబాబు సరసానికి నేరిపిచ్చినట్టు, ఆ ఎగతాలిమాట "పిల్లి బావ" అని సరసాలాడేది. ఆయన క్కోపంవొచ్చినప్పుడేనా – వొర్రి పిచ్చిపిల్ల!! కళ్ళు కొంచెం పిల్లికళ్ళు రంగని ఆ పేరుతోనే పిలుస్తారా ఎవరన్నా ... సరసాలకైనా హద్దూపద్దూ వుండొద్దూ

ఆ దరమరాజుకన్నా కోపం వస్తుంది గాని–మా మూరితిబాబు క్కోపం రాదనుకునేదాన్ని అట్టాటాయనకి ఈ పూట నిజంగా పట్టరానంత కోపం వొచ్చి, అలిగెల్లిపోయె అంతేమరి–అన్ని తలుపులూ యేసి, కర్రుచ్చుకెంబట బడితే పిల్లి కూచా వొదిగొదిగి నుంచున్నా, ఆకరికి ఎదురుతిరక్క ఏం జేస్తదీ? ఆమొయిన ఎదురుతిరిగి రక్కే పిల్లిలాగా, ఆ బాబు ఈ సుశీలమ్మని నాలుగొడ్డిస్తే తిక్క కుదురు ద్దనుకున్నా. అప్పుడుగాని ఈ పిల్లకి తెలవదు "పిల్లి బావంటే ఏమిటో" అనుకున్నా అబ్బే! ఆ మారాజు తనే తప్పు జేసినట్టు ఎల్లిపోయె

[సశేషం]



[గత సంచిక నుంచి]

*10*

"అట్లా వెళ్ళిన మూర్తిగారు, ఇంత వరకూ తిరిగిరాకపోయినా నీ కేం చీమ కుట్టినట్లే లేదేమే సుశీలా ? నీకు బొత్తిగా మంచీ చెడ్డా తెలియకుండా పోయినట్టుందే ?'' అని అడిగింది రాధిక అప్పటికి తెల్లవారుఝామున రెండుగంట లయింది స్నేహితురాండ్రిద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఒకే మంచంమీద పడుకుని వున్నారు

సుశీల దిగ్గున లేచి మంచంమధ్య కూర్చుని ''నీకూ ఇంకా నిద్రపట్టలేదటే రాధికా ? గంటసేపయిందిగా మాటలు మాని, లైట్లార్పి ?" అని అడిగింది రాధిక విసుక్కుంటూ లేచి కూచ్చుని "నీకుమాత్రం గుర్రుపెట్టే నిద్ర వస్తున్నదన్నమాట ? హ్హు(—మొత్తంమీద ఎంత మారిపోయిందే నీ ప్రవర్తనా !" అంది సుశీల తలవంచుకుని "ఆయన తోటలో తిరుగుతున్నారనే చాలా సేపటివరకూ అనుకున్నా రాధికా ! మనం ఈ గదిలోకి వచ్చి మాటల్లో పడినప్పుడు — ఆయన లోపలికి వచ్చి తన గదిలో పడుకున్నారు లెమ్మనుకున్నా" — అని చెబుతూ ంటే గొంతు కేదో అడ్డుపడినట్లయింది

రాధిక స్నేహితురాలి గడ్డం పట్టుకుని పైకెత్తి, కళ్ళల్లోకి చూస్తూ "నే నిందాక బాత్‌రూంకని చెప్పి వెళ్ళినప్పుడే అంతా చూచివచ్చానే సుశీ ! మూర్తిగా రెక్కడా కనిపించలేదు గౌరమ్మకూడా అన్నం తిన్నట్టులేదు—వంటింటోనే నేలమీదే పడుకుని కంటనీరు పెట్టుకుంటున్నది అదేమంటే — "ఏమీలేదు తల్లీ, మీరు పడుకోండి'' అని ఆందోళనా స్వరంతో చెప్పింది సుశీల కళ్ళలోతిరిగిన నీటిని దాచుకోడానికా అన్నట్లు దిగ్గున మంచం దిగి, అటువెళుతూ — "నేను నిజంగానే రాతిగుండెదాన్నయిపోయా ననుకున్నావా రాధికా ?...ఆశ్చర్యంలేములే—నేనూ వారి మనసెరిగిన దాన్ననుకునే బోల్తాపడ్డాను" అని, లైట్ స్విచ్ వేసింది

పి. జె. లక్ష్మి

రాధిక. స్నేహితురాలి దిగులును గ్రహించి, ఆదుర్దాగా మంచం దిగి వెళ్ళి సుశీల చేతిని గట్టిగా పట్టుకుని "అయితే ఆయనే అర్థంకాకుండా మారిపోయారంటావా సుశీలా? అమీ తుమీ చెప్పకుండా ఇట్లా కుమిలిపోతూ, నన్నుకూడా ఆందోళనపెట్టకు సుశీ...చెప్పు, అసలు సంగతేమిటో చెప్పు" అని అడిగింది

సుశీల కళ్ళు తుడుచుకుని, స్నేహితురాల్ని వెనక్కి నడిపి, మంచంమీద కూర్చోబెట్టింది తానొక కుర్చీ లాక్కొని ప్రక్కనే కూర్చుంటూ "నేనూ పావు గంటక్రితం వెళ్ళి గదీ దొడ్డీ గాలించి వచ్చాను రాధికా! ఆయ నెక్కడా కనిపించలేదు"_ అని చెబుతూనే గాపురమంటూ వెనక్కివాలి కళ్ళు రెండు చేతులా మూసుకుంది రాధిక ఆదుర్దాగా లేచి వచ్చి, ఆమె కుర్చీచేతిమీద కూర్చుని, సుశీల చేతులను బలవంతంగా తనవేపు లాక్కుంటూ "అబ్బే! మళ్ళీ శోకాలు మొదలెట్టకు చదువుకున్నదానివి ఇంతైతే ఎట్లా_అసలు సంగతి చెప్పి ముందు సంగతి ఆలోచించుకోవాలిగానీ!" అంటూ సముదాయించబోయింది

సుశీల శోకాన్ని ఆపుకోలేనట్లే "ఆయన నేనేంచేసినా అర్థం చేసుకుని మన్నిస్తా రనుకున్నాగాని_నిజంగా ఇంత కోపం వస్తుందనుకోలేదు...అలిగి వెళ్లిపోయారు" అంటున్నది రాధిక "అవును మరి! అన్నం తినబోతున్నవార్ని అకారణంగా అంత రాద్ధాంతంచేస్తే అలగరూ మరీ?" అని కసురుకుంది సుశీల "అంతేననుకుంటూ రాధీ! నా ప్రవర్తన అంత సహించలేనిదైపోయిం దనుకుంటూ" అంది

రాధిక మరింత నిష్ఠుర స్వరంతో "ఇంకా మెల్లగా అంటావేం? మధ్యాహ్నంనుంచీ నీ ప్రవర్తన చూస్తుంటే నాకే కోపం ఆగడంలేదు ఆయన ఎంతకాలంనుంచి యిదంతా భరిస్తున్నారో - ఈ పూటతో హద్దు మీరిపోయిందనుకుని వుంటారు" అంది సుశీల "రాధికా! అంతంత మాటలనకు నేనెన్నడూ ఆయన్నిలా కష్టపెట్టాలని అనుకోలేదు ఏనాడూ ఇంత కోపం వస్తుం దనుకోలేదు ఆత్మశుద్ధిగా చెబుతాన్నా రాధికా, ఆయన తృప్తీ, ఆనందమే ముఖ్యమని నా ప్రవర్తనను మలుచుకోజూచానుగాని_ ఏ కోశానా వారి కక్షంకలిగించే పని ఏదీ చేయదలచినదాన్నికాదు నన్ను నమ్మ రాధికా" అని భుజంమీదవాలి, కౌగలించుకు మరీ ఏడుస్తున్నది

స్నేహితురాలు ఆమెను సముదాయింపుగా వీపుమీద సవరిస్తూనే, దిటవుగా "నమ్మకపోవడానిక్కూడా కారణాలున్నట్టున్నాయ్ సుశీ! అసలు కారణం చెప్పు ఎంతకాలంనుంచి ఈ రవరవలు చెలరేగాయ్ మీ మధ్య?" అని అడిగింది సుశీల శెరణాకోల చివళ్ళు ఛెళ్ళున తగిలినట్టు_తటాలున రాధికను వదిలి, తెల్ల

బోయి వెనక్కు జరిగి ''రాధికా!'' అని కోపంగా, ఆక్రోశంతో గావుకేకపెట్టింది. ఆ కేకతో ఇల్లంతా ప్రతిధ్వనించింది. రాధికకూడా తెల్లబోయి చూస్తున్నది. సుశీల ఆదిరే పెదవులను పళ్ళతో బిగబట్టుకుంటూనే 'మా సంసారం నువ్వనుకున్నంత రవరవలపాలైతే - నే న్నీకు వ్రాయకుండా వుంటాననుకున్నావా రాధికా?' ఆయన తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు అన్న మాటలు తప్ప ఏనాడూ నన్ను రొక్కించినపాపాన పోలేదు నువ్వు చూస్తుండగా జరిగిందే మొదలు ఈనాటి వరకూ మా సంసారం శాంతినిలయంగా వుందంటే నమ్ము రాధికా, నీ తోడు! నమ్మవూ?" అని స్నేహితురాలి నర్థిస్తున్నట్లు చూసింది

రాధిక దీర్ఘంగా నిట్టూర్చి ''ఇది మరీ విచిత్రంగా వుంది సుశీ' నీ మాటలు పూర్తిగా విశ్వసిస్తున్నాను అయినా అన్నయ్యగారి అలుకకు కారణం కనిపిస్తూ-ఇదెంతకాలంనుంచో రగులుతున్న సంఘర్షణకు పర్యవసానం అనిపిస్తున్నది" అంది సుశీల మళ్ళీ సజల నేత్రాలతోనే రాధికను బ్రతిమాలుతున్నట్టు చూస్తూ "సంఘర్షణనేది ఏదన్నావుంటే అది నా మనస్సులో వుందేమోగాని-ఈ మధ్యాహ్నంవరకూ ఆయనా నేనూ బేధాభిప్రాయాలతో మాట లనుకున్నది లేదు రాధికా'' అని చెప్పింది. రాధిక "ఒకవేళ నువ్వు మాటలన్నా మూర్తిగారు సరిపెట్టుకుపోతూ ఘర్షణను వాయిదా వేసుకు వస్తున్నట్టుంది సుశీలా" అని నిష్కర్షగా చెప్పింది

సుశీల కళ్ళు తుడుచుకుని "అవును సుమా, ఆయన అలిగి వెళ్ళేటప్పుడన్న మాటలు అలాగేవున్నాయి కాని, నేను త్రికరణశుద్ధిగా ఏక్షణానా ఆయన మనసుకు కష్టం కలగ్గూడదనే ప్రయత్నించానుగాని-మరోవిధంగా కలనైనా అనుకోలేదు రాధికా' అన్నం తినబోయే ఆయన్ని లేచిపోయేంత నొప్పించే మాటలన్నానా నేను - నిజంగా అన్నానా రాధికా?" అని అడిగింది ఆత్మపరిశోధనగా వున్న ఆ ప్రశ్ననువిన్న రాధిక దిటవుగా ''ముమ్మాటికీ క్షంతవ్యంకాని విధంగా మాట్లాడావు సుశీ' మరో మగవాడైతే - ఎడాపెడా బాదివేశేవాడనుకో" అని భయగర్భంగా చెప్పింది

అంతటి మాటలు విన్నప్పుడుకూడా సుశీల విచారమంతా అదృశ్యమైనట్లు విపరీత సంతోషంతో ఒకపక నవ్వసాగింది కడుపుబ్బ నవ్వుతున్నది రాధిక కొద్దిసేపు తెల్లబోయి - మిత్రురాలివంక చూస్తూ కళ్ళు చికిలించుకుంది చివరికి ఆమె రెండుభుజాలనూ బలంగా పట్టుకుని, కుర్చీ వెనక్కు కుదేసినట్లు తోసి "అప్పుడు మూర్తిగారంత కోప్పడి,అలిగి వెళ్ళినప్పుడూ ఇట్లాగే నవ్వావు ఇప్పుడు నే నర్థమయ్యేట్టు చెప్పినా-నీ ప్రవర్తనకు నువ్వు సిగ్గుపడవలసింది పోయి, ఇట్లా

నవ్వుతున్నా వేమిటే? నీ కేం మతి మతిపోలేదు గదా'' అని గద్దించింది

సుశీల నవ్వాపుకుంటూ, మిత్రురాలి వంక కౌతుకంగా చూస్తూ "అంత మతి పోయే విశేషంగనకనే, మతిపోకుండా నవ్వుమందు వేసుకుంటున్నా ననుకోరాదటే'' అంది రాధిక ముఖం చిట్లించి "చిలిపి కజ్జాలతో చల్లని సంసారంలో చిచ్చుపెట్టుకోవద్దని నాకు సలహాలిచ్చిన నువ్వేనటే-ఇట్లా చిలిపిగా మాట్లాడి మరీ పోట్లాట తెచ్చుకుంటున్నావ్?" అని నిగ్గదీసింది సుశీల సంతృప్తిగా వూపిరి పీల్చుకుని లేస్తూ "అబ్బ' అసలు భర్త గారికంటె ఎక్కువగా కోప్పడుతున్నావు గాని-నాకు నీమీదేం కోపం రాలేదు రాధికా! అసలు పోట్లాడదామన్నా అవతలివారు సహకరించందే ఏం జచ్చేది చెప్పూ? మీ అన్నయ్యగారి మనసు నీకు తెలియక అపోహపడుతున్నావే అంటే నమ్మవుగదా!'' అంటూ గుమ్మంవేపు వెళుతున్నది.

రాధికా వెనుకనే వెళ్ళి, భుజం పట్టుకుని తనవేపు తిప్పుకుంటూ "అదుగో' మళ్ళీ నిర్లక్ష్య ధోరణి మొదలుపెట్టావు మూర్తిగారి మనసు తెలుసుననే గర్వంతోనేగా-ఆయన అలిగి వెళ్ళేట్టు చేసి, ఆక్రోశిస్తున్నావూ?'' అంది - అసలు సంగతి తేల్చుకోవాలనే పట్టుదలతో సుశీల "ఈ ఒక్కవిషయంలోనే పప్పులో కాలు వేశానులేవే! సవితిలా దెప్పక కాస్త ఓర్చుకుందూ రేపీపాటికి అన్నీ మర్చిపోతావ్ ... ముందు మీ అన్నయ్య యెక్కడున్నారో వెదికి తీసుకొద్దాం పద" అని రాధిక చేతిని పట్టుకుని లాక్కువెళ్ళింది

ఆయింటి గేటుదాకా అలా లాక్కుపోబడిన రాధిక స్నేహితురాలి మాటలేమీ అర్థంకాక తల్లడిల్లిపోతూనేవుంది "ఇంతవర కెన్నడూ ఇట్లాటిదెరగనంటున్నావు-మళ్ళీ, ఆయన్ని వెదుకుతానంటున్నావు మూర్తిగా రెక్కడున్నారని తెలుస్తుందే నీకూ?" అంది సుశీల అప్పుడే ఆ సంగతి గుర్తించినట్టు నిట్టూర్చి "అదీ నిజమే! రాత్రులు ఇల్లుకదిలి ఎరుగని వారు-ఎక్కడుంటారని వెదకనూ, నా బొంద'" అంది మళ్ళీ స్నేహితురాల్ని వెనక్కు తీసుకెళుతూ, ముందుగుమ్మంలో ఏదో గుర్తువచ్చినట్లాగి "నిజంగా నన్ను క్షమించరేమో రాధికా' 'అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడని' మనం భారతంలో ధర్మరాజును గురించి చదువుకున్నామే-అది గుర్తువస్తున్నది ఇక నా జన్మకు నిష్కృతి లేదేమో రాధికా" అంటూ గావురుమని కూలిపోయింది

కన్నీరుమున్నీరుగా, నిజంగా భయంపడిపోయిన బేలగా' దుఃఖిస్తున్న సుశీల నోదార్చడానికి రాధికకు గంటపట్టింది. "మూర్తిగారు అలిగివెళితే,తన సంసారం పరువే బజారుకెక్కుతుందని తెలియని వారుకాదు తెల్లారేసరికి వస్తారులే సుశీ."



అని నచ్చజెప్పింది అంతకుముందే అక్కడకు వచ్చి సముదాయిస్తున్న గౌరమ్మకూడా కంటతడి పెట్టుకుంటూ "పేణంకంటె ఎక్కువగా, మల్లెమొగ్గకి మల్లే పెంచుకున్న నా తల్లికి యింత కడుపుగిలే కష్టం ఏమొచ్చింది భగమంతుడా" అని చీదేస్తున్నది ఆమె నప్పుడే గుర్తించినట్టు సుశీల చివాలునలేచి, తన దుఃఖాన్ని దిగమింగుకుంది.

తన కళ్ళూ, ముఖం చెంగుతో తుడుచుకుని, గౌరమ్మ కన్నీటినికూడా తుడుస్తూ "నీ సొదకూడా ఎందుకే? నాకేం తీపరం రాలేదుగాని నువ్వూరుకోవే పిచ్చి మొద్దూ. .పదపద–అన్నం తిందూగాని" అని తొందరచేసింది గౌరమ్మ తెల్లబోయిచూస్తూ "నా కడుపు కేం తొందర్లే బుల్లెమ్మా–నీ కింత కష్టంవొస్తే" సుశీల పళ్ళుబిగించి చూచి "అదుగో – నువ్వూ కూడా నా మీద అలిగి, ఇట్లా అన్నం తినకుండా సాధిదామనుకున్నావటే! నేనేం పాపం చేశానే – నే నన్నంపెడతా నన్నా విరోధాలే ఎదురౌతున్నాయ్" అని నెత్తిమీద మొత్తుకుంది.

గౌరమ్మ బిక్కుబిక్కుమంటుంటే, రాధిక "అవ్వా! నువ్విక మెదలకుండా వెళ్ళి అన్నం తినూ'' అని అవతలికి నడిపింది గౌరమ్మ లోపలికి వెళుతూనే డగ్గుత్తికతో "చిన్నయ్య ఎంగిలిపడనే లేదు, నే నెట్టాతినేది రాధమ్మా'' అంది. రాధిక "ఆయన ఏ స్నేహితుల యింటోనో తింటారుగాని పస్తుండరులే–నువ్వుపద" అని తొందరించింది సుశీల వాళ్ళకంటే ముందు వెళ్ళి, ఓ పళ్ళెంలో అన్నం కూరా వడ్డించి తెచ్చి, ఓ పీట వాల్చి, గౌరమ్మను బలవంతంగా కూర్చోబెట్టింది పైగా "అందులో ఒక్క మెతుకన్నా పదిలావంటే, నే నిక నీతో మాట్లాడేది లేదు, ఆఁ–జాగ్రత్త'' అని బెదిరించి, నెయ్యి గిన్నెడూ వొంచేసింది గౌరమ్మ బిక్కుబిక్కుమంటూ చూచి, కిక్కురుమనకుండా అన్నం కలుపుకు తినేసింది

సుశీల మజ్జిగకూడా వడ్డించిన తర్వాత, రాధికను తీసుకుని తన గదిలోకి వెళ్ళింది మళ్ళీ లైట్లు ఆర్పేసి ఇద్దరూ పడుకుంటూండగా, రాధిక "ముసలమ్మ తిండి తినలేదని ఇంత బాధపడి ఇంత చేసిందానివి – మూర్తిగారు భోజనం దగ్గరనుంచి లేచి వెళ్ళేప్పుడు మాత్రం తెలివితేట ల్లేకపోయాయటే సుశీ?" అని అడిగింది సుశీల నిట్టూర్చి "అక్కడికీ నేనిక వంట వండితే వట్టే నన్నా–ఆయన పట్టించుకోందే నేనేం చెయ్యను రాధికా! అలిగినా అర్ధంచేసుకోలేని ఆయన్ని కోప్పడ్డం నా చేతనవుతుందా, ఆయనేం చిన్నవాడా?'' అంటూనే కన్నీరు పెట్టుకుంది

## *11*

కష్టాలలో పుట్టి, చింతలతో పెరిగి, మేధస్సుతో చెమటోడ్చి–మిట్ట ప్రదేశానికి



చేరుకున్నాంగదా, ఇక ఫరవాలేదని ఊపిరి పీల్చుకుంటున్న మానవుడికి, హఠాత్తుగా కాళ్ళకింది మిట్ట కరిగి బురదగామారి, జరజరా జార్చి, కందకంలో తోసివేస్తే ఎట్లావుంటుంది?

నా పని యిట్లా అవడానికి కారణం ఏమిటి? బట్టకట్టి బళ్ళోకెళ్ళే వయసులోనే కష్టాలు చుట్టుముట్టినా లెఖ్ఖచెయ్యలేదు. పాపమూ చెయ్యలేదే! తండ్రి భారీ పోకళ్ళకూ, జల్సాలకూ, చీట్లపేకాటలకూ పాతికెకరాల మాగాణీ భూమి హారతికర్పూరం చేశాడని విన్నాను అది ఆయన తప్పేనని ఈనాడనుకుంటున్నానేగానీ — ఆయన బ్రతికి వున్నంత కాలం ఎన్నడూ కష్టంగా మాట్లాడి ఎరుగను ఈనాడైనా నలుగురూ అనుకుంటున్నారని — నా మనసు ఆయనను తప్పు బడుతున్నదిగాని, ఏనాడో జరిగిపోయిందానికి ఇప్పుడు విచారించి లాభం లేదని తెలియకగాదు

నా తల్లికి ఏడువారాల సొమ్ములూ — మొత్తం జల్లెబుట్టెడు బంగారు నగలుండేవట ఆమె భర్త చేసిన జులాయి ఖర్చులకూ అప్పులకూ — గుట్టు చప్పుడు కాకుండా ఆ నగలన్నీ కరిగించి ఇచ్చివేసిందట తాటాకు కంటే పలచనైన మంగళ సూత్రం, వర్ది నల్లపూసల తాడూ మిగుల్చుకున్న ఆమెను — చుట్టపక్కాలు ఈసడించినట్టుగా మాట్లాడే వారట కొంత నాకూ తెలుసు, ఎవరోకాదు మా తండ్రిగారి ఒకే ఒక తోబుట్టువు రత్నమ్మగారే ఒకసారంది "మీ అమ్మకు మరీ బుద్ధిలేదు లేరా మూర్తీ! మీ బాబట్లా మా నాన్నిచ్చిపోయిన పాతి కెకరాలూ నాశనంజేసిన తర్వాత కూడా, ఇది నగలన్నీ అమ్మి వాడిచేత బెట్టడం ఏమిటీ? వాడి నదుపులో పెట్టడంపోయి, ఇంకా ఎక్కువఖర్చు బెట్టేట్టు మీ అమ్మే నేర్పిందనుకో

"వాడేం చేసినా మా కన్నీ తెలియకుండా దాచిపెట్టి, పెనిమిటి పరువుపోతే తాను బదకలేనట్టు అన్నీ తెగనమ్మి వాడి దోసిట్లో పోస్తుందా ఏ ఆడదైనా! అబ్బే – చేతులారా చేసుకుంది, అనుభవిస్తోంది అదే గట్టిపట్టుగావుంటే పదెకరాలన్నా మిగిలేట్టు జూశేది – నీ కింత కష్టంలేకుండా చదువు చెప్పించుకునేది నే న్నా పిల్లని నీ కిచ్చి యింటో బెట్టుకునే దాన్ని" అంటూ – ఆమె ఇంత మీగడ తీసి నా అన్నంలో వేసింది

మీగడ ఎంతరుచిగా వున్నా నాకు సయించలేదు – జాగ్రత్తగా ఏరి పళ్ళెం అంచున పెడుతుంటే మా మేనత్తగారే మళ్ళీ, "అదుగో – ఆఖరికి గచ్చకాయంత మీగడైనా అలవాటు చెయ్యకుండా నిన్నిట్లా బక్కపీనుగులా తయారుచేసింది ఏం ఆడదిరా మీ అమ్మా – వర్థిగాడిది గానీ" అని దీర్ఘం తీసింది మా అమ్మనంతమాటన్నందుకు నాకు చాలాకోపం వచ్చింది కాని, ఆవిడమాట కెదురాడితే మొట్టికాయలేగాదు, తల గోడకేసి కూడా కొడుతుందని నా అనుభవాలు హెచ్చరించాయి పైగా నేవచ్చినపని కూడా చెడిపోతుందని తమాయించు కున్నాను

ఆమె మీగడగిన్నె ఉట్టిమీద పెట్టడానికి అటువెళ్ళగానే నేను కళ్ళనీళ్ళు తుడుచుకుని, గబ గబా రెండుముద్దలుతిని చేయి కడిగేసుకున్నాను తర్వాత వాళ్ళ గొడ్డచావిట్లో పడుకుని చాలా సేపు ఆలోచించాను మా మేనత్తగారన్న మాటల్లో కొంత నిజంలేకపోలేదు కాని – భర్త పరువూ, ఇంటిగుట్టూ కాపాడుకోవాలనే తాపత్రయంలేక, భర్త కెదురు తిరిగి డబ్బూ పొలం మిగిలితేచాలు ననుకునే స్త్రీలకంటే మా తల్లే గొప్ప స్త్రీ అని తేల్చుకున్నాను అలాంటి ఉత్తమ యిల్లాలును చూచి జాలిపడవలసింది పోయి – ఇట్లా ఈసడించడం నాకు విపరీతంగా తోచింది ఈ నాటికీ నా అభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలగలేదు.

పచ్చి భౌతిక విలువలనే ప్రాణప్రదంగా చూచుకునేవాళ్ళు ఎక్కువగా వున్న ఈ కాలంలో కూడా – మా తల్లి ఆనాడు చేసిందానికి ఇంత నెపంపెట్టేవారుండరనుకుంటాను మా మేనత్త మీగడ పెట్టలేదందిగాని – నాకు మజ్జిగ నీళ్ళు అమర్చడంకోసం మా తల్లి ఏ పొరుగింటనో పిండీ, కారం కొట్టి చెమటోడ్చిందని గాని, తాను గంజిపోసుకుని నాకు మజ్జిగ పోసేదనిగాని, ఈ భాగ్యవంతురాలికేం తెలుసూ?

భాగ్యం అంటే గుర్తువస్తోంది మా తండ్రికి రత్నమగారొక్కతే చెల్లెలవడంవల్ల – మా తాతముత్తవలు వద్దంటున్నా, అంతగా కట్నాలు లేని రోజుల్లోనే తన ఆస్తిలోసగం కట్నంయిచ్చి పొరుగూరి సంబంధం చేశాట్ట బొమ్మరిది ఏడుగు రన్నాదమ్ముల్లోని వాడుగనకా –

బతికిచెడ్డ సంసారంలోని వాడుగనకా, తనేవెళ్ళి వ్యవసాయం పనులు చేసి వచ్చేవాడట, ఆఖరుకు ఆ అన్నాదమ్ములు వేరుపడినప్పుడు బామ్మరిదికి వచ్చిన అప్పులన్నీ తానువెళ్ళి తన సొమ్ముతో తీర్చి వచ్చాడట ఎంతెంతచేస్తే మా మేనత్తగారు అంతటి భాగ్యవంతులయ్యారోనని మా ముత్తవతల్లి చచ్చేదాకా చెప్పుతూనే వుండేది మా మేనత్తగారు మాత్రం అదంతా తను తెలితేటలతో సాధించుకున్నట్టే మాట్లాడేది

ఇంతాజేసి ఆరోజున నే వెళ్ళినపని ఆమె ముడిపడనీయనేలేదు మా కప్పటికి మూడు గుంటలపొలం మాత్రమే మిగిలింది తాతలనాటినుంచీ వున్న మండువా లోగిలి కూడా అమ్మేశారు అంతవరకూ గొడ్లచావిడిగా ఉపయోగపడిన తాటాకుల గుడిశెలో కాపురం దానికి రెండు వైపుల సరిహద్దుగోడ లున్నాయి గాని - మిగతా రెండువైపులా ఏ అడ్డూలేదు ఆ ప్రక్కల కూడా గోడలు పెట్టుకుంటేగాని వంట పాత్రలన్నా భద్రంగా వుండవని మా తల్లి మరీ కన్నీరు పెట్టుకుంటున్నది.

మా తండ్రి ఆమె మాటలు వినీ విననట్లు వూరుకుంటున్నాడు ఆఖరుకు ఒకనాడు నేనే వూరి పొలిమేరనుంచి మంచి మట్టితవ్వి తట్టలో పోసుకుని ఇంటికెత్తుకువచ్చాను. ఆ రోజంతా ఆ పనిలోనే వున్నాను. మా అమ్మ నాచేతులు కందిపోయాయనీ, తల బొప్పికడుతుందనీ కన్నీరు పెట్టుకుంటూనే వుంది. సాయంకాలం మా నాన్న ఎక్కణ్ణుంచో తిరిగి వచ్చి, "ఇట్లా మోస్తే ఎంతకాలానికి గోడవుతుందిగాని, మీ అత్తయ్యగారింటికెళ్ళి ఒకజతని బండిగట్టుకు రారా" అని పురమాయించాడు నా కాశపుట్టింది

మా అమ్మ, "చిన్నాడు, వాడికేం తెలుసూ - మీరు వెళ్ళితే మీ బామ్మరిది మాట తీసివేయడు ఈ వున్న కొంచ్ర కూడా దున్నుకుని పంపుతామని బండీ నాగలీ తోలుకురండీ" అంది. ఆయన తాడిచెట్టంత ఎగిరిపడి, "ఇంతబదుకూ బదికి చెల్లెలింటికెళ్ళి దేబిరించనా? నావల్ల కాదు వెళ్తే వాడ్ని వెళ్ళిరమ్మను - లేకపోతే లేదు'' అని మళ్ళీ బైటికి వెళ్ళిపోయాడు - ఏ పేకాటకో మా అమ్మ; "ఎన్నేళ్ళొచ్చినా, ఎంత జరిగినా ఈ మనిషికి పట్టుదల్లూ, అలవాట్లూ మారవాయె! బాగుపడే తెరువు తెలవకపోయినా, అయిన వాళ్ళతో పనీపట్నం తీర్చుకునే వివరమైనా లేదాయె - నే నెట్లా జచ్చేదీ!!" అని కన్నీరు మున్నీరయింది నేనది చూడలేక తెల్లవారుఝామునే లేచి వెళతానని సముదాయించాను

మా వూరినుంచి మా మేనత్తగారి వూరు పన్నెండుమైళ్లు నా వయసు పన్నెండు ఆరోజుల్లో బస్సుచార్జీ పావలా అదికూడా లేక కాలినడకనే అంతదూరం వెళ్ళాను మా పొలంపోయినందుకు మా ముత్తవతల్లి ఏడుస్తూంటే

(ఆమె అక్కడేవుండేది మా తాతయ్యే పోయి నప్పట్నుంచీ) మా మేనత్త మా నాన్ననూ, అమ్మనూ దెప్పి పొడిచింది తన తల్లిని కసురుకుని సుశీలకు నీళ్ళు పోసుకురమ్మని దొడ్లోకి పంపి - నాకు అన్నంపెట్టింది మళ్ళీ మా అమ్మ చేతప్పని సాధించ సాగింది

మీగడ తీసి వేసిన తడీపొడీ అన్నంతిని గొడ్ల చావడిలోకి వెళ్ళినవాణ్ణి చాలా సేపు ఆ సంగతులే ఆలోచించుకుని అక్కడే నిద్రపోయాను మా మేనత్త భర్త సుబ్బయ్యగారు సాయంకాలం పాలేళ్ళను పొలం పంపడానికి చావిట్లోకివచ్చి నన్ను నిద్రలేపాడు. కుశల ప్రశ్నలడిగిన తర్వాత — నే వచ్చినపని చెప్పాను ఆయనముందు ఆశ్చర్యపోయి, తర్వాత, "మీ నాన్న వ్యవసాయం చేస్తానంటే బండీ ఎడ్లూ తోలిపెట్టలేనా ? ఈ నాటికైనా ఆయనకాబుద్ధి పుట్టింది అంతే చాలు !!" అన్నాడు

కాని, ఆ రాత్రి మేమందరం నిద్రపోతున్నామనుకుని మా మేనత్త ఆయనతో "చచ్చినాసరే మా అన్నకు బండీఎడ్లూ పంపితే నే వూరుకోను, అంతే'' అని కచ్చితంగా చెప్పేసింది. అయన తప్పూ గిప్పూ అని చెప్పజూచినా ఆవిడ ససేమిరా వీల్లే దంది ఆఖరికి ''ఆ బండీ ఎడ్లనుకూడా అమ్ముకుని ఏ పేకాటకో వెడితే ఎట్లా" అనేసింది

## 12


తలుచుకుంటే ఈ నాటికీ విచిత్రంగా వుంటుంది ఈయనెప్పుడూ "పిల్లిబావ" గానే వుండిపోవడానికి కారణం ఏమిటో ఈ నాటికీ నాకర్ధంకాదు ''రాధికా' ఒక నాడేం జరిగిందను కున్నావ్?'" అని చెప్పబోయాను కాని-రాధిక గాఢనిద్రలో వున్నదేమో, పలకలేదు - నాకునిద్రెట్లా పడుతుందీ - అకారణంగా వారు అలిగేట్టు చేసుకుంటినీ '

ఆ నాటి సంగతులు నాకిప్పుడు స్పష్టంగా గుర్తువస్తున్నాయి అప్పటికి ఆయన ధర్డ్ఫారం ప్యాసయ్యారు నేను మూడో క్లాసులో వున్నట్టుగుర్తు మా మేనమామ గారి ఊరు బండిగట్టుకెళితేనే పూటగ్గాని చేరేవాళ్ళంకాదు అంతదూరం ఈయన నడిచే మావూరు వచ్చారట ''చదువు లోనేగాదు నడకలోనూ ఫస్టే మీ పిల్లి బావ'' అని మా నాన్నగారంటే, నాకు నిజమే గావల్నని సంబరంగా ఉండేది ఇప్పుడైతే పావలాడబ్బుల్లేక అంత దూరం నడిచారా అని జాలివేస్తుంది ఇప్పటి నా జాలి - అప్పటి ఆయన కష్టాల నేం తీర్చగలుగుతుందీ '

ఇంతకీ - ఈయన వచ్చిన్నాడు ఏం జరిగిందంటే సాయంత్రం అన్నాలు తిన్నప్పట్నుంచీ ఆయనచేత కథలూ, శాస్త్రాలూ చెప్పించుకున్నాను ఆయ నప్పుడు మావూరొస్తేచాలు నాకు బడి

కూడా మానేసి ఆయన కథలువింటూ కూర్చోబుద్ధయ్యేది ఏటికొకసారి వచ్చే పండగనిపించేది ఆయనెంతబాగా చెప్పేవారు కథలూ, వింతలూ అది తలచుకుని ఇప్పుడుకూడా కథలు చెప్పమని వేధించుకు తినబుద్ధవుతుంది కాని - అప్పటిలాగా ఇప్పుడడగలేక పోతున్నాను-ఎందువల్లనో ' పెళ్ళయినతర్వాతకూడా ఒకటి రెండు సార్లడిగాను అక్కడికీ ! ఆయన విచిత్రంగాచూచి "ఇంకా పసిపిల్ల వేనా '" అని, అదో మాదిరిగానవ్వి, అటుతిరిగి పడుకున్నారు అది గ్రహించక మళ్ళీ అడిగితే "నన్నివాళ విసిగించకుసుశీ'' అని మాటలు తుంచినట్లు మాట్లాడారు ఇంకా ఎలా బలవంతంచేసి కథలు చెప్పించుకోగలనూ ?

ఆ రోజుల్లో అయితే మారాంజేసి, గిల్లి, రక్కి, మీదబడి మోది, మాఅమ్మకో నాన్నకో ఫిర్యాదుచేసి మరీ ఆయనతో కథలు చెప్పించుకునేదాన్ని ఆ రోజున ఏదో జరిగిందన్నానే - యిదే జరిగింది ప్రొద్దుపోయేదాకా కథలుచెప్పిన ఆయన ఇక పడుకుందాం అని నిద్రపోబోయాడు నేను మా నాన్న మంచంమీదికెళ్ళి పడుకుని - ఆయన చెప్పిన కథలను గురించే ఆలోచించుకుంటున్నాను అంతలో మా నాన్నా అమ్మా అన్నంతినివచ్చి మాగదిలో పడుకున్నారు రోజూ నాన్నదగ్గరపడుకునేదాన్ని - ఆ రాత్రి మంచం ఇరుకైనట్లయింది, కాస్సేపు అటూ యిటూ




"హుఁ, 15 సంవత్సరాలనుంచి పోలీసుపని చేస్తున్నాను నా దగ్గరా నీ తెలివితేటలు !"

మసిలేసరికి మా నాన్న "అబ్బ' కాళ్ళతో చేతుల్తో అట్లాకుమ్మక-పడుకుని నిద్రపో సుశీ!" అని విసుక్కున్నారు

నేను కిక్కురు మనకుండా ఎట్టి మంచం పట్టి కానుకుని పడుకున్నాను అమ్మా నాన్నా మా మేనమామని గురించీ, అత్తయ్యని గురించీ, పిల్లిబావని గురించీ ఏమిటో మాట్లాడుకుంటున్నారు నాకవేం అర్థంకావడం లేదుగాని - పిల్లిబావ చేత మళ్ళీ కథలు చెప్పించుకో బుద్ధవుతోంది మా నాన్నగారు దుప్పటి కప్పుకుని పడుకుంటున్నప్పుడు "నాన్నా కథచెప్పవూ?" అని అడిగాను ఆయన "అర్థరాత్రివేళ యిప్పుడేం కథలు రాణీ పడుకో తల్లీ" అన్నారు అమ్మ "ఇప్పటిదాకా ఆ అబ్బాయితో చెప్పించుకున్నావుగదే-ఇక నిద్రపో'" అని కసురుకుంది నేను నిద్ర పట్టడంలేదని మారాంచేసి - పిల్లి బావచేత ఒక్క-కథన్నా చెప్పిస్తేగాని పడుకోనని మొరాయించాను

ఆఖరికి నాన్నగారు విసిగి "సర్లేమ్మా' మీ పిల్లిబావతో ఒక్కథ చెప్పించుకో" మని నన్ను తీసుకెళ్ళి బావ మంచందగ్గర దిగబెట్టారు బావను, "ఒరేయ్, మూర్తీ లెగరా ... మా రాణికి ఒక్క కథంట చెప్పరా నువ్వుచాలా బాగా చెబుతావని యేటి పొ డ వు నా మురుసుకుంటూనే వుంటిందిరా, మా రాణీ! ఆ(!! చెప్పు ఒక్కటిచెప్పు'' అంటూ లేవగొట్టారు ఆయన దుప్పటి ముసుగు తీయకపోయినా కదుల్తూనే వున్నారు పలకడంలేదు, నోనూరుకోక "అంతా దొంగనిద్ర నాన్నా" అని గల్లంతుచేశాను ఇంతలో మా అమ్మ "ఒరేయ్, అల్లుణ్ణని బెట్టు జేస్తున్నావేమిట్రా? లే లేచి సుశీల క్కథచెప్పు'' అని కోపంగా కేకేసింది బావ సర్రున దుప్పటితీసి "అనగనగా ఒకరాణీ" అని కథ మొదలెట్టాడు ఆయన గాభరాగాలేచీలేవగానే కథ మొదలు పెట్టడంచూస్తే కడుపుబ్బే నవ్వు వచ్చింది నవ్వుకుంటున్నాను నాన్న వెళ్ళిపోయారు

ఈ రోజున మళ్ళీ ఆ సంగతి ఎంత గుర్తువచ్చిందో - అంత విచిత్రంగా తోస్తున్నది ఆయన కథచెబుతున్నా - వెనకటి వుత్సాహం, సంతోషం కనిపించడం లేదు నేనాయనపక్కలోపడుకుంటే, ఆయనేమో ఎడమెడంగా జరిగి అటు తిరిగి కథ చెబుతున్నారు నేను బలవంతంగా నావేపు లాక్కుంటున్నా ఇటుమళ్ళడంలేదు, నాకోపంవచ్చి "అమ్మా! చూడవే" అని కేకేశాను ఆయన చివాలున నావేపు తిరిగి, నానోరుమూశారు మళ్ళీ నా కెందుకోదణ్ణంపెట్టి కథ మాత్రం గణగణ చెబుతూనే వున్నారు ఇంతలో మా అమ్మ "ఏమిట్రాగోలా? దాన్నేం చేస్తున్నావురా - కథ చెప్పమంటే ... చాటుగా గిల్లుతున్నావా ఏమిట్రా'' అని బిగ్గరగా విసుక్కుంది నేను, "ఏం లేదులేమ్మా'' అని నవ్వేశాను

మా నాన్నగారు "మన రాణే ఎఱ్ఱ జీమలావాణ్ణి గిల్లుతుందిగాని - మూర్తేం జేస్తాదే! నిన్నటిదాకా ఎత్తుకు తిరిగిన వాడూ వాడెంత మంచివాడో నీకర్థం కాదుగదా" అన్నారు మా అమ్మ "ఊఁ . నీ మురిపేనికేంలే! వాడింకా అన్నీ సరిగ్గావుంటే అల్లుణ్ణేచేసుకునేట్టు న్నావ్! చాలుచాల్లే సంబడం—" అని విసుక్కుంది ఈ మాటలన్నీ మా వారు విన్నారోలేదో - కథ మాత్రం ఆపకుండా చెబుతూనే వున్నారు ఆఖరుకు కథలోని పేదరాసి పెద్దమ్మ మనుమడు పడుతున్న కష్టాలుచెబుతూ - ఈ పిల్లిబావ నిజంగానే వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు మొదట దగ్గుత్తికతో చెబుతుంటే "బావ భలేచక్కా చెబుతున్నా" డనుకున్నా కాని ఏడు పెక్కువై, కళ్ళంట నీళ్ళుకారుతుంటే నాకు భయం వేసింది నేను చేత్తో ఆ వెచ్చని నీరుతుడుస్తూ "అమ్మా" అని పిలవబోయేసరికి, ఆయన గబగబా కళ్ళు తుడుచుకుని నా నోరు మూసేశారు పైగా నాకు మళ్ళీ దణ్ణంపెట్టారు

మా అమ్మంటే ఆయన కంతభయం మరి అంతకంటే చిన్నప్పుడు - నన్ను ఎత్తుకుని ఆడించేప్పుడు, నాకేంతెలియక, కాస్తకూ కూస్తకూ పిల్లిబావమీద ఫిర్యాదులు చెప్పేదాన్నిగా! మా అమ్మ ఆయన్ని మొట్టికాయలు మొట్టేదిగా! ఒకసారి అరుగుమీద ఆడుకుంటూంటే నేనే ఆయన్ని చిలిపిగా కిందకి తోసేశా ఆయన అంతెత్తునుంచి కిందపడ్డంలో, వీధిమూలనున్న తాటిబొత్త తగిలి చెయ్యి విరిగినంతగా వంకరపోయి - గిల గిల తన్నుకున్నారు, నేను గాభరాగా ఇంటో కెళ్ళి మా అమ్మతో "పిల్లిబావ గంతు వేసి పడిపొయ్యాడే ... చెయ్యిరిగిందే" అని చెప్పా మా అమ్మమ్మవిని బైటికి వచ్చి ఆయన చేయి సవరించి, ఎత్తుకుని లోపలికి తీసుకెళ్ళి, ఆ ముదం రాసి తోముతూ "అయ్యో నాయనే! ఎంత దెబ్బతిన్నావురా! చెయ్యిరిగిపోయిందిరా నా తండ్రీ" అని ఏడుస్తోంది మా అమ్మ "ఏం రోగంరా అదీ - అట్లాగెంతకపోతే చక్కా ఆడుకోగూడదూ నీకంటే చిన్న పిల్ల సుశీల చక్కా ఆడుకోటంలా" అని తిట్టిపోసింది

ఆయన అంతబాధతో ఏడుస్తూకూడా "నే పడలేదత్తయ్యా! సుశి, సుశి" - అని చెప్పబోయారు నేను అసలు సంగతి వింటే మా అమ్మ నన్నుకొడుతుందని భయపడి "ఏంటయ్యా - అబద్ధాలు చెబుతున్నావ్—" అంటూనే అలిగినట్టు ఒక్క దెబ్బవేశాను అమ్మమ్మ "అయ్యో — ఆదేంపొగరుబోత్తనమే" అని నన్ను కసురుకుంది మా అమ్మ మాత్రం "చాలుచాల్లే - నీ మనుమడక్కడికి బుద్ధిమంతుడన్నట్లు నా బిడ్డని కసురుకుంటావేం" అని నన్ను అవతలికి తీసుకెళ్ళింది నన్ను బళ్ళోకి పంపించినతర్వాత "అబద్ధాలు చెబుతావా భడవా! నా బిడ్డమీద చెప్పడానికి

నీకెట్లా నోరువచ్చిందిరా అవున్లే ఆతండ్రి బిడ్డవేగా" అని చాలాసేపు చీపురుమడంతో కొట్టిందట ఆ సంగతి ఈ అవ్వగౌరమ్మే చెప్పింది

అంత జరిగినా బావ వాళ్ళవూరు వెళ్ళి పోయేప్పుడుకూడా నన్నేమీ అనలేదు "నే వెళ్ళనా సుశీలా'' అని అడిగాడు నేను ''అబద్ధాలుచెప్పి కొట్టించానని కోపం వచ్చిందా బావా ? అయితే నన్ను చాటుగా తీసుకెళ్ళి నాలుగు దెబ్బలుకొట్టు, నే నమ్మకు చెప్పన్లే" అని బతిమాలినా- ఆయన నవ్వేశారేగాని నా కోరిక తీర్చ లేదు "దాందేముందిలే సుశీ - వెళ్ళొస్తా" నని చెప్పి వెళ్ళిపోయారు

ఇట్లా చాలాసార్లు జరిగింది అందుకే ఆయనకి మా అమ్మంటే భయమని నాకు తెలుసు ఎప్పటికప్పుడు బావమీద చాడీలు చెప్పొద్దని గట్టిగా నాకు నేనే ఒట్టేసుకునే దాన్ని, మళ్ళీ ఏ పూటో ఎందుకో అల వాటుగా అమ్మను కేకేసి చెప్పేదాన్ని కధ చెప్పక పోయినా అంతే, ఏం చెప్పకపో యినా అంతే పాపం ' నా మూలకంగా ఆయనన్ని దెబ్బలు తినడం ఎందుకు, అట్లా హడిలిపోవడం ఎందుకు ?

అట్లా జరిగినా సంవత్సరానికి కొక సారైనా మా వూ(రాకుండా వుండేవాడు కాదు వున్న నాలుగురోజులూ నా కోరిక లన్నీ తీర్చేవాడు ఎన్నితిట్లుతిట్టినా మా అమ్మకు ఎదురుతిరిగేవాడుకాదు మా నాన్న ఎప్పుడన్నా సరసానికి ' ''మీ మేన మామచూశావా, మీ బావతో నీకు ఎన్ని చొక్కాలూ లంగాలూ పంపేదో ?'... అసలీసారి నిన్ను మేనమామగారు తీసు కెళ్ళి, నెలరోజులుంచుకుని, పెట్టెడు గుడ్డలుపెట్టి పంపుతారటలే, అందుకే - నిన్ను తీసుకెళ్ళడానికేగా పిల్లిబావ వచ్చాడూ '" అనేవారు ఆ మాటలంటే నాకు నోరూరేది నిజంగా వాళ్ళవూరు వెళ్ళబుద్ధయ్యేది గుడ్డలవీ లేకకాదు - ఏమిటో మావయ్యగారింటికి - పిల్లిబావ యింటికి అంటే సరదావేసేది

కాని, ఈ మాటలు మా అమ్మ ఎట్లా వినేదో రివ్వున మా దగ్గరకువచ్చి, మా నాన్నమీద జంయ్యినలేచి "ఎంతకాల మున్నా నీ ఎగతాళి మానవుగా ' నా అన్న అట్లా బుద్ధిలేనివాడై పోయాడని తెలిసి కూడా ఆ మాటంలెదుకూ ఏదో ఒకగజం గుడముక్కన్నా పంపుదాం - ఆడబిడ్డకైనా ఒక్కతే కూతురుగదా అని మా వదినె కసలేవుండదాయె నా బిడ్డకేం తక్కువ లేకపోయినా మేనమామ పంపాడని మురుసుకునే యోగ్యత లేకుండాపోయే" అని ముక్కు చీదివేసుకునేది అంతలోనే

ఈ మాటలు వింటున్న పిల్లిబావ - నిజంగా పిల్లిలాగానే దూరంగానో, అరుగు మీదకో వెళ్ళిపోయేవాడు నేనటువెళ్ళే సరికి కళ్ళుతుడుచుకుంటూ వెక్కి వెక్కి పడుతూండేవాడు నే నేమిటి బావా అంటే ఏమీలేదని - నాతో ఆటలకు మళ్ళేవాడు, ఏమి ఆటల్లే-ఎప్పుడూ నే చెప్పినఆటలూ,

కెళ్ళి దాని మొహాన్నే పెట్టు — నా బిడ్డ కేం గతిమాలి లేదని చెప్పు. ఇంతకాలం నుంచీ ఆవిడ పెట్టినవే కట్టుకు వెళ్ళ బోయడం లేదులే మా సుశీల'' అని మా బావ నొక మొట్టికాయ వేసి, చర చరా వెళ్ళిపోయింది ఆయన వలవల కన్నీళ్ళు పెట్టుకుంటుంటే — ఎందుకో నా కప్పు డర్థం కాలేదు ఇప్పు డర్థం చేసు కుంటున్నా — నా జాలివల్ల ఆయన మన క్షోభ ఏం తీరుతుందీ ?

ఎప్పటి కప్పుడు ఈయ నింత విచి త్రంగా ప్రవర్తించి, కావాలని మనస్తా పాన్ని కొనితెచ్చుకోవడం దేనికీ ? మరీ అంత మెత్తగా వుండి — భార్యను, దాసి వంటిదా న్నయిన నా దగ్గరకూడా అంత ఒదిగి ఒదిగి వుండి, తను వ్యధ చెంద డం దేనికి ?

## 13

అయిదారేళ్ళ క్రితం పొట్టచేతపట్టు కుని ఈ బస్తీకి వచ్చినప్పుడు — ఎటు చూచినా శుష్క ప్రియాలూ శూన్య హస్తాలూ ఎదురైన రోజుల్లో, కాలే కడుపుతో, మండే గుండెలతో ఇట్లాగే తిరిగాను వీధులన్నీ గస్తీ తిరిగే వుద్యో గం దొరికినట్టు — ఊరకుక్కలతో పోటీ పడినట్టు — తెల్లవార్లూ తిరిగి తిరిగి, తెల్ల వారుతూండగా దగ్గరలో కనిపించిన ఏ పాత స్నేహితు డింట్లోనో పడుకుని, ప్రొద్దెక్కేవరకూ లేచేవాడిని గాను

అప్పు డొకందుకు, మరుక్షణం ఎలా గడుస్తుందోననే ఆందోళనతో తిరిగిన వాణ్ణి — ఇప్పుడు మళ్ళీ సుశీల, రాధిక, గౌరమ్మ ముఖా లెలా చూడనా అనే సిగ్గుతో రోడ్లన్నీ తిరుగుతున్నాను. అన్నీ నాకు చిరపరిచయమైన రోడ్లే — అయినా ఏ రోడ్డున ఎటు నడుస్తున్నానోకూడా నా కిప్పుడు తెలియడంలేదు కళ్ళు చూస్తున్నా మనసు గ్రహించడంలేదు అవును మరి — మనసు మరొక మధనలోపడి ఉక్కిరి బిక్కిరి అవుతున్నదాయె

అన్నం తినబోతూండగా జరిగిం దానికీ, ఆ తర్వాత సుశీల తన స్నేహితు రాలితో ఆమా టన్నందుకూ — ఆ సమ యాన అంత చికాకు వేసిందిగాని, నిజంగా నే నంతటి తీవ్రమైన మాట లన వలసింది కాదేమో ! ఎన్నడూ ఎవరిచేతా మాటపడని సుశీలను ఎంత నొప్పిం చాయో నా వ్యంగ్య వాగ్బాణాలు ? పైగా — రాధిక, గౌరమ్మల ఎదుటనే, వాళ్ళెంత ఆత్మీయులైనా వాళ్ళ ఎదుటనే, నే నింత దురుసుగా ప్రవర్తించడం ఎలా సంభ వించింది ? నా ధోరణికి పూర్తిగా వ్యతి రిక్తమైన ఈ అకార్యం ఎలా జరిగిపో యింది ? నా హృదయమూ నోరూ నా మాటే వినకుండా ఎందుకు త్రుళ్ళాయి ?

మధ్యాహ్నంనుంచీ సుశీల విచిత్రంగా, విపరీతంగా, విరసంగా ప్రవర్తిస్తున్న మాట నిజమే ' అంతమాత్రాన తర తరాలనుంచీ భర్తల కున్నదనుకునే అధి


కారం అహంకారం నా నోటినుంచి ప్రవహించాలా ? భార్య నర్ధం చేసుకుని ప్రశాంత సంసార జీవితాన్ని పాదుకొల్పిన ఆదర్శ పురుషుడ నని కించిత్ గర్వంకూడా పొందుతున్న నేను – ఇదా ఆఖరుకు చేయవలసింది ? ఏళ్ళ తరబడి ఆవిడ గయ్యాళిగా ప్రవర్తిస్తుంటే, నేనే గనుక సర్దుకుపోతున్నా నన్నట్లు దుర్గర్వ పూరితంగా వాగేశానే ? రాధిక కూడా సుశీల నన్ను అకారణంగా వేధిస్తున్న దని భావించేట్టు ప్రవర్తించానే? ఈ ఒక్కపూటా ఓర్చుకుంటే – రాధిక వెళ్ళి పోయిన తర్వాతనో, రేపు యే సంతోష సమయంలోనో–సుశీల తన చర్యల కర్ధం చెప్పి నా దిగులు బాపేదికదా ? లోగడ ఎన్నోసార్లు చిన్న చిన్న తుఫానులు తలెత్తనున్న వనిపించి నప్పుడు, నేను తమాయించు కూరుకుంటే – తర్వాత సుశీలే అన్నీ చెప్పి, తను పొరపాటుగా మాట్లాడినట్లు వప్పుకోడం జరిగిందిగదా?

ఈసారి ఎందు కలా మిన్నకుండే వివేకం నశించిందీ ? ఇలా వితర్కించు కుంటుంటే – నా ప్రవర్తన నాకే సిగ్గుగా వుంది చలిగాలిలో, చెప్పులుకూడా లేని కాళ్ళతో, నైట్ డ్రెస్‌లో ఇలా తిరుగుతూంటే చూచినవా శ్చేమనుకుంటారు ? అయిదారేళ్ళ క్రితం అంటే – దిక్కూమొక్కూ పరువూ ప్రతిష్ఠా లేని అనామకుణ్ణి ఇప్పుడు పెద్ద వ్యాపారస్తుల్లో పెద్దతనం లభిస్తున్న ఉద్యోగిని దా దా పు లక్షాధికారిని. ఎరిగినవారూ, పరిశీలనగా చూచేవారూ బస్తీ అంతటా ఏర్పడిన పెద్దమనిషిని అలాంటివాణ్ణి ఇట్లా రోడ్ల వెంట తిరుగుతుంటే – ఎరిగినవా రెవరైనా ఏ అపార్థాలు తీస్తారోనని భయం వేసింది

ఈ సంగతి గుర్తువచ్చిన వెంటనే ఇంటికి తిరిగి వెళదా మనుకున్నాను కాని – అలిగినందుకు, అన్ని మాటలన్నందుకు, అలిగికూడా మళ్ళీ అంతలోనే తిరిగి వచ్చినందుకు అక్కడ సుశీలా, రాధికా ఎంతెంత మాటలంటారో, ఏమేం ఎగతాళి చేస్తారో నని మరీ భయం వేస్తున్నది సిగ్గుతో మనస్కరించక కాళ్లు వెళ్ళినట్లల్లా తిరుగుతున్నాను

ఎంత సేపట్లా తిరిగానో గుర్తులేదు కాని – వొళ్ళంతా చెమటపట్టి, కాళ్ళు పీక్కుపోవడం మొదలెట్టేసరికి ఇక నడవలే ననిపించింది క్షణం ఆగి ఏ రోడ్డుమీ దున్నానా అని చుట్టూ పరికించాను అది జాలీ క్లబ్ వున్న రోడ్డు సినిమానుంచి కార్లో ఎక్కించుకు వచ్చి నన్ను మా యింట దింపిన ఆ మిత్రుడు ఈ జాలీ క్లబ్‌లోనే వుంటాడు వుంటే కాస్సేపు కాలక్షేపం అవుతుందని లోపలికి వెళ్ళాను నే కాలు లోపల పెట్టేసరికే గోడ గడియారం నాలుగ్గంటలు కొట్ట నారంభించింది

నా మిత్రుడు నలుగురైదుగురతో



"చూడండి, మీ అమ్మాయిని మా వాడికి చేసుకో... ''

''అలాగే! మీ వాడితో మా అమ్మాయి లేచిపోయింది నిన్న ఆ సంగతి చెప్పటానికే నే వచ్చాను ''

---

కలసి పేకాట ఆడుతున్నాడు అందరి ముందూ వందలూ, పదులూ కట్టలు కట్టలుగా వున్నయ్ వాళ్ళకి చిల్లరతో పనే లేనట్టుంది నే వెళ్ళి మా మిత్రుని వెనుకగా ఓ కుర్చీలో కూర్చుని ఊపిరి పీల్చుకున్నాను చెమటను లుంగీ పంచె అంచుతోనే తుడుచుకుంటూ — చుట్టూ చూచాను ఒక టేబుల్ దగ్గర నలుగురు పెద్దమనుషులు విస్కీ బ్రాందీల వంటి పానీయాలు సేవిస్తూ — సిగరెట్లందించే కుర్రాణ్ణి డేన్స్ చేయమని నిర్బంధిస్తున్నారు వాడు తెల్లబోయి, వాళ్ళిస్తున్న రూపాయి నోట్ల కోసం తైతెక్కలాడుతున్నాడు మరోమూల నలుగురు చిల్లర డబ్బులతోనే అడ్డాట ఆడుతున్నారు ఇంకోమూల పదుగురుచేరి రాజకీయ భవిష్యత్తుమీదే పందేలు కడుతున్నారు

ఇంతలో మా మిత్రుడు "మైగాడ్ — ఇదీ ఆల్ కొంచే'' అంటూ మూర్ఛబోయినట్టుగా పేకముక్కలు వదిలేసి,

వెనక్కు వాలిపోయాడు వాడి ముందున్న నోట్ల కట్టను ఎదుటివాడు స్వంతం చేసుకున్నాడు నేను అక్కడ ఇక వుండలేక పోయాను నే లేచే సరికి మిత్రుడు చూచినట్టున్నాడు. ''హల్లో మూర్తీ' ఎంత సేపయిందిరా వచ్చీ? ఇందాక నే పిలిచినా రానంటివే? రా, రా. .ఒక రౌండ్ ఆడదాం. డబ్బు తియ్ మనం క్షవరంలే . '' అంటూ చేతుల్తో నా జేబులు తడుమసాగాడు అబ్బ! కంపు!! బాగా తాగినట్టున్నాడు

నేను ''ఏమీ తోచక వచ్చాన్లేరా' నాదగ్గరేం లేదుగాని — ఈ పాడు పేకాట ఎందుకు. పోదాం పద'' అని. వాణ్ణి బైటికి లాక్కువచ్చాను వాడి ఎగతాళీ, వాగుడూ వినిపించుకోకుండా — వాడి కారు లోనే ఎక్కించి. నేను డ్రైవ్ చేసుకుంటూ, వాణ్ణి వాళ్ళింటివద్ద దింపేంత వరకూ నాకేదో జ్వరం ముంచుకొచ్చినట్లే వుంది వాణ్ణి దింపి ఇంట్లోకి పంపిన తర్వాత — ''కారుతో కొంచెం పనుంది— నే తీసుకెళుతున్నారా బ్రదర్'' అని కేక వేసి, వాడి జవాబు వినకుండానే - మళ్ళీ రోడ్లవెంట పడ్డాను మళ్ళీ ఎంత సేపు రోడ్లు సర్వే చేశానో తెలియదు

కారు తారురోడ్లమీద జర్రున జారిపోతుంటే - నా మెదడులో మళ్ళీ రాత్రి జరిగిన సంగతులే సుళ్ళు తిరుగుతున్నయ్ నే నంతంత మాట లంటుంటే సుశీల ఎట్లా భరించిందా అని ఆశ్చర్యంగావుంది చిన్నప్పుడు నేనేమీ అనకపోయినా తన తలిదండ్రులతో చెప్పి శిక్షవేయించిన పిల్ల, పెద్దదై సరసాలుకూడా సహించలేక ముఖం చిట్లించే యువతి, అభిమాన ఆత్మగౌరవ దృష్టి లెక్కువగా గల ఆధునిక గృహిణి - ఆ సుశీల. తన స్నేహితురాలి ఎదుటనే, భర్త అంతంత మాట లంటూంటే ఎందు కూరుకుంది ? ఎదురుతిరిగి ఏ ఒక్క మా టన్నా నే న్నోరుమూసుకునే వాణ్ణేగా ? రెండేళ్ళ నుంచీ నాతో కాపురం చేస్తూ కూడా నా ధోరణులు గుర్తించలేనంత పిచ్చిపిల్లా '

అదుగో—మళ్ళీ నా పురుషాహంకారం తలెత్తిళట్లుంది ఎంతో తెలివిగల వాడననుకునే నేనే ఆమె నర్థంచేసుకున్న వాడి ననుకుంటూ కూడా, ఇప్పుడర్థంచేసుకోనట్టు గ్రహించాను గదా' ఇక పుట్టు భోగిగా, అల్లారుముద్దుగా పెరిగిన, అయినింటి ఆడపడుచు సుశీల నన్నర్థం చేసుకోలేని పిచ్చిదనుకోవడం ఎందుకూ?

అవును' నేను మొదటినుంచీ సుశీలను అపార్థమే చేసుకుంటున్నానేమో అనిపిస్తూంది ఆమె తలిదండ్రులు, మా స్థితిగతులుచూచి జాలిపడైనా సాయపడక పోవడం తప్పని బంధు మిత్రులంతా పదేపదే అనేవారు నేను లోకరీతి ప్రకారం అంతేగావల్ను అనుకునేవాణ్ణి గాని-ఏనాడూ ఆత్మతః వాళ్ళను ద్వేషించి ఎరుగను, కోపం తెచ్చుకుని ఎరుగను నేను బి. యే చదివే రోజుల్లో కూడా -

రాత్రులు ట్యూషన్స్ చెప్పుకునీ, మిత్రుల యిండ్ల వారాలుచేసుకునీ బ్రదికానేగాని- భాగ్యవంతులైన మేనత్తగా రేదో పెట్టాలని దేబిరించినవాణ్ణి కాదు కాకపోతే - బంధుప్రీతితో సాలు కొకసారైనా వెళ్ళి వచ్చే వాణ్ణి

అలాంటప్పుడు సుశీల నాతో మామూలు చనువుగానే మసిలేది. వాళ్ళ అమ్మా నాన్నా కసురుకున్నా నాతో ఎక్కువగా మాట్లాడుతూ, లోకాభిరామాయణం చర్చించుతూ - రేయింబవళ్లు నా దగ్గరే గడిపేది చిన్నపిల్లలాగానే కధలవీ చెప్పమనేది ''అమాయకురాలు' అంతటి భోగభాగ్యాల్లో పుట్టి, ఇంతటి తల్లి శిక్షణలో పెరిగి, హాస్టల్లో వుంటూ బి యే. చదువుకుంటున్నా సుశీల అమాయకపు పిల్లగానే వుండిపోయింది'' అనుకునేవాణ్ణి నా కొక్కోసారి జాలి కూడా వేసేది - యుక్తవయసు మీరిన పిల్ల, ఇప్పటికీ కధలకోసం చెవిగోసుకోవడం, ఎంత చుట్టాన్నయినా రాత్రులు కూడా నా దగ్గరలోనే పడుకుంటాననడమూ గమనించి

అలాంటి పిల్ల బి యే చదివినా ప్రేమాగత్రావంటి వ్యవహారాల్లో పడ లేదంటే - చాలా మందికి ఆశ్చర్యం వేసింది గాని, నాకు చాలా సహజమేనని తోచింది అందువల్లనే తలిదండ్రులు తనకు బైటి సంబంధాలు చూస్తున్నా సుశీల వద్దనలేదు నన్ను చేసుకోమన్నా కాదనలేదు నేనే ఆవిడ క్షేమం కోరి ఏవేవో అభ్యంతరాలు చెప్పాను మా మేనత్తా మామయ్యా వచ్చి బ్రతిమాలుకున్నా రెండు. నెల్లు వాయిదాలు వేస్తూ వచ్చాను

అప్పటికి నేను మా మిత్రుని కంపెనీలో విశాఖపట్నంలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నా నెలకైదువందల జీతం బంధు మిత్రులు దానికే ఈర్ష్యపడేవారు అయినా మా మేనత్త తన కూతుర్ని అంత కట్నంతో నాకిచ్చి పెళ్ళి చేస్తానంటే నాకు నమ్మకం కుదరలేదు నాకంటే వందరెట్లు మెరుగైన సంబంధాలు తేగల వాళ్ళు, వెనకా ముందూ ఏమీలేక - వుద్యోగంమీద మాత్రమే బ్రదికే నాకోసం రావడం ఏమిటి ? ఆమాటే అన్నాను వాళ్ళు 'మేనరికం' అన్నారు - అదే ముఖ్యమన్నట్లు ఆనాటి వరకూ లేని మేనరికపు వాత్సల్యాభిమానాలు ఆనా డెందుకో అర్ధంకాలేదు - అప్పటికే - మా కంపెనీ ఓనరు నాకు పావలా వాటా రాశాడని నా కా నాటికి తెలియదు.

తన కళ్ళెదుట హీనస్థితిలో పెరిగిన నేను, తన తలిదండ్రులతో తిట్లూ మొట్టికాయలూ తిన్న నేను, తనను ఎత్తుకుని పాలేరులా తిరిగిన నేను - సుశీలకు భర్తగా భరించదగిన వాడనని ఆమె ఎలా ఊహించుకోగలదూ ? ఒకవేళ తలిదండ్రుల మాట కాదనలేక నన్ను పెళ్ళి


చేసుకున్నా - నా వద్ద భార్యగా మెలగ లేక, ఎంత మానసిక సంక్షోభానికి గురౌతుందోనని నేను బాధపడ్డాను. ఒక వేళ నా మీద ఎప్పటివలెనే పెత్తనం చెలాయించే ధోరణిలో గయ్యాళిగంప అవుతుందేమోనని భయం పడ్డానుడాకూ అందుకే అభ్యంతరాలెన్నో చెప్పాను. ఈ అభ్యంతరం వచ్చేసరికి సుశీల తన స్నేహితురాలి ద్వారానూ, తను స్వయం గానూ నా కెన్నో హామీ మాటలు చెప్పింది

ఆఖరుకు మా అమ్మ ఈ పెళ్ళి చేసు కోకపోతే తను చస్తానని వొట్టు పెట్టు కుని - నా మెడలువంచి వప్పించింది అమ్మ మాటకోసం ప్రాణాలైనా అర్పింప వలసిన నేను వప్పుకోక తప్పలేదు పెళ్ళి జరిగింది అయినా - సుశీల నన్ను భార్యగా సుఖపెట్టలేదనీ, నే నామె గారాల పెంపుకు తగిన గౌరవాన్నివ్వని పురుషుడనై బాధపెట్టవచ్చుననీ భయపడి పోయేవాడిని

కాని - శతవిధాలా, శాయశక్తులా సుశీలను సుఖపెట్టాలనీ, గౌరవ భంగం కాకుండా స్నేహితురాలిని చేసుకోవాలనీ భర్తల్లో సహజంగావుండే అధికారమేదీ ప్రదర్శించరాదనీ, మా సంసారం సకల సంతోషాలతో శాంతియుతంగా సాగు తున్నట్టు మా యిరువురి తలిదండ్రులూ తృప్తిపడేట్టు పవర్తించాలనీ నిశ్చ యించుకున్నాను సుశీల కూడా ఆ నిశ్చ యంతోనే వున్నట్టు నాతో సహకరిస్తు న్నది తన ఖర్చులనేవి లేకుండా మాను కుంది క్రమంగా స్నేహితులతో సిని మాలకు వెళ్ళే ఖులాసా కూడా వదులు కుంది నే డబ్బిచ్చి ప్రోత్సహించినా నగలూ, చీరెలూ ఖరీదైనవి కొనడం తగ్గించేసింది నన్ను ఎంతో సంతోష పెడుతూ మధురానుభూతులు అంది స్తున్నది

పైగా తనొక దాసీదైనట్టు నాకు ఏమేమో అమర్చిజూస్తున్నది ఎందరో పనివాళ్ళుండగా తనే నాకన్నీ అమర్చా లనుకోడం, నా బూట్లు కూడా తుడవా లనుకోవడం దేనికి ? వంటవాడుండగా ఎన్నడూలేంది తను చెయి కాల్చుకోడం దేనికి ? కారుల్లో తిరిగిన తను, కారును నాకోసం పంపి - ఏ పేరంటానికైనా రిక్షాలో వెళ్ళే ఖర్మేంబట్టింది నే నెన్న డైనా నా కంటె తానింత లొజ్జుగావుండా లని సూచించినవాణ్ణి కాదే మా మేనత్త గారి ముద్దుల కూతురుగా ఆదినుంచీ నాలో ఆమెపట్ల పెరిగిన గౌరవభావం- నేను తగ్గించుకోలేదే ? మరి - ఎందుకీ తపన ?

ఏమోగాని - ఇటీవల సుశీల మరీ మారిపోతున్నట్టుంది కారణం చెప్ప కుండా విసుక్కోడం, చిరచిరలాడ్డం, అలగడం, ఏమీ చెప్పకుండా ఏడ్వడం ఎక్కువయింది నే నేం కానిపని చేస్తు న్నానో అర్ధం కాక చస్తున్నాను ఈ



“ఈ ఎర్రగుడ్డలన్నీ పంచేస్తాం ! రేపు నల్లరంగు వేయించు.”

రెండేళ్ళ కాపురంలోనూ సుశీలను తప్పు పట్టగల అంశం దొరక్కపోయినా - ఇటీవలి ఈ ప్రవర్తనే నా కాందోళనకరంగావుంది. గత రాత్రి, అంతకు ముందలి మధ్యాహ్నం ఆమె ప్రవర్తించిన తీరుకు నేనింత కంటే ఏం అర్థం చేసుకోనూ ? ఏ తప్పులేని తాను వ్యధపడ్డం దేనికి, నన్ను వ్యధపెట్టడందేనికి ?

ఇట్లా ఆలోచిస్తూండగానే భళ్ళున తెల్లవారి. ఎర్రని సూర్యోదయం అయింది. రాత్రంతా నిద్ర లేదేమో కళ్ళు చిడతలు గమ్మినట్లయి - కారుకు బ్రేకు వేశాను అప్పటికిగాని, నేను మా బిజినెస్ ఆఫీసుముందే కారునాపానని గుర్తించలేకపోయాను

## 14

తెల్లవారినా, ఝాము ప్రొద్దెక్కినా వారు ఇంటికి తిరిగి రానేలేదు - రాత్రి అంత ధైర్యం చెప్పిన రాధికకూడా ఈ పూట ఆందోళనపడుతున్నది. గౌరమ్మ సంగతి సరేసరి - మాటిమాటికీ వాకిట్లోకి వెళ్ళి, తెల్లమొహం వేసుకు వస్తున్నది. బిక్కుబిక్కుమంటున్నదేగాని నాతో ఏమీ అనలేకపోతున్నది. పాపం, నేనంటే అంత భయం దానికి ! హుఁ - సిగ్గులేనట్టుంది నాకు-నన్ను చూచి ఎదుటివారు భయపట్టం, గొప్ప అనుకుంటున్నట్టున్నాను. నే నొకర్ని భయపెట్టాలనే వుద్దేశంతో ప్రవర్తించడంలేదే ? ! ఉద్దేశం వున్నా లేకపోయినా, పరోక్షంగానైనా ఒకరికి నావల్ల భయభ్రాంతి కలుగుతున్నదనేదే గమనించవలసిన విషయం గదా !

నామనసెలాంటిదైనా-మాటలూ చేష్టలూ ఎదుటివాళ్ళనంత భయపెడుతూన్నాయన్నమాట ? సందేహంలేదు -

ఆయనకూడా నా ముఖం చూచి, నా మాటలు విని, తాము చెప్పబోయే మాటలూ, చేయనున్న పనీ మానుకోడం తరచుగా జరుగుతూనే వుంది అంటే – నా మనసు ముఖంలో ప్రతిఫలించడం లేదన్నమాట మనసు ఎలా వున్నా ముఖం భయపెడుతున్నదన్నమాట

వారి అదృష్టం ఏమిటో – ఏ క్షణానా కోపం కనుపించదు అందుకే బంధుమిత్రులేగాక, ఆఫీసులో నౌకర్లుకూడా ఆయన ముఖం చూస్తేనే దణ్ణం పెట్టబుద్ధవుతుందంటారు "మూర్తిగారు మారాజుగదండీ, ధరమరాజు" అని మురుసుకుంటారు ఆయన అడుగుజాడల్లో నడుద్దామని మాత్రమే అహరహమూ తహతహలాడుతున్న నేను అంత మంచిమాట సంపాదించుకోలేకపోగా నా ముఖం చూస్తేనే అందరూ ముడుచుకుపోయేట్టు చెయ్యడం–నా దురదృష్టంగాక ఏమనుకోనూ ?

రాత్రి అలా అలిగి వెళ్ళిన వారు ఇంతవరకూ ఎక్కడున్నారో ఏమో ? వెదుకుదామన్నా, ఎక్కడని ? ఇదేమన్నా సినిమా కథా – వీధులవెంట చింపిరి జుట్టేసుకుని పరుగులుదీస్తే ఏ మూలనో హీరో హీరోయిన్లు ఢీకొని కలుసుకోడానికి ? ఇది వాస్తవ జీవితం, లోకంతో ముడిపడ్డ ఆధునిక జీవితమాయె వీధిలో ఎవరే కారణంగా ఆందోళనతో కనుపించినా – తతిమ్మా లోకమంతా వేయికళ్ళు చేసుకుచూస్తూ లక్ష రకాల ఎగతాళి జేయడానికే సిద్ధమయ్యే జీవితమాయె !

రాధిక బలవంతంమీద కాఫీ తాగవలసివచ్చింది అది కషాయంలా కడుపులో దేవుతున్నది ఈ ఆందోళన సమయంలో రాధిక కూడా ప్రక్కన లేకపోతే ఏమైపోయేదాన్నో ? గుండెలు అవిసి ఏం పిచ్చిపని చేసేదాన్నో ఒకరిచేత వీసమెత్తు మాటపడని మగవారిని భార్యే మాటలని – అదీ నిష్కారణంగా రభసజేసి – వీధులపాలుజేసిన తర్వాత ఆ ఆడది బ్రదికెందుకూ ? చచ్చినా ఆ స్త్రీకి నిష్కృతి వుండదనిపిస్తున్నది రాధిక మాటలు నన్నీ వూహాలు కొనసాగనీయకుండా మళ్ళిస్తున్నాయి

చివరికి – తెల్లవారిన తర్వాత ఏ వందోసారో రాధిక మళ్ళీ అడిగింది. "ఇంతకీ నిన్నమధ్యాహ్నం నువ్వంతగా శోకించడానికీ, వడ్డించిన విస్తరిమీద వ్యంగ్యాలు విసరడానికీ కారణం ఏమిటో చెప్పవా సుశీ ? నాకోసం కాకపోయినా, నీ మనసుకు నువ్వు సమాధానం చెప్పుకోక తప్పదు ఆత్మ పరిశోధనద్వారా ఆ మూలకారణం తెలుసుకుంటేగాని – నీ భవిష్యత్తులో ఇలాంటి పొరపొచ్చాలు మళ్ళీ రాకుండా జాగ్రత్త పడలేవు సుశీ" అని హెచ్చరించింది

నేను ఆ పనిలోనే వున్నానని ఈ రాధికకెలా చెప్పను ! ఈ స్నేహితురాలి సాన్ని

హిత్యంవల్ల నా కెంతటి ఊరట కలుగు తున్నా. నా ఈ ప్రవర్తనను గురించి సిగ్గువిడిచి చెప్పగలనా!

రాధిక చాలాసేపు నా జవాబుకోసం ఎదురు చూచినట్లుంది ఆఖరికి లేచి వెళ్ళబోతూ, "సరే - నీ యిష్టం భర్త చెప్పిందే వినని దానివి, నా మాట వింటా వనుకోవడం నా వెర్రేలే... వెళ్ళొస్తా'' నంది ఆమె ఆ మాటలన్న తీరు నన్ను భయ విహ్వాలను చేశాయి తటాలున లేచి రాధికను నాసోఫాలోకి లాక్కుంటూ "నువ్వు అలక్కు రాధికా! నాకింకెవ రున్నా రీ లోకంలో... ఒక్కసారి క్షమించి నా మాట విను" అని కూచో బెట్టుకున్నాను క్షణం ఆలోచించి చెప్ప సాగాను

"నేను చేసిందానికి అర్ధమేమిటో ఇద మిద్ధంగా చెప్పలేకపోతున్నాను కాని... మూలకారణం వెదకడంకోసం నువ్వ న్నట్లే ఆత్మ పరిశోధన చేసుకుంటు న్నాను అలాంటి ప్రయత్నమే ఈ అన ర్థాలకు దారి తీసిందంటే నువ్వు నమ్మ లేవు రాధికా మచ్చుకి ఒక్క సంఘటన చెబుతాను. నిన్నటి ఉదయం జరిగిందే. విను.

"నిన్న ఉదయం ఏడు గంటలకు కాఫీ తాగుతూండగానే మీ అన్నయ్యగారికి ఎవరో ఫోన్ చేశారు ఏదో వ్యాపార వ్యవహార మట ఆయన వెంటనే బైటికి వెళ్ళిపోయారు. రోజూ 10 గంటలకే భోం చేసే వారు. 11 గంటలవరకూ రాకపోయే సరికి నాకు మనసు పాడైపోయింది. నాయర్ మాత్రం నన్ను తినమనీ, ఆయ నేదో వ్యాపారం పనిమీద వెళ్ళినపుడు ఏ వేళకు వస్తారోలెమ్మనీ వేధించుకు తిన్నాడు తన కవతల ఏదో పనివుందని కూడా గొణుగుతున్నాడు నాకు చిరాకు వేసింది నేనిప్పుడు తినను లెమ్మని కసురుకున్నాను

"మరి కాస్సేపటికి ఆయన వచ్చారు. బీరువాలోంచి ఏవో కాయితాలు తీసు కుంటున్నారు 'అవి తర్వాత తీసుకో వచ్చు భోజనానికి ర'మ్మన్నాను ఆయన 'నాకు మళ్ళీ ఆఫీసులో అర్జంటు పనుంది ఈ పూట భోంచెయ్యను లే సుశీ' అన్నారు నేను 'ఎంత పనుంటే మాత్రం అన్నం తినకుండా వెళ్ళడ మేమిటీ? మనాఫీసు కూ డా మనం ఆలస్యంగా వెళ్ళితే మునిగిపోతుందా?' అన్నాను ఆయన 'మనాఫీసనుకోవడం ఏమిటి? అసలు ఓనర్ మా ఫ్రెండుగదా, నే నుద్యోగిని మాత్రమే' అన్నారు నేను 'మీకూ బిజినెస్‌లో భాగం వున్నప్పుడు నౌక రనుకునే ఖర్మేం బట్టే? పనికి మెచ్చి భాగం కూడా యిచ్చిన ఫ్రెండ్, కాస్త ఆలస్యంగా వెళ్ళితే ఏమనుకుంటారేం? రండి రండి,' అని వారి చేతిలోని కాయి తాలు లాక్కుని వంటగదిలోకి పారి పోయాను.

"ఆయన నా వెనకే పరుగున వచ్చి,

'చిలిప్పనులు చెయ్యకు సుశీ: ఇది లక్ష రూపాయల బిజినెస్ డీల్ క్షణం ఆలస్య మైనా ఛాన్సు పోవచ్చు అందుకే తొందర ఫ్రెండ్ తప్పుపడతాడా లేదా అని కాదు, మనసుకు సమాధానం చెప్పుకోవాలి ముందు' అన్నారు నేను ఆయన భోం చెయ్యకుండా వెళ్ళడాన్ని సహించలేక 'అయితే భోం చెయ్యకుండానే వెళతావా మళ్ళీ రాత్రిదాకా ఉపవాసం చేస్తావుగా?' అని రెక్కించి అడిగాను నిష్ఠురంగానే ధ్వనించాయి ప్రశ్నలు అలాగన్నా వారు భోంచేస్తారని ఆశించాను ఆయన 'మధ్యాహ్నం భోంచేస్తాను — క్యారియర్‌లో పెట్టి పంపమను నాయర్‌ను' అంటూ నా చేతిలోని కాగితాలు లాక్కున్నారు

"అంతలో నా కోపం వచ్చిందనుకుంటా 'మీకంత మోజుగా వుంటే ఉపవాసమే వుండండి — నేను ఇంటో వేళకు వంట చేయించలేని దానిలా ఆఫీసుకు క్యారియర్ మాత్రం పంపను' అని చెప్పేశాను అప్పుడే నాయర్ 'మీ కోసం అమ్మగారు కూడా కూచున్నారు సార్ మితో కూచ్చుని తినాలని సరదా పడుతున్నారు సార్' అని చెప్పాడు అంతలో ఆయన నవ్వేశారు 'సరే, ఇద్దరికీ వడ్డించు నాయర్' అని చెప్పి, బాత్ రూంలోకి వెళ్ళారు

"నేను తృప్తిగా ఫీలయ్యాను ప్లేట్లు తీసి టేబుల్ మీద పెట్టాను వారు వచ్చి కూర్చున్నారు నాయర్ తెచ్చిన కూరల గుత్తి అందుకుని నేనే వడ్డిస్తున్నాను — రెండు ప్లేట్లలోనూ, ఆయన 'నువ్వు కూచో సుశీ — నాయర్ వడ్డిస్తాడు లే' అన్నారు నాకు మహాకష్టం వేసింది. నేనంత ముచ్చటపడి వడ్డిస్తుంటే ఆయన ఆలా ఆపడం ఏమిటి చెప్పు? అందుకే 'నాయర్ చేతి వడనే రుచైతే కానివ్వు నేనెంత బ్రతిమాలినా వినకుండా, నాయర్ ఒక్కమాటనగానే భోజనానికి వచ్చావుగా ఇప్పుడేమయిందో అర్జంట్ బిజినెస్? నాకంటే నాయర్ మాటే ఎక్కువలే నీకూ!' అని కూరల గుత్తి అక్కడ తగలేసి, నేనూ కూర్చీలో కూచ్చుని అన్నం కలుపుకుంటున్నాను

"నేనింత ఇదౌతుంటే ఆయన నవ్వేశారు పైగా 'ఇంత పిచ్చిపిల్ల వేం సుశీ?' ముఖం అట్లా చిట్లించుకుంటే తిన్న అన్నం కూడా వంటపట్టదు నవ్వుతూ తిందూ — నే తొందరగా వెళ్ళాలి' అన్నారు ఎలాగో ఒకలా తినేశాం ఆయనకంటే ముందే నే చేయి కడుక్కుని, బూట్లు తెచ్చి, వారి కాళ్ళకు తొడగబోయాను, ఆయన తెల్లబోయి నా వంక చూస్తూ 'ఛఛ...ఇదేం పని నే తొడుక్కోలేనా?' అని లాక్కున్నారు. నా మనసు చివుక్కుమంది

"ఆయన హడావుడిగా వెళ్ళి కారెక్కి, డ్రయివర్‌ను తొందరగా పోనిమ్మనడం నాకు వినిపిస్తూనే వుంది కాని — అంతలోనే

స్టార్టయిన కారు ఇంజను ఆగిపోయింది. ఆయన లోపలికి పరుగున వచ్చి: 'సాయంకాలం ఉప్మా చేయిస్తావా సుశీ? నీతో వడ్డింపించుకు తినాలనుంది. ఒంటి గంటకి వీలుండదు గాని నాలు గింటికి వస్తా...టా, టా !...బై బై' అని పాఠం వప్పజెప్పినట్లు చెప్పి వెళ్ళి పోయారు. నాకు మరీ విచిత్ర మనిపించింది.

"నా ముచ్చటా మనసూ తెలుసుకోక పోయినా, తమకొక్కవలసింది ఆజ్ఞాపించి చేయించుకు తినవలసిన వారు–ఇలా బ్రతిమాలుతున్నట్టు మాట్లాడ్డమా ?! అందుకేనేమో అందరూ మరీ మరీ మంచివారని మెచ్చుకునేద......అయినా – ఇలాంటి భర్తతో ఎలా వేగేది చెప్పు రాధికా ? మళ్ళీ అంతటిమంచివారికూడా మనసు కష్టం కలిగించేదాన్నయిపోతున్నానే అని నామీద నాకే కోపం వచ్చింది. ఏడుపో కోపమో తెలియని అవస్థలో నిన్న మధ్యాహ్న మంతా గడిచింది. ఆ తర్వాత సంగతి నీకు తెలుసుగా సుశీ...ఇంకేం చెప్పను–నా ప్రవర్తనను గురించి ? నిజంగా తప్పంతా నాదే నంటావా ?" అని నిగ్గదీసి అడిగాను.

రాధిక ఫకఫకా పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వింది. పది నిమిషాల దాకా నవ్వుతూనే వుంది నాకు మాత్రం ఆందోళన తీరలేదు "ఎందుకే అంతనవ్వా? నేను పిచ్చిదాన్ననా ? వెర్రి కోపంతో వార్ని హడల గొడుతున్న గయ్యాళి భార్య



"కొత్తఫాషన్ అనుకునేవు, నేను వచ్చేటప్పుడు దారిలో సుడిగాలి వచ్చింది"

ననా"? అని గద్దించాను రాధిక నవ్వాపుకుని "మీరు ఇద్దరూ వెర్రివాళ్ళే లే

సుశీ! ఒకరి తప్పూ మరొకరి ఒప్పూ లేదు. కాకపోతే మా అన్నయ్య—నువ్వు శ్రీమతి వనే సంగతి మర్చిపోలేకా, నువ్వాయన భర్త అనే సంగతి మర్చిపో లేకా యిలాటి మనస్తాపాలకు గురవు తున్నారు. బాగా ఆలోచించుకో! ఆయన నీకు చిన్నప్పట్నుంచీ చనువైన మేన బావా, స్నేహితుడూ కూడాను. మనసు విప్పి అంతా చెబితే అర్థం చేసుకోలేని వారు కాదు నువ్వు నీ మనో భావాలు విడ మర్చి చెప్పడంలోనే వుంది మీ భవిష్య త్సుఖానికి కీలకం" అంది.

ఇంకేదో చెప్పబోయింది కాని—నా కప్పటికే పూర్తిగా కనువిప్పయింది. "ఇక నేం చెప్పిపోడవకే ఆడబిడ్డా! చాల్లే ఈ ముప్పూటల భాగోతం" అనేశాను రాధిక క్షణం తెల్లబోయింది అంతలోనే మేం కూర్చున్న డ్రాయింగ్ రూంలోని టెలిఫోన్ మోగింది నే వెళ్ళి రిసీవర్ తీసుకున్నాను

అవతల మా వారి గొంతు —

"హల్లో దిస్ ఈజ్ మూర్తి స్పీకింగ్... సుశీలగా రున్నారా?"

నేను "ఓ! మీరా?! సుశీలగారు వచ్చి వెళ్ళి పోయారు, మీ భార్య మాత్రం వుందండీ సార్!'' అన్నాను. రాధిక ఫకఫక నవ్వు తున్నది

ఆయన "ఓ...ఆc?...రాధికగారు ఉన్నారా.'' నేను, "రాధికగారా? లేరు లెండి. ఇప్పుడే వాళ్ళ తమ్ముడింటికి వెళ్ళి పోయారు. మీరేమాటలైనా నా మొహం మీదే అనొచ్చు గదండీ'' రాధిక మరింత నవ్వి. నన్ను వెనుక నుంచే ముద్దుపెట్టు కుని, "వాళ్ని ఇంటికి పిలువు — పనయ్యాకే రమ్మనుగాని వెర్రిగా పట్టు బట్టకు" అని నా చెవిలో చెప్పింది

ఆయన "మాట్లాడ వేం సుశీలా?"

నేను "మీ రొకసారి ఇంటికి దయ చేయగలరా? ఆఫీసు పని అయిం తర్వాతనే సుమండీ!"

ఆయన "ప్రొద్దుట్నుంచీ పదిరోజుల పని చేశాను ఈ రోజంతా మన్నాపెట్టే స్తాను వస్తున్నా రాణీ"

నేను "రాణి దగ్గరకైతే రానే వద్దు భార్యో దాసీదో కావాలంటే రండి"

అంతలోనే సిగ్గు వేసి, టెలిఫోన్ పెట్టేశాను. అప్పటికే రాధిక వెళ్ళి పోయింది

## 15

మూర్తి ఆఫీసునుంచి యింటికి రావ డానికి పావుగంట కూడా పట్టివుండదు అప్పటికే సుశీల స్నానం చేసి, బట్టలు మార్చుకుని, పెద్దముత్తయిదులా పావలా కాసంత కుంకుమ బొట్టుకూడా పెట్టుకుని, గేటులో నిలిచి ఎదురు చూస్తున్నది

మూర్తి కారు నాపుచేస్తుండగానే ఆమె ముందుకు వెళ్ళి డోర్ తీసి, చిలిపిగా నవ్వి, "వెల్ కం హోమ్ మైడియర్" అంది మూర్తి ఇగ్నిషన్ కీస్ తీసుకొని

జేబులో వేసుకోబోతున్న వాడల్లా తెల్ల బోయి, తాళం చేతుల గుత్తి నక్కడే వది లేశాడు. సుశీల "నన్ను క్షమించరూ?!" అంటూనే డ్రయివర్ సీట్‌లో వున్న అతని పాదాలను పట్టుకుని తల వంచు కుంది. మూర్తి తత్తర పడుతూ, నిద్ర లోంచి లేచినట్లు కళ్ళు నులుము కున్నాడు. మరుక్షణంలోనే సుశీల గడ్డాన్ని తన తర్జనితో పైకెత్తుతూ, "ఇదేమిటి సుశీ? నీ కేమన్నా మతిపోయిందా?" అని అడుగుతూనే, తన కాళ్ళను వెనక్కు జరుపుకో బోయాడు.

సుశీల కళ్ళలో నీళ్ళు [illegible]యి. అతని కళ్ళలోకి దీనంగా చూస్తూ, చేతులు మరింత సాచి అతని పాదాలను తాకుతూ, "పిచ్చనండి, వెర్రనండి_క్షమించితే గాని మీ పాదాలు వదల్ను" అంది. మూర్తి నవ్వి "ప్రతి దానికీ ఇంత పట్టుదలేనా సుశీ? ఇప్పుడు నేనే నిన్ను మన్నించమని అడగాలని వస్తే, నువ్వు నా క్షమాపణ కోరడ మేమిటీ? రాత్రి నే నంత దురుసుగా మాట్లాడి నిన్నెంత నొప్పించానో, ఎంత హీనంగా అలిగిపోయానో తలుచుకుంటే నాకు సిగ్గు వేస్తున్నది. లే, లే_" అని భుజాలు పట్టుకుని వెనక్కు జరుప బోయాడు.

ఆమె మరింత పట్టుదలగా అతని పాదాలను కావిలించుకుంటూ, "మీ రిలా మాట్లాడితే నా కిక ముక్తి వుండదు క్షమాపణకూడా అర్హురాల్ని కాదంటే నే బ్రదకలేను. మిమ్మ మీరు కించపరచు కుంటే అది నాకు సంతోషాన్నిస్తుం దను కోవడం మానివెయ్యండి. నన్ను క్షమిం చండి" అంటుండగానే, ఆమె కన్నీటి బిందువులు అతని పాదాలమీద పడ్డాయి.

మూర్తి త్రుళ్ళిపడి, ఆమెను బలవం తంగా వెనక్కు జరుపుతూ "సరే; సరే సుశీ! నిన్ను క్షమించాను లే...పద లోపలికి...ఈ రోడ్డుమీద, ఇట్లా__'' అంటున్నాడు. సుశీల తల విదిలించుకుని కన్నీరు జలజల పూలలా రాల్చేసింది. అంతలోనే నవ్వు తెచ్చుకుంటూ, ''ఏమండీ_ బజార్లో నలుగురూ చూచి నవ్వుతా రనా? లేక; భార్యకు చాద స్తపు పాతివ్రత్యం నేర్పిన అహంకార పురుషు డని మిమ్మల్ని ఆడిపోసుకుంటా రనా? ఈ పై మెరుగుల లోకపు మెప్పుల కోసం భార్యగా నాకుగల స్థానాన్ని, హక్కును కాదంటారా?" అని అడిగింది.

అతడు నిర్విణ్ణుడై చూస్తూనే ఆమెను పొదివి పట్టుకున్నాడు. ఆమెనిజంగా తన కర్థంకాని మరో స్త్రీలావుంది. కాని ఆమె మాటలతీరు తానెన్నడో కలలో కాంచినట్టే వుంది. భార్యను నడిపించుకుంటూ, ఇంట్లోకివస్తూ; "ఈ హఠాత్పరిణామాని క్కారణం ఏమిటని" అడిగాడు. "సుశీ ఎన్నడూలేంది ఈ పాదాభివందనా లేమిటీ, ఈ వాలక మేమిటీ, ఈ మాట లేమిటీ?" అని అడిగాడు సుశీల భార మంతా అతనిమీదే వేసినట్లు, ఎద నాను

క్షుని నడుస్తూ : ''మామూలు సుశీలనైతే 'నీ కెందుకూ, నా యిష్టం' అనే దాన్ని కదూ ? అట్లా అని నన్ను నే వంచించుకో లేనిక మూర్తీ. ఆ సుశీల చచ్చిపోయిం దన్నది అందుకే. నేనిప్పుడు వట్టి భార్యను మాత్రమే. అందుకనే -'నా హక్కును చెయిసాచి అడుగుతున్నాను'' అంది.

మూర్తి ఆమెను డ్రాయింగ్ రూం లోని ఒక సోఫాలో భద్రంగా కూర్చో బెట్టబోతూ : ''విచిత్రంగా వున్నాయ్ నీ మాటలు ! నువ్వేం అడిగితే కాదన్నాను సుశీ - ఇవ్వాళిలా యాచించవలసి వచ్చి నట్టు మాట్లాడుతున్నావు ?'' అన్నాడు. సుశీల అతని పట్టును వదిలించుకుని, అతనినే సోఫాలో కూర్చోబెట్టి, తాను పాదాలముందు కూర్చోబోయింది. మూర్తి వారించబోతే : "అదుగో మళ్ళీ నా స్థానానికి నన్ను దూరం చేస్తున్నారు-" అని, అతని పాదాల ప్రక్క చదికిలబడి అతని ఒళ్ళోకి చేరగిలబడింది. అతడు గోముగా ఆమె చెక్కిళ్ళను సవరించ సాగాడు.

సుశీల క్షణంలో మధురాతి మధుర మైన అనుభూతికిలోనై, అంతలోనే తెప్పరిల్లి లేచింది. అతని కళ్ళలోకి సూటిగాచూస్తూ "నాక్కావలసిందీ, నా కిష్టమయిందీ అనుకుంటూ అనేకానేక సందర్భాల్లో మీక్కావలసినవీ, మీ యిష్టాలూ త్యాగం చేసుకున్నారు ఈ రోజున పునర్జన్మ ఎత్తిన మీ భార్య చెబు తున్న మాటలు మరిచిపోకండి. భార్య క్కావలసింది త్యాగంచేసే మానవాతీత పురుషుడు కాదు-భర్త; లోకసహజమైన మమకార వికారాలన్నీవున్న భర్త!!" అంది.

ఉపన్యాసంలావున్న ఆమె మాటల్ని మూర్తి అర్థంచేసుకోజూస్తున్నాడు. అతని మనసు కేదో అర్థమౌతున్నట్లే వుంది. ''ఇంతకీ నువ్వు చెప్పేదేమిటో సూటిగా చెప్పగూడదా సుశీ!" అని అర్థించాడు. సుశీల నవ్వి "అట్లా అర్థించి నట్లు అడగవలసింది నేను. మగవారి కాధోరణి మప్పదు. మీ రాజ్ఞాపించవలసిన వారు —— నేను శిరసావహించ వలసిన దాన్ని. నేను మేనత్త కూతుర్నన్నే వార సత్వం మాటలు మరిచిపోండి. సుశీల షూరిసీకాదు, మా నాన్న మెచ్చుకునే ప్రాణినీకాదు; ఒట్టి సుశీలనే నని, మీ భార్యగాతప్ప నాకు మరో వ్యక్తిత్వం అవసరంలేదనీ గుర్తించితే - అదే నాకు మీ రివ్వవలసిన భిక్ష" అంటూనే మళ్ళీ పాదాలు సవరించింది.

మూర్తి ఈసారి పాదాలు వెనక్కు లాక్కోలేక పోయాడు. మనసు అలా చెయ్యమన్నా, హృదయం ఆ పని కొప్పుకోలేదు. అతడు మనసారా నవ్వుతూ ''నువ్వు చెప్పేమాటలు సబబు గానే వున్నాయ్ సుశీ' కాని-ఈ రెండేళ్ల నుంచీ ఎన్నడైనా నువ్విట్లా మారితేగాని బాగుండదనే భావం కనబరచలేదుగదా

నేను. మన జీవితాల్లో ఏదో లోటు ప్రవేశించిందనే భావం నా కెన్నడూ కలగలేదే!!" అన్నాడు.

సుశీల ముఖం పైకెత్తి భర్త కళ్ళలోకి చూస్తూ "నేను మీకంటే తెలివిగల దాన్ననా నన్ను అడుగుతున్నారు. ఇదే అసలు చిక్కు మూర్తీ. నేను శ్రీమతిననే భావంతోనే ఆనాడు పెళ్ళి కళ్యంతరాలు చెప్పారు. పెళ్ళాడినా శ్రీమతిని తృప్తిపరచాలనే అనుక్షణం తాపత్రయపడ్డారు. నన్ను గౌరవించి, మీరు నాకంటే తక్కువ స్థాయికి చెందినవారైనట్లు ప్రవర్తిస్తే సంసారం సుఖ శాంతి నిలయం అవుతుం దనుకున్నారు. కాని — నేను శ్రీమతిగానే వుండలేక పోయాను మూర్తీ.

"ఆరునెల్ల సావాసంతో అటువారిటు మారతారంటారు. నా మనసలాగే మారిపోయింది. మీవంటి ఉత్తమ పురుషునికి తగ్గ భార్యగా ఈ శ్రీమతి తనను తా మలుచుకో జూచింది. మనసు మారినా మాటలు మారలేదు. తలిదండ్రులు నేర్పిన చిలక పలుకులూ, చిరు దురహంకార ప్రవర్తనా ఓపట్టాన మారవు గావల్ను. మనసులోని మమకారాన్ని — మాటల వికారాలు మింగివేస్తూ — నా జీవితాన్నే రాహుగ్రస్తం చేశాయి. రెండేళ్ళు సంసారం చేసినా నేను మీలాంటి దాన్ని కాలేననే అనుకుంటున్నారా? నిజం చెప్పండి — నేను మీ భార్యగా, సర్వ విధాలా అర్ధాంగిగా మారా లనుకోవడం తప్పా?" అని ఆక్రోశంతో అడిగింది.

ఆమె ఆర్తి మూర్తి కిప్పుడు బాగా అర్థమయింది. "నిన్ను తప్పుబట్టడం ఇక నాచేతకాదు సుశీ! నేను నీకంటె అజ్ఞానంలో వుండబట్టే — ఇప్పటి వరకూ నీ అంతర్య సౌందర్యాన్ని, సౌశీల్యాన్ని గుర్తించలేక పోయాను. శ్రీమతి వే నను కున్నానుగాని సుశీల అనే పేరున్నదానివే అనుకున్నాగాని, — సుగుణశీలా లన్నీగల భార్యవని గుర్తిచలేక పోయాను. నే నే ఓ విశాల హృదయుడనై నిన్నుద్ధరిస్తున్నట్టు భావించిన పురుషుణ్ణి — వట్టి పురుషుణ్ణి. ఈ తప్పంతా అసలునాదే! అందుకు క్షమించ వలసిందని అడిగి నీకు తగ్గ భర్తగా మెలగడమే నా కర్తవ్యం — లే. లే...ఆకలవుతూంది" అన్నాడు.

సుశీల వేయిమడుంగుల ఉత్సాహంతో లేచి, మళ్ళీ చివాలునవంగి అతనికి పాదాభివందనంచేసి కళ్ళ కద్దుకుంది. తటాలున అతని ఒళ్ళోకూచ్చుని: "షట్కర్మయుక్తా, కులధర్మపత్నీ అనే శ్లోకం మరిచిపోరుగదూ? పనుల్లో దాసీ దానిగాతప్ప — తతిమ్మా అన్నిటా యధా ధర్మంగానే చూచారింతకు ముందు. ఇక ముందీదాసీతనం కూడా నా ముచ్చటకేనని ఒప్పుకుంటారుగదూ?" అని అడుగుతూ గట్టిగా కంఠాన్ని కావులించుకుంది.

మూర్తి ఆమెనుదురుమీద వెచ్చగా ముద్దుపెట్టుకుని "అమ్మదొంగా! అదా నీ ముచ్చటంతా ?! నేనింతవరకూ అర్థమే చేసుకోలేదు ఇల్లాలు పనిచేస్తానంటే - ఈ యజమాని వద్దనడులే ఇంక, మరి - మధ్య మధ్య కీచులాటలు కూడా వుంటేనే గాని జీవితం వడ్డించిన విస్తరి కాదంటావా ఏమిటీ ?!" అన్నాడు.

సుశీల మరింతగా అతనిలో ఐక్యం కాజూస్తూంది "అది కాదండీ! 'మీరు' అనడంకూడా చేతకానట్లు 'నిన్ను' అని సంబోధించే ఈ నోటిమీద ఎప్పుడన్నా ఒక్కటి వడ్డిస్తేగాని తిక్క కుదురుతుందా చెప్పండి భర్తను - మీ లాంటి భర్తను కూడా ఈ నోరు 'నువ్వు' అంటుందే, అట్లాంటివే - తెలివితక్కువగానో, మీ మాట లర్థంచేసుకోని అహంతోనో నేను మాట్లాడినప్పుడు మీ రేమీ అనకుండా వూరుకుంటే - నాకు ద్రోహం చేసినట్లే గదా!" అంది

మూర్తి ఆమెను మరింత బిగ్గ కౌగలించుకుని "మరేం చెయ్యాలి ?" అన్నాడు సుశీల "అబ్బ! అది కూడా నేనే చెబితే ఏం బావుంటుందండీ రిహార్సల్ వేసుకున్న నాటకం కాదుగ జీవితం ? నాక్కావల్సింది పులిబావకాః పిల్లిబావకాదు" అంది మూర్తి పకపక నవ్వి "మధ్య మధ్య రోకటి పచ్చడి వడ్డింపులు వుంటేగాని ఈ భార్య, ఈ భర్తను భరించలేదన్నమాటా!! అన్నాడు

సుశీల "మానవాతీతుడైన భర్త - తనను తాను కించపరచుకుంటూ, భార్యనే మిన్నగాచూడ్డం ఆడదానికి భాగ్యం కాదండీ - స్త్రీకి అంతకుమించిన శిక్ష మరొకటుండదు నాక్కావలసింది పేదమేనమామ కొడుకననే సంగతి మరువలేని మనీషికాదు స్నేహితమాత్రుడూగాదు - భర్త, సాదాభర్త!! మమకారంతోపాటు వికారాలు కూడా వున్న భర్త!" అని నొక్కి నొక్కి చెప్పింది

మూర్తి "తథాస్తు!" అన్నాడు

